నమస్తే తెలంగాణ
తాజా వార్తలు, ఈ పేపర్ కోసం ntnews.com చూడండి.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక




మంగళవారం 31.03.2020 • సంపుటి 9 • సంచిక 276 • వెల. రూ. 6.50 | కరీంనగర్ పేజీలు : 12 | ఈ రోజు నుంచి జిల్లా టాబ్లాయిడ్‌లు మెయిన్‌లో.. | సప్తమి

సూర్యోదయం: ఉదయం 6.10, సూర్యాస్తమయం: సాయంత్రం 6.23, శార్వరి సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం సప్తమి బుధవారం తె.ఝా. 3.50 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: మృగశిర సాయంత్రం 6.45 వరకు, తదుపరి ఆరుద్ర, అమృతఘడియలు: ఉదయం 9.25 నుంచి 11.07 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.20 నుంచి సాయంత్రం 4.53 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.37 నుంచి 9.26 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.20 నుంచి 3.09 వరకు, వర్జ్యం: బుధవారం తె.ఝా 3.24 నుంచి ఉదయం 5.03 వరకు.

PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline



సోమవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఐదు కోట్ల రూపాయల చెక్కు, ఐదు కోట్ల విలువైన ఔషధాల విరాళానికి సంబంధించిన పత్రాలను ముఖ్యమంత్రి కే సీఆర్‌కు అందజేసిన హెటిరో డ్రగ్స్ చైర్మన్ పార్థసారధిరెడ్డి, డైరెక్టర్ రత్నాకర్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ కూడా ఉన్నారు.

ఢిల్లీలో మత ప్రార్థనలు.. పాల్గొన్నవారికి కరోనా

# ఆరుగురి బలి

- నిజాముద్దీన్ తబ్లిగీ మసీదులో ఈ నెల 13-15 మధ్య కార్యక్రమం
- విదేశాల నుంచి వచ్చిన పలువురు.. వారి నుంచే కరోనా వైరస్ వ్యాప్తి
- తెలంగాణ, ఏపీ సహా అనేక రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో హాజరు
- కార్యక్రమం అనంతరం వివిధ ప్రాంతాలకు తరలివెళ్లిన భక్తులు
- వారి కోసం గాలిస్తున్న ప్రభుత్వం.. వివరాలివ్వాలని ప్రజలకు పిలుపు



ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో తబ్లిగీ జమాత్ ప్రధాన కార్యాలయం

### క్వారంటైన్‌లో ఇప్పటికే 2 వేల మంది

### మర్కజ్ మౌలానాపై కేసు: కేజ్రీవాల్

ఢిల్లీలో జరిగిన ఒక మత కార్యక్రమం.. ఇప్పుడు కరోనా కలకలానికి కారణమైంది. తీవ్రమైన ప్రమాద ఘంటికలు మోగించింది. నిజాముద్దీన్ ప్రాంతంలోని 'తబ్లిగి ఏ జమాత్' మార్చి 1-15 మధ్య జరిగిన ఈ కార్యక్రమానికి విదేశాల నుంచి పలువురు హాజరయ్యారు. తెలంగాణతోపాటు పలు రాష్ట్రాల నుంచి వందలమంది ఇందులో పాల్గొన్నారు. విదేశాల నుంచి వచ్చిన వ్యక్తుల ద్వారా వీరిలో పలువురికి కరోనా వైరస్ సోకినట్టు ప్రభుత్వాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ మత కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణవాసుల్లో ఆరుగురు ఇటీవల మరణించినట్టు వైద్య ఆరోగ్యశాఖ ధ్రువీకరించింది. ఆ కార్యక్రమంలో పాల్గొన్నవారి వివరాలను తమకు అందజేయాల్సిందిగా ప్రజలకు పిలుపునిచ్చింది.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఢిల్లీ నిజాముద్దీన్ ప్రాంతంలో ఉన్న 'తబ్లిగి ఏ జమాత్' లోని మర్కజ్ (సమావేశ కేంద్రం) లో మార్చి 1 నుంచి 15 వరకు మతపరమైన ప్రార్థనలు జరిగాయి. ఇందులో తెలంగాణ, ఏపీ సహ పలు రాష్ట్రాలనుంచి అనేకమంది పాల్గొన్నారు. మలేషియా, ఇండోనేషియా, సౌదీ అరేబియా, కిర్గిజ్‌స్థాన్, చైనా, ఇంగ్లండ్, శ్రీలంక దేశాలకు చెందిన దాదాపు వందమంది విదేశీయులు ఈ ప్రార్థనల కోసం మర్కజ్‌కు వచ్చారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ నుంచి హాజరైన వారిలో ఆరుగురు ఆ తరువాత కొద్దిరోజులకు మరణించారు. వీరిలో ఇద్దరు గాంధీ దవాఖానలో, ఒకరు అపోలో, ఒకరు గ్లోబల్ దవాఖానలో, నిజామాబాద్, గద్వాలలో ఒక్కొక్కరు మరణించారు. వీరందరికీ కరోనా సోకినట్లు తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నది. రెండురోజుల క్రితం ఖైరతాబాద్ ప్రాంతంలో చనిపోయిన వృద్ధుడు కూడా వీరిలో ఒకరు. ఇతను కూడా ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇతనికి కరోనా ఉన్నట్లు చనిపోయిన తరువాత నిర్ధారణ

మిగతా 4వ పేజీలో

### 13 మందికి నయం..ఆరుగురికి వైరస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో సోమవారం కరోనా వైరస్‌తో మరొకరు మృతిచెందారు. కొత్తగా 6 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఐసొలేషన్ కేంద్రాల్లో చికిత్స పొందుతున్నవారిలో 13 మంది పూర్తిగా కోలుకున్నారు. ఇప్పటికే ఒకరిని డిశ్చార్జ్ చేయగా, మిగిలిన 61 మందికి వైద్యసేవలు అందిస్తున్నట్టు వైద్యారోగ్యశాఖ బులెటిన్‌లో పేర్కొన్నది.

# వేతనాలకు కరోనా కాటు

- సీఎం నుంచి బంట్రోతు దాకా జీతాల్లో కొంత వాయిదా
- ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన తర్వాత బకాయిల చెల్లింపు
- సీఎం ఉన్నతస్థాయి సమీక్ష అనంతరం సర్కారు నిర్ణయం
- వెంటనే జీవో విడుదల.. అందులోనే సమగ్ర వివరాల వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తి తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నది. అటు ఆదాయం పడిపోవడం.. ఇటు కరోనా వ్యాధి నివారణ, సహాయ చర్యలకు భారీ ఎత్తున ఖర్చు చేయాల్సి రావడం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి మొదలుకొని అందరు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఇతర ఉద్యోగులకు ఈ నెల చెల్లించాల్సిన (మార్చి నెల) వేతనాల్లో కొంత మొత్తాన్ని వాయిదా వేయాలని ప్రభుత్వ నిర్ణయించింది. ఇలా వాయిదా వేసిన మొత్తాన్ని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన తర్వాత తిరిగి చెల్లిస్తారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. సోమవారం ప్రగతిభవన్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమగ్రంగా సమీక్ష జరిగింది. అనంతరం వివిధ రకాల ప్రజాప్రతినిధుల, ఉద్యోగుల వేతనాల్లో కొంత మొత్తాన్ని వాయిదావేస్తూ నిర్ణయం తీసుకొన్నారు. ఈ నిర్ణయం మేరకు

మిగతా 4వ పేజీలో

**ఎవరి వేతనాల్లో ఎంత కోత?**

| | |
|---|---|
| 75% | ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల వేతనాల్లో |
| 60% | ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర అఖిల భారత సర్వీసు అధికారుల వేతనాల్లో |
| 50% | మిగతా అన్ని క్యాటగిరీల ఉద్యోగుల వేతనాల్లో |
| 50% | అన్ని రకాల రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లలో |
| 10% | నాల్గవ తరగతి, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాల్లో |
| 10% | నాల్గవ తరగతి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లో |

అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ గ్రాంటు పొందుతున్న సంస్థల ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల మాదిరిగానే వేతనాల్లో కోత విధిస్తారు.



# మా ప్రజలను కాపాడుకుంటాం

- కరోనా మహమ్మారి ఊహించని పెను ఉత్పాతం
- కట్టడికి సీఎం కేసీఆర్ అన్ని జాగ్రత్తలు
- కరోనా సోకితే మరణమే అనేది కరెక్ట్‌కాదు
- రాష్ట్రంలో పదిలక్షల మంది వలసకార్మికులు
- వారు తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు
- సీఎన్ఎన్ న్యూస్ 18తో మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా ఊహించని సంక్షోభమని, దానిని ముందస్తుగా అంచనావేసి.. నష్టనివారణ చర్యలు చేపట్టడం ఏ ప్రభుత్వానికీ సాధ్యంకాదని ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారక రామారావు అన్నారు. అయినప్పటికీ, ఈ పెను ఉత్పాతం నుంచి బయటపడేందుకు.. ప్రజలను కాపాడేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సోమవారం సీఎన్ఎన్ న్యూస్18కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. కరోనా సమస్యపై మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులతోపాటు, వలసకార్మికుల సమస్యలను పరిష్కరించడంపై కూడా దృష్టి సారించామని అన్నారు. కరోనాతో భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, సొంతూళ్లకు వెళ్లాలనుకునేవారికి ముందుగా ఈ విషయం అర్థమయ్యేలా చెప్పాల్సి ఉన్నదన్నారు. కొవిడ్-19పై పెద్దగా అవగాహనలేని చాలామంది.. అది సోకితే ఇక చనిపోవాల్సిందేననే అపోహలో ఉన్నారని తెలిపారు. ప్రపంచ గణాంకాలను చూస్తే.. కరోనా సోకినవారిలో నాలుగుశాతం మంది మాత్రమే మృత్యువాతపడ్డారని, మనదేశంలో ఇది ఇంకా తక్కువేనని పేర్కొన్నారు. ప్రభుత్వాలు, రాజకీయనాయకులు, మీడియా నుంచి ప్రతిఒక్కరూ సామాన్య ప్రజానీకానికి స్పష్టమైన సందేశాన్ని అందించాలని మంత్రి కేటీఆర్ సూచించారు. తెలంగాణలో 70 మందికి కరోనా సోకితే పన్నెండుమందికి నయమైపోయిందని అన్నారు. కరోనా సోకితే చనిపోవడమే నంటూ.. ఆఖరి ఘడియల్ని తమ స్వస్థలాల్లో గడుపుదామనే తప్పుడు ఆలోచనల నుంచి ప్రజలు

మిగతా 3వ పేజీలో


కరోనా వైరస్ పరీక్షలు

# నేటినుంచి సీసీఎంబీలో

- ఐసీఎమ్మార్ అనుమతి జారీ
- కోవిడ్ జన్యుక్రమ పరీక్షలకూ సాయం

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)లో మంగళవారం నుంచి కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు మొదలుకానున్నాయి. ఇందుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎమ్మార్) అధికారికంగా అనుమతి ఇచ్చింది. పరీక్షలకు సంబంధించిన కిట్లు అందించడానికి ఏర్పాట్లుచేసింది. దీంతోపాటు కరోనా జన్యుక్రమాన్ని గుర్తించడానికి నిర్వహించే పరీక్షలకు కూడా పూర్తిసాయం అందిస్తామని ఐసీఎమ్మార్.. సీసీఎంబీకి తెలిపింది. జీవశాస్త్రం (లైఫ్ సైన్సెస్) పరిశోధనల్లో అగ్రస్థానంలో ఉన్న సీసీఎంబీని కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలకు వేదికగా వాడుకోవడానికి అవకాశమివ్వాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేసిన విజ్ఞప్తికి.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సానుకూలంగా స్పందించిన విషయం తెలిసిందే. ఇందుకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వెంటనే సీసీఎంబీకి సమాచారం అందింది. కానీ ఐసీఎమ్మార్ నుంచి అధికారిక అనుమతి రాలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం

మిగతా 3వ పేజీలో



సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా

**రిలయన్స్ విరాళం రూ. 500 కోట్లు**

ఎల్‌అండ్‌టీ రూ.150 కోట్లు
రూ.100 కోట్లిస్తున్న హీరో గ్రూప్
పీఎం-కేర్స్‌కు కార్పొరేట్ల వితరణలు

12

**న్యూయార్క్‌లో ఒక్కరోజే 237 మరణాలు**

అమెరికాలో లక్ష మంది చనిపోయే ప్రమాదం: ట్రంప్

5

**పది పరీక్షలకు రీషెడ్యూల్**

నేటినుంచి జరుగాల్సినవి వాయిదా

3

జిల్లాల టాబ్లాయిడ్లకు బదులు మెయిన్ ఎడిషన్‌లోనే రెండు పేజీల్లో జిల్లాల వార్తలు ఇస్తున్నాము. గమనించగలరు.
– ఎడిటర్

ఒక్క పిలుపు.. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఊపిరి! తెలంగాణ రాష్ట్ర సాధనకు లక్షల మందిని కదిలించిన సమ్మోహనశక్తి!

మళ్లీ అదే పిలుపు.. లక్షల మంది వలస కూలీల ఆకలి తీర్చుతున్న ఆత్మీయత!

ఊరుకాని ఊరిలో మేమున్నామనే భరోసా! ఉద్యమమైనా, ఆతిథ్యమమైనా..సీఎం కేసీఆర్ పిలుపుతో లక్షల మంది కదులుతున్నారు!

ఉపాధి కోసం రాష్ట్రానికి వచ్చి లాక్‌డౌన్ కారణంగా ఇబ్బందిపడుతున్న వలస కూలీలకు ఊరూరా ఊహించని సాయం అందుతున్నది. కడుపు నింపుతూ కనీస వసతులు కల్పించేందుకు మేమున్నామంటూ ఔత్సాహికులు ముందుకొస్తున్నారు. తోచిన సాయం చేస్తూ తోబుట్టువుల్లా అండగా నిలబడ్డారు. మరోవైపు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం వలస కూలీలకు ఒక్కొక్కరికి రూ.500, 12 కిలోల బియ్యాన్ని అధికారులు అందజేస్తున్నారు. వలస కూలీలను తెలంగాణ రాష్ట్ర డెవలప్‌మెంట్ పార్ట్‌నర్లుగా చూస్తున్నామని, వారికి ఏ కష్టం రాకుండా కడుపులో పెట్టుకొంటామన్న ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తున్నది. దేశంలో ఏ రాష్ట్రప్రభుత్వం కూడా వలస కూలీలపై మానవీయకోణంలో స్పందించలేదని, సీఎం కేసీఆర్ స్పందించిన తీరుపై అభినందనలు, ప్రశంసలు తెలుపుతూ పలువురు ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా పాటించాల్సిన ధర్మాలు ఏమిటో మిగతా సీఎంలు తెలుసుకోవాలని, తెలంగాణ ప్రజలు సరైన నాయకుడిని ఎన్నుకున్నారంటూ తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు.



మంగళవారం జనగామలో పంపిణీ చేసిన నిత్యావసర సరుకులతో వలస కూలీలు

# ఆత్మీయ ఆతిథ్యం!

**వలస కూలీలకు ఊరూరా సాయం.. భోజనం పెట్టి నిత్యావసరాల పంపిణీ**

**సీఎం కేసీఆర్ పిలుపునకు భారీ స్పందన.. ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం, రూ.500**

ఎక్కడికక్కడే వలస కూలీలకు అందజేత.. కేసీఆర్ నిర్ణయానికి దేశవ్యాప్త ప్రశంసలు

2

## లాక్‌డౌన్-డే 8

ఉష్ణోగ్రతలు

| | గరిష్ఠం | కనిష్ఠం | | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 35.5°c | 23.6°c | మెదక్ | 37.0°c | 24.0°c |
| కరీంనగర్ | 38.0°c | 24.0°c | ఆదిలాబాద్ | 37.3°c | 21.7°c |
| వరంగల్ | 35.0°c | 21.0°c | నిజామాబాద్ | 39.0°c | 23.8°c |
| రంగారెడ్డి | 37.0°c | 24°c | మహబూబ్‌నగర్ | 39°c | 26.5°c |
| నల్లగొండ | 39.5°c | 24.2°c | ఖమ్మం | 39°c | 24°5c |

# తెలంగాణలో కరువుకు చెల్లు

- రాష్ట్రంలో ఏటా 2.25 కోట్ల టన్నుల ఉత్పత్తి
- త్వరలో సమగ్ర ధాన్యం, బియ్యం విధానం
- రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ
- రైస్‌మిల్లులకు పారిశ్రామికవాడల్లో స్థలాలు
- ఎగుమతిచేసే సామర్థ్యంతో పనిచేయాలి
- వరిసాగు, దిగుబడులపై ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



సోమవారం ప్రగతిభవన్‌లో రాష్ట్రంలో వరిసాగుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, గంగుల, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి జనార్దన్‌రెడ్డి, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైస్‌మిల్లర్స్ ప్రతినిధులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** త్వరలోనే తెలంగాణ రాష్ట్ర సమగ్ర ధాన్యం, బియ్యం విధానం రూపొందించనున్నట్టు సీఎం కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. రైస్ మిల్లర్లతోపాటు ఇతర భాగస్వాములందరితో చర్చించి సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రైస్‌మిల్లర్లకు అండగా ఉంటామని తెలిపారు. విధానం ముసాయిదాపై మంత్రివర్గంలో, అసెంబ్లీలో చర్చించి ఆమోదిస్తామని వివరించారు. ప్రపంచమంతా కరువొచ్చినా తెలంగాణలో రాదని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయ్యాయని, చెరువులు జలకళను సంతరించుకున్నాయని, రాష్ట్రంలో వరి పంట దిగుబడి పెరుగుతున్నదన్నారు. రాష్ట్రంలో వరిసాగు, ధాన్యం దిగుబడులు, బియ్యం తయారీ, అమ్మకం, ఎగుమతులపై అవలంబించాల్సిన అంశాలపై సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సమైక్య రాష్ట్రంలో పరిస్థితికి, ఇప్పటికి చాలా తేడా వచ్చింది. కాళేశ్వరం సహా ఇతర భారీ ప్రాజెక్టుల నిర్మాణం, ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల పూర్తి, చెరువుల పునరుద్ధరణ, 24 గంటల ఉచిత విద్యుత్ వల్ల సాగునీరు పుష్కలంగా అందుతున్నది. దీంతో వరిసాగు పెరుగుతున్నది. ఈసారి యాసంగిలో 40 లక్షల ఎకరాల్లో వరి సాగయింది. కోటి టన్నులకుపైగా ధాన్యం వచ్చే అవకాశం ఉన్నది. ఈ వానాకాలంలో 55 లక్షల నుంచి 60 లక్షల ఎకరాల్లో వరిసాగవుతుంది. ఒక్క కాళేశ్వరంతోనే 35 లక్షలకుపైగా ఎకరాల్లో వరి పండే అవకాశం ఉన్నది. వచ్చే ఏడాది కనీసం 70 లక్షల ఎకరాల్లో వరి పండుతుంది. తెలంగాణ ఏటా కనీసం 2.25 కోట్ల టన్నుల ధాన్యం పండిస్తుంది. రాష్ట్రం రైస్‌బౌల్ ఆఫ్ ఇండియాగా మారుతున్నది. ఇంత పెద్దఎత్తున పండిన ధాన్యాన్ని సేకరించి, మిల్లులకు పంపి బియ్యం తయారుచేసి, వాటిని అమ్మడం చాలా పెద్ద పని. దీనికోసం ఇప్పుడున్న పద్ధతి పనికిరాదు. ఎక్కడా ఎవరికీ ఇబ్బంది లేకుండా పండిన ధాన్యం బియ్యంగా మారి అమ్మేవరకు అన్నీ సజావుగా సాగాలంటే సమగ్ర ధాన్యం, బియ్యం విధానం అమలుచేయాల్సిన అవసరం ఉన్నది.' అని చెప్పారు.

### ఇక వేధింపులు ఉండవు

'మిల్లర్లకు ఇకపై అధికారుల నుంచి వేధింపులుండవు. అనేక రకాల అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేకుండా విధానంలో ప్రభుత్వం మార్పులు తెస్తుంది. మిల్లర్లకు సరైన మార్కెటింగ్ వ్యూహం ఉండాలి. తెలంగాణ ప్రజలు ఏ రకం బియ్యం తింటా రు? ఇతర రాష్ట్రాల వారు ఏ రకం బియ్యం తింటా రు? అనే విషయాలను సరిగ్గా అంచనా వేసి, దానికి అనుగుణంగా ధాన్యం రకాలను పండించాలి. వాటిని ఎప్పటికప్పుడు బియ్యంగా మార్చి ఇటు రాష్ట్ర ప్రజలకు, దేశ, విదేశాలకు పంపించాలి. ప్రస్తుతం కరోనా ప్రభావంతో రైస్‌మిల్లుల్లో పనిచేసే హమాలీలు సొంత రాష్ట్రం బీహార్ వెళ్లారు. సీజన్ కాబట్టి, ప్రత్యేక బస్సు ల్లో వారిని తిరిగి రప్పించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లుచేస్తుంది.' అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

### ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లుగా రైస్‌మిల్లులు

'రాష్ట్రంలో రైస్‌మిల్లుల స్థాపనకు పారిశ్రామికవాడల్లో స్థలం కేటాయించే అవకాశాలను పరిశీలిస్తాం. మిల్లులను ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లుగా గుర్తించి, అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తాం. రాష్ట్రంలో గోదాముల సంఖ్యను పెంచాలి. రాష్ట్రం ఏర్పడకముందు కేవలం 4 లక్షల టన్నుల సామర్థ్యం గల గోదాములే ఉండేవి. స్వరాష్ట్రంలో 22 లక్షల టన్నులకు పెంచాం. దీనిని 40 లక్షల టన్నుల సామర్థ్యానికి తీసుకుపోవాలి. రైస్‌మిల్లుల్లో గోదాములు నిర్మించుకోవడానికి సహకారం అందించాలి.' అని అధికారులకు సీఎం సూచించారు.

### విద్యుత్ సామర్థ్యం పెంపు

'రైస్‌మిల్లులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి రైల్వే సైడింగ్స్ ఏర్పాటుచేయాలి. రైస్‌మిల్లు ఎల్‌టీ క్యాటగిరీని 70 హెచ్‌పీల నుంచి 150 హెచ్‌పీకి పెంచే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తుంది.' అని సీఎం కేసీఆర్ తెలిపారు. సమీక్షలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ సత్యనారాయణరెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి జనార్దన్‌రెడ్డి, రైస్ మిల్లర్స్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేందర్, మోహన్ రెడ్డి, చంద్రపాల్, భాస్కర్, ప్రభాకర్‌రావు, సంపత్ కుమార్, కాంతయ్య, యాదగిరి పాల్గొన్నారు.

### రైస్‌మిల్లులకు సాయంచేస్తాం

'తెలంగాణవ్యాప్తంగా 2,200 రైస్‌మిల్లులున్నాయి. ఈ మిల్లులు ఏడాదికి కోటి టన్నుల బియ్యం తయారు చేయగలవు. గతంలో వీటికి సరిపడా ధాన్యం కూడా రాకపోయేది. కరంట్ ఉండకపోయేది. ఫలితంగా 20 లక్షల నుంచి 30 లక్షల టన్నుల బియ్యం తయారు చేయడం కష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ధాన్యం పుష్కలంగా ఉన్నది. 24 గంటలు కరంట్ ఉంటున్నది. దీన్ని మంచి అవకాశంగా చేసుకొని ఎక్కువ వడ్లు పట్టాలి. రాష్ట్ర ప్రజల అవసరాలు తీరడమే కాకుండా, ఎఫ్‌సీఐకి, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయడానికి అనువుగా మిల్లులు పూర్తిసామర్థ్యంతో పనిచేయాలి. ఇంకా కొన్ని మిల్లులు రావాలి. రైస్‌మిల్లులు బాగా నడపడానికి, లాభాల్లో ఉండడానికి ప్రభుత్వపరంగా సాయంచేస్తాం. రైస్‌మిల్లులు రాష్ట్ర ప్రగతిలో భాగస్వామ్యం కావాలి.' అని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు.




## ప్రభుత్వానికి ధన్యవాదాలు

- సీఎం కేసీఆర్, కేటీఆర్‌కు కృతజ్ఞతలు
- హైదరాబాద్‌లో సురక్షితంగా ఉన్నాం
- ఆంధ్రప్రదేశ్ నివాసి ఆనందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా కట్టడికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న పకడ్బందీ చర్యలను ఇతర రాష్ట్రాల ప్రజలు ప్రశంసిస్తున్నారు. హైదరాబాద్‌లో తాము సురక్షితంగా ఉన్నామని ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్తున్నారు. 'నేను ఆంధ్రప్రదేశ్‌వాసిని. హైదరాబాద్‌లో పనిచేస్తున్న. కరోనా కట్టడిలో భాగంగా మొదట్లో నన్ను ఏపీకి వెళ్లకుండా అడ్డుకోవడం ఇబ్బందిగా అనిపించింది. తర్వాత తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, శ్రద్ధ నన్ను ఎంతగానో ఆనందపరిచింది. ప్రస్తుత పరిస్థితుల్లో నేను హైదరాబాద్‌లో చాలా సురక్షితంగా ఉన్నాను. కరోనా వ్యాప్తిని నిరోధించడంతోపాటు అన్ని ప్రాంతాల ప్రజల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు' అని శివయ్య ముండ్లపాటి సోమవారం ట్వీట్‌చేశారు.

## ప్రభుత్వ రుణం తీర్చుకుంటున్నా

**ఓ యువకుడి ట్వీట్.. అభినందించిన మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనాపై పోరాడటానికి శ్రీకాంత్ శరవన్ అనే యువకుడు సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.50 వేలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌తో చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకున్న తాను ప్రజల కోసం కొంత సాయం అందించానని మంత్రి కేటీఆర్‌కు శ్రీకాంత్ ట్వీట్‌చేశారు. ప్రభుత్వ రుణం తీర్చుకొనే అవకాశం లభించిందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మంత్రి కేటీఆర్.. సాయమందించినందుకు శ్రీకాంత్‌ను అభినందించారు. ఓవర్సీస్ పథకం పేద విద్యార్థులకు ఉపయోగపడుతున్నందుకు సంతోషంగా ఉన్నదని చెప్పారు.

## మీ సేవకు సెల్యూట్

**ట్విట్టర్లో మహిళా కానిస్టేబుల్ యశోదకు మంత్రి కేటీఆర్ అభినందన**



సైదాబాద్: లాక్‌డౌన్ సందర్భంగా మానవత్వంతో స్పందించిన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ మహిళా కానిస్టేబుల్ యశోదను మంత్రి కేటీఆర్ అభినందించారు. ఆపన్నులను ఆదుకోవడానికి 100 కిలోల బియ్యం విరాళంగా ఇవ్వడం అభినందనీయమని ట్విట్టర్ ద్వారా తెలిపారు. ఇలాంటి క్లిష్టసమయంలో ఉచిత ఆహార సరఫరాకు సహాయంగా ఉండేలా ఉడతా భక్తిగా బియ్యం అందజేసి ఉదారతను చాటుకొన్నారంటూ కేటీఆర్ పేర్కొన్నారు.

## వెల్‌డన్ జగన్..!

**అత్యవసర రోగికి రక్తదానంపై మంత్రి కే తారకరామారావు**

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: గ్రేటర్ టీఆర్‌ఎస్ యువజన విభాగం సీనియర్ నాయకుడు పాటిమీది జగన్మోహన్‌రావు అత్యవసర రోగికి రక్తదానం చేసి మంత్రి కేటీఆర్ నుంచి ప్రశంసలు అందుకున్నారు. బుధవారం పంజాగుట్ట నిమ్స్‌లో బైపాస్ సర్జరీ చేయించుకోనున్న హరికృష్ణకు ఓ నెగిటివ్ రక్తం అవసరం ఏర్పడింది. బ్లడ్ బ్యాంకుల్లో ఈ గ్రూప్ రక్తం లేకపోవడం, కరోనా నేపథ్యంలో రక్త సేకరణకు వీలు లేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంలో హరికృష్ణను ఆదుకోవాలని నాగేంద్రబాబు అనే వ్యక్తి మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా విజ్ఞప్తిచేశారు. దీనిపై మంత్రి కేటీఆర్ స్పందించి రీ ట్వీట్ చేశారు. దీనిపై స్పందించిన జగన్.. సోమవారం పంజాగుట్ట నిమ్స్‌కు వెళ్లి రక్తదానంచేశారు. విపత్కర పరిస్థితుల్లో రక్తదానంచేయడంతో 'వెల్‌డన్ జగన్' అంటూ మంత్రి కేటీఆర్ అభినందించారు.

### లోకం పోకడ




వైరస్ సోకిన జబ్బు కాదు, వైన్‌షాపుల మూసివేతతో సోకిన వింతజబ్బు!

# ఆత్మీయ ఆతిథ్యం!

## వలసకూలీలకు ఊరూరా సాయం

**భోజనం పెట్టి నిత్యావసరాల పంపిణీ ● సీఎం కేసీఆర్ పిలుపునకు భారీ స్పందన**

**ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం, రూ.500 అందజేస్తున్న అధికారులు**



సోమవారం మహబూబాబాద్ మండలంలోని కొమ్ముగూడెం తండాలో వలసకూలీలకు బియ్యం, నగదు పంపిణీ చేస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రంలో ఉపాధి కోసం వచ్చిన వలస కూలీలు లాక్‌డౌన్ కారణంగా ఆకలితో అలమటించద్దని, వారికి అం డగా నిలువాలన్న చేయాలన్న సీఎం కేసీఆర్ పిలుపునకు అనూహ్య స్పందన వచ్చింది. ఊరూవాడా తేడా లేకుండా స్వచ్ఛంద సంస్థలు, స్థానిక నాయకులు, ఔత్సాహికులు తమవంతు సాయం చేస్తున్నారు. నిత్యావసరాలు అందజేస్తూ, భోజనవసతి కల్పిస్తూ త్యాగనిరతి చాటుకుంటున్నారు. మరోవైపు సీఎం కేసీఆర్ ఆదేశాలతో వలస కూలీలకు ఒక్కొక్కరికి రూ.500, పన్నెండు కిలోల బియ్యం పంపిణీ సోమవారం మొదలైంది. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం బియ్యం పంపిణీలో నిమగ్నమైంది. ఫంక్షన్‌హాళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో వలస కూలీలకు వసతి కల్పించి భోజనం అందజేస్తున్నారు.

### వలస కూలీలకు అన్నదానం

కరీంనగర్‌లోని శాతవాహన వర్సిటీ సమీపంలో డేరాలు వేసుకొని జీవిస్తున్న కర్ణాటక వలస కూలీలకు జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు సోమవారం అన్నదానం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో బొమ్మలు విక్రయిస్తూ జీవిస్తున్న 24 మంది వలస కార్మికులకు తిమ్మాపూర్ తాసిల్దార్ బండి రాజేశ్వరి అల్గునూర్ శివారులోని సీవోఈలో వసతి ఏర్పాట్లుచేశారు. హైదరాబాద్ నుంచి కాలినడకన వెళ్తున్న 32 మంది వలస కార్మికులను కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, ట్రైనీ ఐపీఎస్ నికితాపంత్ అల్గునూర్ శివారులోని లక్ష్మీనర్సింహ గార్డెన్‌కు తరలించి భోజన వసతి కల్పించారు. మహారాష్ట్రలో పరిశోధన (రీసెర్చ్) కోసం వెళ్లిన హైదరాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన అగ్రికల్చర్ విద్యార్థులు తిరుగుప్రయాణంలో కరీంనగర్ జిల్లాలోనే ఆగిపోయారు. వీరందరికీ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కొండ సత్యలక్ష్మి గార్డెన్‌లో వసతి ఏర్పాటుచేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధి పంతంగి టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టును సీపీ మహేశ్‌భగవత్ పరిశీలించారు. హైదరాబాద్ నుంచి కూలీలు డీసీఎంలో సొంతూర్లకు వెళ్తుండగా ఆపి భోజనం ప్యాకెట్లు అందించి వెనుకకు పంపారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో 250 మంది వలస కార్మికులకు టీఆర్‌ఎస్ నాయకుడు బచ్చుపల్లి గంగాధర్‌రావు ఆహారం అందజేశారు. హాలియాలో బీహార్ కూలీలకు దివ్య రైస్ ఇండస్ట్రీస్ ఆర్థికసహకారంతో 75 కిలోల బియ్యాన్ని తాసిల్దార్ మంగా అందజేశారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన 100 మంది కార్మికులకు అధికారులు నిత్యావసరాలు అందజేశారు.

### వెల్లివిరిసిన సేవాభావం

మహారాష్ట్ర, బీహార్ కూలీలకు నిర్మల్ పోలీసులు స్థానిక దివ్యాగార్డెన్‌లో ఆశ్రయం కల్పించారు. ఎస్పీ శశిధర్‌రాజు ఆహార పొట్లాలు, తాగునీరు అందజేశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ కూలీలకు దస్తురాబాద్‌లో రేషన్ బియ్యం పంపిణీచేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఇతర రాష్ట్రాల కార్మికులకు ఎస్పీ రాహుల్‌హెగ్డే ఆహార వస్తువులను అందజేశారు. 60 మంది వలస కార్మికుల కుటుంబాలకు పదిరోజులకు సరిపడా నిత్యావసర సరుకులను దాతలు గీతాభవన్, ఎన్‌వీఆర్ రావు గార్డెన్స్, హరికృష్ణ లాడ్జి, మహేశ్వరి మెడికల్ యజమానులు తీసుకొనిరాగా మంచిర్యాల డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏసీపీ లక్ష్మీనారాయణ అందించారు. మంచిర్యాల రైల్వేస్టేషన్ ఏరియాలో ఎమ్మెల్యే తనయుడు నడిపెల్లి విజిత్‌రావు భోజన వసతి కల్పించారు. జైపూర్ మండల కేంద్రంలో మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన ఏడు భవన నిర్మాణ కుటుంబాలకు 15 రోజులకు సరిపడా బియ్యం, సామగ్రిని పోలీసులు అందజేశారు. కోటపల్లి మండలం ఆలుగామలో రోడ్డు పనుల్లో పాల్గొంటున్న కూలీలకు ఎంపీపీ మంత్రి సురేఖ, సర్పంచ్ కుమ్మరి సంతోష్, ఎంపీటీసీ గోమాస రజిత నిత్యావసరాలు అందజేశారు. జనగామ జిల్లాలో జిన్నింగ్, కాలువ, రైస్ మిల్లుల్లో పనిచేయడానికి వచ్చిన 1,447 మంది కార్మికులకు పరిశ్రమల యజమానులే వసతి, నిత్యావసరాలు కల్పించేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

### నిత్యావసరాల పంపిణీ

మెదక్ జిల్లాలోని తూప్రాన్ వద్ద వలస కార్మికుల కోసం రెండు ఫంక్షన్‌హాల్స్‌ను సిద్ధంచేసి 370 మందికి భోజన వసతి కల్పించారు. జాతీయ రహదారి చేగుంట వద్ద కాలినడకన వెళ్తున్న బాటసారులను గుర్తించి 100 మందికి భోజన ప్యాకెట్లను ఎమ్మెల్యే రామలింగారెడ్డి అందించారు. అటవీశాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి భవన నిర్మాణ కార్మికులకు బియ్యం పంపిణీచేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బీహార్ వలస కూలీలకు రూ.5వేలు, 50కిలోల బియ్యాన్ని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అందజేశారు. వలస కార్మికులను ఆదుకునేందుకు శివరామకృష్ణ, శ్రీసాయి రైస్ మిల్ నిర్వాహకులు రాందాస్, పడిగెల శ్రీనివాస్ రూ.10 వేలను ఎమ్మెల్యేకు అందజేశారు. చల్‌గల్ వ్యవసాయమార్కెట్‌లో షెడ్ల కింద నివాసముంటూ జిల్లా కేంద్రంలో కూలి పనులు చేసుకుంటున్న 25 మంది అమరావతి, మహారాష్ట్రవాసులకు కలెక్టరేట్ ఏవో వెంకటేశ్ భోజనం పెట్టించి నిత్యావసరాలు అందించారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో హైదరాబాద్ నుంచి కాలినడకన వెళ్తున్న మధ్యప్రదేశ్ కూలీలకు జెడ్పీ అధ్యక్షురాలు కోవ లక్ష్మి భోజనం పెట్టారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లో పేదలకు సరుకుల పంపిణీ చేశారు. పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్‌లో 25 మందికి ఒక్కొక్కరికీ 25 కిలోల బియ్యం, కిలో పప్పును సర్పంచ్ దుర్గం రాజన్న, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సాజిద్, ఉపసర్పంచ్ అలివేణి అందించారు. హైదరాబాద్ నుంచి బీజాపూర్‌కు నడుచుకుంటూ వెళ్తున్న వలస కూలీలకు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల కేంద్రంలో బీఎన్‌ఆర్ గార్డెన్‌లో బీజేపీ నాయకులు భోజనాలు ఏర్పాటు చేశారు. చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ ఆగిరెడ్డి బీహార్ కూలీలకు నిత్యావసరాలు అందజేశారు. నందిగామ పారిశ్రామికవాడలో వలస కార్మికులకు రాజన్ మెటల్ పరిశ్రమ నిర్వహకుడు 100 మందికి 5 కిలోల బియ్యం, మిరపపొడి, పసుపు పంపిణీచేశారు.గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బైసాఖీ దాబా వద్ద 500 మందికి భోజనంపెట్టారు.

### బియ్యం, నగదు అందజేత

మహబూబాబాద్ మండల పరిధిలోని కొమ్ముగూడెం తండాలో మహారాష్ట్ర నుంచి మిర్చి ఏరేందుకు వచ్చిన వలస కూలీలకు ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం, రూ.500 నగదును సోమవారం గిరిజన స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అందజేశారు. జిల్లాలో 5,699 మంది కూలీలు 103 గ్రూపులుగా ఉన్నట్టు గుర్తించి, స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆవాసం కల్పించామని, ప్రతి ఒక్కరికి 12 కిలోల బియ్యం, రూ. 500 నగదు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్ నాయక్, కలెక్టర్ వీపీ గౌతమ్ పాల్గొన్నారు. వరంగల్‌కు వలస వచ్చిన కొంత మంది కూలీలకు వరంగల్ అర్బన్ జిల్లా వడ్డేపల్లిలోని స్వగృహంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ భోజన వసతి ఏర్పాటుచేశారు. కూలీలకు రూ.500, 12 కిలోల బియ్యాన్ని అందజేస్తున్నామని చెప్పారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు కూలీలకు 12 కేజీల చొప్పున బియ్యం రూ.500 అందజేశారు. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 113 మంది వలస కార్మికులకు అధికారులు, 13.56 క్వింటాళ్ల బియ్యం, రూ.56,500 పంపిణీ చేశారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కేఆర్కే కాలనీలో మధ్యప్రదేశ్ వలస కార్మికులకు ఆదనపు కలెక్టర్‌లు సంధ్యారాణి, డేవిడ్ బియ్యం, డబ్బులు అందజేశారు. నిజామాబాద్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో కూలీలకు 12 కిలోల చొప్పున బియ్యం, రూ.500 నగదు అందజేశారు.

### సిరిసిల్ల బల్దియా ఔదార్యం

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉచిత భోజనం అందజేసేందుకు బల్దియా ముందుకొచ్చింది. మంత్రి కేటీఆర్ సూచనతో నిత్యం రూ.ఐదు వేలు భరించేందుకు ముందుకొచ్చింది. హరేరామ స్వచ్ఛంద సేవాసంస్థతో కలిసి అన్నపూర్ణ క్యాంటీన్లతో రోజూ 200 మందికి భోజనం పెట్టాలని నిర్ణయించింది.

### రాజధానిలో 25 వేల మందికి

హైదరాబాద్‌లో భవన నిర్మాణ కూలీల కోసం 168 ప్రాంతాల్లో లేబర్ క్యాంపులను ఏర్పాటుచేశారు. ఆయా నిర్మాణల వద్ద క్యాంపులను ఏర్పాటుచేసి 25 వేల మందికిపైగా ఆశ్రయం కల్పించారు. అన్నపూర్ణ క్యాంటీన్ల ద్వారా నగర వ్యాప్తంగా నిత్యం లక్ష మందికి భోజనవసతి కల్పిస్తున్నారు.



అనాథ శరణాలయం నిర్వాహకుడు సీవీ రెడ్డికి చెక్కు అందజేస్తున్న రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్

## అనాథాశ్రమానికి వితరణ

**నెలసరుకులు, 25 వేలు అందజేసిన ఎంపీ సంతోష్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ నేత, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ మరోసారి దాతృత్వాన్ని చాటుకున్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో సికింద్రాబాద్‌లోని 'సర్వ్ నీడీ' ఆధ్వర్యంలోని అనాథ శరణాలయంలో 45 మంది పిల్లలు తిండిలేక అవస్థలు పడుతున్నారని తెలుసుకొని చలించిపోయారు. నెలకు సరిపడా సరుకులను అందజేశారు. తాత్కాలిక అవసరాలకు రూ.25 వేల చెక్కును నిర్వాహకుడు సీవీరెడ్డికి ఇచ్చారు. లాక్‌డౌన్ ముగిశాక శాశ్వతమార్గం చూపుతానని హామీఇచ్చారు. లాక్‌డౌన్ ఆపత్కాలంలో పోలీసులు అద్భుతమైన సేవలు అందిస్తున్నారని ట్వీట్‌లో ఎంపీ సంతోష్‌కుమార్ అభినందించారు. ప్రజలు ఇండ్లలో సురక్షితంగా ఉండటానికి పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని, వారికి మద్దతు తెలుపుతూ అభినందిద్దామని పిలుపునిచ్చారు.


## నాయకుడంటే కేసీఆరే!

- ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆదర్శం
- వలసకూలీలకు భరోసాపై దేశవ్యాప్త ప్రశంసలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జాతీయ స్థాయిలో పలువురు ప్రముఖులు మరోసారి ప్రశంసలతో ముంచెత్తారు. నాయకుడంటే కేసీఆరేనని కొనియాడారు. ఉపాధి కోసం రాష్ట్రానికి వచ్చి లాక్‌డౌన్ కారణంగా చిక్కుకుపోయిన వివిధ రాష్ట్రాల వలస కూలీలకు అండగా నిలువడంపై దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వలస కూలీలను తెలంగాణ రాష్ట్ర డెవలప్‌మెంట్ పార్ట్‌నర్లుగా చూస్తున్నామని, వారికి ఇబ్బంది లేకుండా ఒక్కొక్కరికి రూ.500, 12 కిలోల బియ్యం అందిస్తామని ప్రకటించి అమలుచేస్తుండటంపై ప్రశంసలు తెలుపుతూ పలువురు ట్వీట్‌చేశారు. వాటిలో కొన్ని...

సంక్షోభ సమయంలో సీఎం కేసీఆర్ ప్రజల హృదయాలను గెలుచుకున్నారని కేంద్ర పశు సంవర్ధకశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ట్వీట్ చేశారు. ప్రజలకు, వలస కూలీలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన భరోసా అభినందనీయమని కేంద్ర సహాయమంత్రి డాక్టర్ సంజీవ్ బాల్యాన్ ట్వీట్‌చేశారు. 'వలస కూలీల విషయంలో వ్యవహరించాల్సిన తీరు ఇదే, ఇంత స్పష్టమైన విశ్వాసం కల్పించిన సీఎంకు ధన్యవాదాలు'అని ఏఎన్‌ఐ మేనేజింగ్ ఎడిటర్ స్మితాప్రకాశ్ ట్వీట్‌చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస కూలీలను వెనక్కి పంపిస్తున్న తరుణంలో, తెలంగాణ ప్రభుత్వం కుటుంబ సభ్యులుగా భావించి అండగా నిలుస్తున్న తీరు అద్భుతమని న్యూస్ 18 మేనేజింగ్ ఎడిటర్ అమీష్ దేవగన్ ట్వీట్‌చేశారు. 'భారతదేశం రాష్ట్రాల సరిహద్దులతో విభజింపబడిలేదని కేసీఆర్ నిరూపించారు. మిగతా రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా వసుధైక కుటుంబమనే విధానం పాటించాలి' అని భారత్ సమాచార్ ఎడిటర్ ఇన్‌చీఫ్ బ్రజేశ్‌మిశ్రా ట్వీట్ చేశారు. 'ముఖ్యమంత్రి పాటించాల్సిన ధర్మాలు ఏమిటో తెలంగాణ సీఎం నుంచి వినండి. మీరు (కేసీఆర్) హృదయాలను గెలుచుకున్నారు'అని న్యూస్ 18 సీనియర్ జర్నలిస్టు రవిప్రతాప్ దూబే తెలిపారు. కేసీఆర్ నుంచి ఇతర సీఎంలు నేర్చుకోవాలని, ఇలాంటి నాయకుడు అవసరమని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాల అభిప్రాయపడ్డారు. ఇంతకంటే విశ్వాసం కలిగించే విషయం మరొకటి ఉంటుందా?అని సీఎన్‌ఎన్ సీనియర్ జర్నలిస్టు పాయల్ మెహతా ట్వీట్‌చేశారు. 'మీరు హృదయాలు గెలుచుకున్నారు. మిగతా రాష్ట్రాల సీఎంలు, కేసీఆర్‌లా వలస కార్మికుల హృదయాలను గెలుచుకోవడం నేర్చుకోవాలి'అని ఏబీపీ న్యూస్ సీనియర్ జర్నలిస్టు పింకీ రాజ్ పురోహిత్ ట్వీట్‌చేశారు. తెలంగాణ ప్రజలు సరైన నాయకుడిని ఎన్నుకున్నారని మిస్ సౌత్‌ఇండియా శివాని ట్వీట్‌చేశారు. కేసీఆర్ ఇచ్చిన భరోసా దేశమంతా వ్యాపించాలని సినీ నిర్మాత శోభుయార్లగడ్డ ట్వీట్ చేశారు.

### ప్రభుత్వానికి ధన్యవాదాలు



హైదరాబాద్‌లో అన్నపూర్ణ కేంద్రాల ద్వారా ఉచితంగా పేదవారి ఆకలి తీరుస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు. చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా నియోజకవర్గాల్లోని మరికొన్నిచోట్ల అన్నపూర్ణ కేంద్రాలను నెలకొల్పాలి.

– అసదుద్దీన్ ఒవైసీ, మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ

# లాక్‌డౌన్ శాస్త్రీయమే

- తెలంగాణ ప్రభుత్వ చర్యలు ప్రశంసనీయం
- 'నమస్తే తెలంగాణ'తో నిమ్స్ డాక్టర్ అమరేశ్‌రావు






**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా నియంత్రణలో తెలంగాణ ప్రభుత్వం అలుపెరుగకుండా పోరాడుతున్నదని నిమ్స్ దవాఖానకు చెందిన కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ అమరేశ్‌రావు మాలెంపాటి అన్నారు. అమెరికా, ఇంగ్లండ్ వంటి సంపన్న దేశాలలో అమలుకాని కఠిన నిబంధనలను మన దేశంలో, రాష్ట్రంలో అమలుచేస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా మనలను మెచ్చుకున్నదన్నారు. డాక్టర్ అమరేశ్‌రావు సోమవారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. 'అభివృద్ధి చెందిన దేశాలు ఆర్థికంగా నష్టపోతామన్న భయంతో లాక్‌డౌన్ చేసేందుకు ముందుకు రాలేదు. ఇప్పుడు భారీస్థాయిలో జననష్టాన్ని చవిచూస్తున్నాయి. కానీ మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికనష్టాలకు వెరువకుండా ప్రజల క్షేమానికి ప్రాధాన్యమిచ్చి లాక్‌డౌన్ ప్రకటించాయి. ఇటువంటి క్లిష్ట సమయంలో ప్రజలు కూడా ప్రభుత్వాలకు సహకరించాలి. కరోనా వల్ల ప్రపంచదేశాల్లో జరుగుతున్న ప్రాణనష్టం నుంచి ప్రతి ఒక్కరు గుణపాఠం నేర్చుకోవాలి. ఐసొలేషన్ వార్డులుగా రైలు బోగీలను వాడటం, క్వారంటైన్ కోసం హోటళ్లను ఉపయోగించడం, తక్కువ ఖర్చుతో వెంటిలేటర్లను ఉత్పత్తి చేయడం మంచి నిర్ణయాలు' అని చెప్పారు.

### తెలంగాణ సర్కార్ భేష్

కరోనా విస్తరించకుండా రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి వరకు అనేక ముందస్తు చర్యలు తీసుకొన్నదని డాక్టర్ అమరేశ్‌రావు చెప్పారు. హైదరాబాద్‌లోని ప్రముఖ దవాఖానలను సిద్ధంచేసిన ప్రభుత్వం జిల్లా కలెక్టర్ల నుంచి ఆశా వర్కర్ల వరకు అన్ని శాఖలను, విభాగాలను సమన్వయం చేసిందని తెలిపారు. లాక్‌డౌన్ అమలులో పోలీసులు కూడా విశేష కృషిచేస్తున్నారని అన్నారు. పారిశుద్ధ్యానికి పూర్తి ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం ప్రజలకు నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచేలా కూడా సరైన చర్యలు తీసుకుంటున్నదని ప్రశంసించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కార్మికుల పట్ల తెలంగాణ సర్కార్ చూపుతున్న శ్రద్ధ భేష్ అని కొనియాడారు. తాము కూడా కరోనా లక్షణాలున్నవారికి సరైన చికిత్స అందిస్తున్నామని, అలాగే బయో మెడికల్ వ్యర్థాలను నాశనంచేసే విషయంలో సిబ్బందికి ప్రత్యేక శిక్షణనిస్తున్నామని డాక్టర్ అమరేశ్‌రావు తెలిపారు. కరోనా కట్టడిలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలువాలని ఆకాంక్షించారు.

### లాక్‌డౌన్‌కు శాస్త్రీయ కారణం

దేశంలో లాక్‌డౌన్ ప్రకటించడం వెనుక శాస్త్రీయ కారణం ఉన్నదని డాక్టర్ అమరేశ్‌రావు తెలిపారు. వైరస్ వ్యాప్తిని అడ్డుకోవటంలో ఇది ఖచ్చితంగా పనిచేస్తుందన్నారు. జనతా కర్ఫ్యూ ప్రయో గం లాంటిదని, అది విజయవంతం కావడంతో లాక్‌డౌన్ ప్రకటించారని చెప్పారు. కరోనాను అరికట్టే విషయంలో 25 వేలకు పైగా పరిశోధనాపత్రాలు అందుబాటులో ఉన్నాయని, వీటన్నింటిలోనూ నిర్ణీత దూరం పాటించడమే పరిష్కారమని పేర్కొన్నారని ఆయన స్పష్టం చేశారు.

# ..నేటినుంచి సీసీఎంబీలో

మొదటిపేజీ తరువాయి...

అధికారిక అనుమతి లభించినట్టు సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా తెలిపారు. కరోనా నిర్ధారణ పరీక్షలను నిర్వహించడానికి సీసీఎంబీలో ఇప్పటికే అత్యాధునిక 12 రియల్ టైమ్ పీసీఆర్‌లను సిద్ధంచేశారు. కరోనా పరీక్షలు నిర్వహించడానికి 20 మంది శాస్త్రసాంకేతిక నిపుణులను నియమించారు. జూనియర్ సైంటిస్ట్‌లకు శిక్షణ కూడా ఇచ్చారు. మంగళవారం నుంచి నమూనాలను పరిశీలిస్తారు. రోజుకు 500కుపైగా నమూనాలను పరిశీలించే సామర్థ్యం సీసీఎంబీకి ఉన్నది.

### జన్యుక్రమంపై కూడా పరీక్షలు

ఐసీఎమ్మార్ అనుమతి నేపథ్యంలో కొవిడ్-19 వైరస్ జన్యుక్రమాన్ని నిర్ధారించడానికి పరీక్షల నిర్వహణకు సీసీఎంబీ సిద్ధమైంది. చైనాలో పుట్టిన వైరస్, ఇటలీ, ఇరాన్, అమెరికాలో విస్తరించిన వైరస్‌కు భారత్‌లో వ్యాప్తి చెందుతున్న వైరస్‌కు జన్యుక్రమంలో ఏమైనా తేడాలున్నాయా? దేశాల భౌగోళిక స్థితిని బట్టి, వాతావరణ తీరును బట్టి రూపాన్ని మార్చుకుంటున్నదా? అనే విషయాలను నిర్ధారించడానికి పరీక్షలు జరుగుతున్నాయి. ప్రస్తుతం సీసీఎంబీలో హోల్ జినోమ్ సీక్వెన్సింగ్ యంత్రం అందుబాటులో ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన కొవిడ్-19.. మన దేశంలో వ్యాప్తి చెందుతున్న వైరస్‌కు తేడాలను గుర్తించేందుకు చేపట్టే పరిశోధనలు నాలుగైదు రోజుల్లో ఒక కొలిక్కి రావొచ్చని సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా 'నమస్తే తెలంగాణ'కు చెప్పారు. ఇప్పటికే చైనాతోపాటు అమెరికా వరకు అన్ని దేశాల్లో వ్యాప్తిచెందిన కొవిడ్ జన్యుక్రమాలను ఆన్‌లైన్‌లో పరిశీలించామని వివరించారు.

# వైద్యుల రక్షణకు ఏరోసోల్ బాక్స్

- టీ వర్క్స్, నిమ్స్, బటర్‌ఫ్లై ఎడుఫీల్డ్స్ సంయుక్త రూపకల్పన



నిమ్స్‌లో విజయవంతంగా పరీక్షించారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ బారినపడినవారికి చికిత్స అందిస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కూడా అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి సమస్యల నుంచి వారిని రక్షించేందుకు టీ వర్క్స్, బటర్‌ఫ్లై ఎడుఫీల్డ్స్, నిమ్స్ సంయుక్తంగా ఏరోసోల్ బాక్స్‌ను తయారుచేశాయి. తైవాన్ ఐసొలేషన్ బాక్స్‌ను నమూనాగా తీసుకుని ఏరోసోల్ బాక్స్ సిద్ధంచేశారు. నాలుగు రోజుల్లోనే వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ బాక్స్‌ను కరోనా వైరస్‌తో బాధపడుతున్న వారికి అమర్చి, వాటికున్న మూడు రంధ్రాల ద్వారా వైద్యం అందించడం వల్ల వైద్యులు, ఇతర సిబ్బందికి రక్షణగా ఉంటుంది.

### వైద్య సిబ్బంది రక్షణే లక్ష్యం

వైద్య సిబ్బంది రక్షణే లక్ష్యంగా ఏరోసోల్ బాక్స్, ఫేస్ షీల్డ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు బటర్‌ఫ్లై ఎడుఫీల్డ్స్ సీఈవో శరత్‌చంద్ర తెలిపారు. వీటి వాడకం వల్ల వైద్యసిబ్బందికి ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉంటుందని చెప్పారు. ఇప్పటివరకు 500 వరకు ఫేస్ షీల్డ్స్ తయారుచేసి.. నిమ్స్‌కు 300 ఇచ్చామని, లక్ష ఫేస్ షీల్డ్స్ తయారీ లక్ష్యంగా పెట్టుకొన్నట్టు పేర్కొన్నారు.

# కరోనాపై బీసీజీ అస్త్రం

- మెల్‌బోర్న్‌లో ప్రయోగపూర్వక పరీక్షపై అధ్యయనం
- అంతర్జాతీయ సంస్థలకు డబ్ల్యూహెచ్వో ప్రోత్సాహం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వైద్యరంగానికి సవాల్‌గా మారిన కొవిడ్-19 ను నిరోధించే వ్యాక్సిన్ కోసం ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు సాగుతున్నాయి. అందుకు చాలా సమయం పడుతుందని భావిస్తుండటంతో ఇతర వ్యాక్సిన్లతో కరోనా కట్టడికి ప్రయోగాలు జోరుగా జరుగుతున్నాయి. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో టీబీ వ్యాక్సిన్ బీసీజీ ని కరోనాపై అస్త్రంగా ప్రయోగపూర్వకంగా పరీక్షిస్తున్నారు. ముఖ్యంగా ఆరోగ్య సిబ్బందిపై ప్రయోగిస్తున్నారు. ఇప్పటికైతే కరోనాకు మందులేదు. వ్యాక్సిన్ లేదు. కరోనా బాధితుల్ని కాపాడేందుకు ప్రపంచవ్యాప్తంగా పలురకాల కాంబినేషన్లతో ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలంగాణలోనూ పలురకాల మందులతో కరోనా రోగులకు సాంత్వన చేకూరుస్తున్నారు. మలేరియాకు వాడే క్లోరోక్విన్‌తోపాటు ఎయిడ్స్ రోగులకు ఇచ్చే పలురకాల మందులు తెరమీదికొచ్చాయి. టీబీ వ్యాక్సిన్‌పై మెల్‌బోర్న్‌లోని మర్డోచ్ చిల్డ్రన్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనం చేస్తున్నది. దీనికి మెల్‌బోర్న్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నైగెల్ కర్టిస్ నేతృత్వం వహిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్వో) కర్టిస్‌తో సమన్వయం చేసుకొంటూనే అంతర్జాతీయ సంస్థల్ని ప్రోత్సహిస్తున్నది. టీబీ వ్యాక్సిన్ బీసీజీని వందేండ్లుగా విజయవంతంగా వినియోగిస్తున్నారని, ఇది మూత్రాశయ క్యాన్సర్‌కు ఇమ్యూనో థెరపీగా పనిచేస్తుందని ప్రొఫెసర్ కర్టిస్ తెలిపారు. నెదర్లాండ్స్‌లోనూ దీనిపై అధ్యయనం జరుగుతున్నదని ఆయన చెప్పారు.

# ప్రజలను కాపాడుకుంటాం



మొదటిపేజీ తరువాయి...

కరోనా వైరస్ దేశాల మధ్య సరిహద్దులను చెరిపేసిందని మంత్రి తెలిపారు. దేశం, రాష్ట్రం, కులం, మతం, రంగు అనే తేడాలేకుండా అన్ని ప్రభుత్వాలను సంక్షోభంలోకి నెట్టిందని అన్నారు. కొవిడ్-19 అనేది అనుకోకుండా తలెత్తిన సంక్షోభం కాబట్టి.. ప్రతి ప్రభుత్వం తమ పరిధిలో ప్రజలకు ఆపన్నహస్తం అందించాలని సూచించారు. రేషన్‌కార్డు ఉన్నా, లేకున్నా పూర్తి సహాయసహకారాన్ని అందజేయాలని చెప్పారు. మేం తెలంగాణలో చేసింది కూడా ఇదేనని పేర్కొన్నారు. తెలంగాణలో రేషన్ కార్డులున్నవారికే కాదు.. లేనివారిని, కరోనా వల్ల ఇబ్బంది పడుతున్నవారిని కూడా పూర్తిస్థాయిలో ఆదుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలతోపాటు ఎవరికివారే తమ సామాజిక బాధ్యతగా తీసుకొని, ఆర్థికంగా వెనుకబడిన తరగతులవారు ఆపదలో ఉంటే ఆదుకోవడానికి ముందుకురావాలని విజ్ఞప్తిచేశారు. పనిమనుషులు, డ్రైవర్లు.. ఇలా ప్రతిఒక్కరికీ ఆపన్నహస్తం అందించాలని కోరారు.

### అలాంటి రాష్ట్రాలకు విజ్ఞప్తి చేస్తున్నా

కరోనా వైరస్ ప్రపంచ దేశాల సరిహద్దులను చెరిపేసిన క్రమంలో.. మనదేశంలోని కేరళ సరిహద్దులో కర్ణాటక అధికారులు మట్టిపోసి నిరోధించడం కరెక్టు కాదని మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి కేంద్రం చొరువ చూపాలని కోరారు. ప్రభుత్వాల అసహజమైన ప్రవర్తనకు అడ్డుకట్టవేయాలని విజ్ఞప్తిచేశారు. ఇలా కర్ణాటక ప్రవర్తించినా, తెలంగాణ చేసినా.. ఎవరైనా వ్యక్తిగతంగా వ్యవహరించినా ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువులు, ఆహారధాన్యాలు, మందులు, మంచినీరు తదితరాలు ఇలాంటి ప్రతికూల సమయాల్లో ప్రజలకు అందాల్సిందే కాబట్టి, ఎవరూ ఇలాంటి వ్యతిరేక చర్యలకు పాల్పడకూడదని కోరుతున్నానన్నారు.

### వలస కార్మికులను ఆదుకోవాలి

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో చిక్కుకున్న తెలంగాణవారిని ఆదుకొనేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించామని, వారు సానుకూలంగా స్పందించారని కేటీఆర్ చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తెలంగాణలో నిర్మాణ, పరిశ్రమలు, ఐటీ, లైఫ్ సెన్సెస్ తదితర రంగాల్లో పనిచేసేవారు మానసికవేదనకు గురవుతున్నట్టు సీఎం కేసీఆర్ గుర్తించారని చెప్పారు. రాష్ట్రంలో ఆ విధంగా ఇబ్బంది పడుతున్న రోజువారీ కూలీల సంఖ్యను తేల్చేందుకు అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పదిలక్షల మంది దాకా ఉండగా.. అందులో 5 లక్షల మంది హైదరాబాద్, చుట్టుపక్కల పనిచేస్తున్నట్టు తేలిందన్నారు. ఈ వలసకార్మికులు తమ కుటుంబసభ్యులు మాత్రమే కాదని, తెలంగాణ పునర్నిర్మాణంలో ముఖ్యమైన భాగస్వాములని సీఎం కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. వారు రాష్ట్ర అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని ఎలుగెత్తి చాటారని.. అందుకే, చాలామంది తెలంగాణ నుంచి సొంత రాష్ట్రాలకు వెళ్లకుండా ఇక్కడే నివసించాలనే నిర్ణయానికొచ్చారని చెప్పారు. ఇలా తెలంగాణ నుంచి వారు సొంతరాష్ట్రాలకు వెళ్లకుండా నిరోధించగలిగామన్నారు. రానున్న రోజుల్లో వీరు క్షేమంగా నివసించడానికి అవసరమయ్యే మరిన్ని మెరుగైన చర్యల్ని తీసుకుంటామని తెలిపారు.

# పది పరీక్షలు నిరవధిక వాయిదా

- హైకోర్టుకు వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం
- త్వరలో పరీక్షల రీషెడ్యూల్: పరీక్షల విభాగం డైరెక్టర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పదవ తరగతి పరీక్షలు నిరవధిక వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు వెల్లడించింది. టెన్త్ పరీక్షలు వాయిదా వేయాలంటూ ఉపాధ్యాయుడు ఎం బాలకృష్ణ దాఖలుచేసిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టు మరోసారి విచారణ జరిపింది. జస్టిస్ ఎంఎస్ రామచందర్‌రావు నివాసంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టింది. పిటిషన్ తరపు న్యాయవాది పవన్‌కుమార్, అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ తమ ఇంటి నుంచే వాదనలు వినిపించారు. కేంద్రం లాక్‌డౌన్ ప్రకటించినందున ఇప్పుడు పరీక్షలు నిర్వహించే పరిస్థితి లేదని ఏజీ తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్షలు నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు, పరీక్ష తేదీలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం పరీక్షలు వాయిదా పడ్డ విషయాన్ని మీడియా ద్వారా ప్రచారం కల్పించాలని ఏజీకి సూచించింది. తదుపరి విచారణను హైకోర్టు ఏప్రిల్‌కు వాయిదా వేసింది. పరిస్థితులు అదుపులోకి వచ్చిన తర్వాత పది పరీక్షల రీషెడ్యూల్ ప్రకటిస్తామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. లాక్‌డౌన్ ఏప్రిల్ 14వరకు న్న నేపథ్యంలో మంగళవారం నుంచి జరుగాల్సిన పరీక్షలను వాయిదావేసినట్టు చెప్పారు. ఒకటి నుంచి తొమ్మిది వరకు పరీక్షలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

# అందుబాటులో మాంసం ధరలు

- పర్యవేక్షణకు జిల్లాల్లో నోడల్ అధికారులు
- సమీక్షలో పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజలకు మాంసం, చేపలు, కోడిగుడ్లను అందుబాటులోకి తీసుకొస్తామని పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. మాంసం ధరలను నియంత్రించేందుకు పశుసంవర్ధక, మత్స్య, పోలీసు, రవాణాశాఖలను సమన్వయం చేసేందుకు జిల్లాస్థాయిలో నోడల్ అధికారిని నియమించనున్నట్టు తెలిపారు. సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ కార్యాలయంలో మాంసం, చికెన్, చేపల లభ్యత, సరఫరాపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లాక్‌డౌన్ నేపథ్యంలో గొర్రెలు, మేకల సరఫరా తగినంత లేకపోవడం వల్ల మాంసం ధరలు పెరిగాయని, తగినంత సరఫరాకు చర్యలు తీసుకోవడం ద్వారా మాంసం ధరలను నియంత్రిస్తామన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో నిత్యావసరాలతోపాటు కూరగాయలు, పాలు, పండ్లు, కోడిగుడ్ల రవాణాకు అనుమతులిచ్చినట్టు తెలిపారు. గొర్రెలు, మేకలను రాష్ట్రంలో ఎక్కడినుంచి ఎక్కడికైనా తీసుకెళ్లి అమ్ముకోవడానికి అనుమతులు ఇవ్వనున్నట్టు స్పష్టంచేశారు. అధిక ధరలకు మాంసం విక్రయించేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోశాలలకు పశుగ్రాసం కొరత రాకుండా చూడాలన్నారు.

### చికెన్ వ్యర్థాలు తరలించండి

మత్స్యకారులు చేపలను పట్టుకొని అమ్ముకొనేలా అధికారులు చూడాలని మంత్రి శ్రీనివాస్‌యాదవ్ ఆదేశించారు. జిల్లాల నుంచి చేపలు తెచ్చి హైదరాబాద్ నగరంలో విక్రయించేవారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అనుమతులిస్తామని తెలిపారు. చికెన్ దుకాణాల్లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని ఆదేశించారు. సమావేశంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తోపాటు పశుసంవర్ధక, మత్స్యశాఖ, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోలుకు
# అనుమతి

- నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్
- రూ.3213 కోట్ల గ్యారెంటీ
- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 2019-20 యాసంగి మక్కల కొనుగోలుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. తెలంగాణ స్టేట్ మార్కెటింగ్-కోఆపరేటివ్ సంస్థ (టీఎస్ మార్క్‌ఫెడ్)ను నోడల్ ఏజెన్సీగా నియమించింది. కనీస మద్దతు ధర పథకం కింద క్వింటాల్ రూ.1,760 చొప్పున కొనుగోలు చేయాలని నిర్ణయించింది. యాసంగి మక్కల కొనుగోలుకు రూ.3,213 కోట్ల బ్యాంక్ గ్యారెంటీని ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 5.84 లక్షల ఎకరాల్లో మక్కజొన్న సాగైంది. హెక్టారుకు 2.468 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనావేసింది. రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో దాదాపు 14.59 లక్షల మెట్రిక్ టన్నుల మక్కజొన్న దిగుబడి వచ్చే అవకాశాలున్నట్టు వ్యవసాయశాఖ అంచనా వేస్తున్నది. పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలుచేసేలా అవసరమైన నిధులను ప్రభుత్వం ఎన్సీడీసీ, వాణిజ్య బ్యాంకులు, వాణిజ్య సంస్థల నుంచి మార్క్‌ఫెడ్‌కు సమకూర్చింది.

# పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

- రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు
- పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకొని పకడ్బందీగా యాసంగి కొనుగోళ్లు చేపట్టాలని పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని తన పేషీలో అధికారులు, రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రం వద్ద పరిశుభ్రత పాటించడంతోపాటు మంచినీరు, విద్యుత్ సదుపాయం కల్పించాలని చెప్పారు. సురక్షితమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, వానకాలం సీజన్ ప్రారంభానికి ముందే ధాన్యం తడువకుండా టార్పాలిన్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కొనుగోలుచేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాంలకు తరలించే ఏర్పాట్లుచేయాలన్నారు. ధాన్యం అమ్మిన రైతుల వివరాలు, బ్యాంక్ అకౌంట్ నంబర్లను పొరపాటు లేకుండా నమోదుచేయాలని తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ సత్యనారాయణ, రైస్‌మిల్లుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# పక్కాగా మద్యం షాపుల బంద్

- మందుబాబుల దృష్టి మరల్చేలా చూడండి
- ఎక్సైజ్ అధికారులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా పక్కాగా మద్యం దుకాణాల బంద్ అమలు జరిగేలా చూడాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. కరోనా వైరస్‌ను కట్టడిచేసేందుకు సీఎం కేసీఆర్ తీసుకొన్న కఠిన నిర్ణయాలకు అందరమూ కంకణబద్ధులమై ఉండాలని చెప్పారు. మద్యం దొరక్క పలువురు మానసిక ఆందోళనకు గురై వింతగా ప్రవర్తిస్తున్న సంఘటనలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో ఎక్సైజ్ కమిషనర్, డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్లు, ఎక్సైజ్ సూపరింటెండెంట్లతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మద్యానికి బానిసై ఆందోళన చెందుతున్నవారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పించడం, డీఅడిక్షన్ కేంద్రాలకు పంపడం ద్వారా వారిని ఆరోగ్యంగా మార్చేలా చూడాలన్నారు. మద్యం వ్యసనపరులకు వారి దృష్టిని యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక చింతన వైపు మళ్లించేలా చేయడం, కుటుంబసభ్యులతో కలిసి ఇండోర్ గేమ్స్ ఆడేలా ప్రేరేపించడం వలన మానసిక శక్తిని ఇచ్చినవారవుతారని చెప్పారు. మద్యం దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు మూసివేయడంతో ఉద్యోగం లేక ఆర్థికంగా నష్టపోయినవారిని ఆదుకొనేందుకు మద్యం వ్యాపారులు ముందుకు రావాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు.

# వదంతుల వ్యాప్తికి కఠిన శిక్ష

## సమాచార ప్రామాణికతను రూఢీ చేసుకోవాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు
- డిజిటల్ మీడియా విభాగం డైరెక్టర్ దిలీప్ హెచ్చరిక



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్‌కు సంబంధించి డిజిటల్ మీడియాలో వదంతులను ప్రచారం, ప్రసారం చేస్తే కఠిన శిక్షలు తప్పవని తెలంగాణ డిజిటల్ మీడియా విభాగం డైరెక్టర్ కొణతం దిలీప్ సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. సోషల్‌మీడియా విభాగాలైన వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్, టిక్‌టాక్ తదితర యాప్స్‌లో జరిగే ప్రచారాన్ని యథాతథంగా వ్యాపింపజేయవద్దని పేర్కొన్నారు. అవాస్తవాలు, అనైతికంగా రూపొందించే సమాచారాన్ని, వ్యాఖ్యలను ప్రచారంచేసి ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించవద్దని.. సమాచారాన్ని వ్యాప్తిచేసే ముందు ప్రామాణికతను రూఢీ చేసుకోవాలని కోరారు. తప్పుడు సమాచారం, వదంతులు మరో మహమ్మారిగా మారి ప్రజలు, ప్రభుత్వ యంత్రాంగానికి సవాల్‌గా పరిణమిస్తున్నాయని పేర్కొన్నారు. కరోనా మహమ్మారిపై గెలువాల్సిన యుద్ధంలో భాగస్వాములమవుదామని, క్లిష్ట సమయంలో ప్రభుత్వ చర్యలకు మద్దతు పలికేలా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. మరింత సమాచారం, సందేహాల నివృత్తికి dir dm@ telangana.gov.in మెయిల్‌లో సంప్రదించాలని సూచించారు.

### పౌరులకు సూచనలు

- డిజిటల్ మాధ్యమాల్లో వచ్చిన సమాచార ప్రామాణికతను రూఢీ చేసుకోకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చేరవేయొద్దు.
- వాట్సాప్ వంటి వేదికల్లో బృంద సభ్యులు తప్పుడు సమాచారం వ్యాపింపజేస్తే, అడ్మిన్స్ బాధ్యులవుతారు. విచారణ ఎదుర్కోవాలి.
- కరోనా సోకినవారి వ్యక్తిగత వివరాల గోప్యత ముఖ్యమైన అంశం. వారి వివరాలను వ్యాపింపజేయడం అనైతికం. ఇది శిక్షార్హమైన నేరం.
- విపత్తుల సమయంలో వదంతులను, తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేసేవారికి విపత్తు నిర్వహణ చట్టం, 2005 లోని 54 సెక్షన్ ప్రకారం ఏడాది జైలుతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది. ఐపీసీ సెక్షన్ 505 ప్రకారం కూడా శిక్షార్హులవుతారు.
- కరోనావైరస్ వ్యాప్తి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం అంటువ్యాధుల చట్టం-1897 నిబంధనలను విడుదల చేసింది. ఈ నిబంధనల్లోని 10వ సెక్షన్ ప్రకారం కరోనా వైరస్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారాన్నయినా అధికారులతో ధ్రువీకరించుకోకుండా వార్తా పత్రికలు, టీవీ చానళ్లు, సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చేయకూడదు. దీనికి విరుద్ధంగా వ్యాప్తిచేస్తే ఆ చట్టాల కింద శిక్షార్హులవుతారు.

### సమాచార మాధ్యమాలకు సూచనలు

- సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తిలో ఉన్న సంచలనాత్మక, భయాందోళనలకు గురిచేసే, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని కొన్ని ప్రధాన స్రవంతి వార్తాపత్రికల ఆన్‌లైన్ ఎడిషన్లు, న్యూస్‌సైట్లు యథాతథంగా ప్రచురించడం శిక్షార్హం. ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసే సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలి.
- కొన్ని యూట్యూబ్ చానళ్లు చాలా వార్తలను తప్పుడు థంబ్‌నెయిల్స్‌తో పోస్టు చేస్తున్నాయి. సంబంధిత వార్తకు, సమాచారానికి సంబంధం లేని ఈ థంబ్‌నెయిల్స్ వీక్షకుడిని తప్పుదోవ పట్టించడమే. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వ యంత్రాంగాన్ని అవహేళనచేసేలా, వారిపై చులకన భావం కలిగించేలా, మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా వీడియోలు ఉండటం డిజిటల్ మాధ్యమాల నిబంధనలకు విరుద్ధం.
- తప్పుదోవ పట్టించే వార్తలు, వీడియోలను ప్రచురించే, ప్రసారంచేసే వేదికలపై డిజిటల్ మీడియా విభాగం సంబంధిత సామాజిక మాధ్యమ సంస్థల దృష్టికి తీసుకెళ్లి నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటుంది. ఇలాంటి వార్తలు, వీడియోలను పోస్టుచేస్తున్న ఆన్‌లైన్ న్యూస్ వెబ్‌సైట్లు, యూట్యూబ్ చానళ్లకు వాణిజ్య ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం నిలిపివేసే అవకాశం ఉంటుంది. తరచుగా తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడే చానళ్లను ఆయా సామాజిక మాధ్యమాల సంస్థలు పూర్తిగా తొలగించే అవకాశం ఉన్నది.
- ఇలాంటి వార్తలు, వీడియోలు తెలంగాణ అంటువ్యాధుల(కొవిడ్-19) నిబంధనలు, విపత్తు నిర్వహణ చట్టం-2005లోని 54వ సెక్షన్, ఐపీసీ సెక్షన్ 505 కింద ఉల్లంఘనలుగా పరిగణిస్తారు. ఈ చట్టాలే కాకుండా ఇతర నిబంధనలను అనుసరించి ఆ సంస్థలు/సంస్థల యాజమానులు శిక్షార్హులవుతారు.


ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం క్రింద దిగువ తెలిపిన వాటి సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పనిచేయించు పనుల కొరకు స్థానిక పోటీ బిడ్డింగ్ క్రింద TSTRANSCO టెండరు కోరుతోంది. **స్పెసిఫికేషన్ నెం:** e-EHVT-03/2019-20 **పని పేరు:** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం-టర్న్‌కీ ప్రాతిపదికన (i) 400/11kV నర్లపూర్ LI సబ్-స్టేషన్ (1 నెం. 420kV 125 MVAR బస్ రియాక్టర్‌తోసహా), (ii) 400/11kV వట్టెం LI సబ్-స్టేషన్ (1 నెం. 420kV, 125 MVAR రియాక్టర్‌తోసహా) (iii) 400/11kV ఏదుల LI సబ్-స్టేషన్ (1 నెం. 420kV, 125 MVAR బస్ రియాక్టర్‌తోసహా), (iv) 400/220kV వెల్టూర్ SS వద్ద 2 నెం.లు 400kV QMDC బేలు, (v) 400/220kV డిండి SS వద్ద 2 నెం.లు 400kV QMDC బేలు, (vi) ప్రతిపాదిత 400/11kV ఏదుల LISS నుండి ప్రతిపాదిత 400/11kV నర్లపూర్ LISS వరకు 400kV QMDC లైన్, (vii) 400/220kV డిండి SS నుండి ప్రతిపాదిత 400/11kV ఏదుల LISS వరకు 400kV QMDC లైన్, (viii) 400/11kV ఏదుల LISS నుండి 400/11kV వట్టెం LISS వరకు 400kV QMDC లైన్, (ix) 400/220kV వెల్టూర్ SS నుండి 400/11kV ఏదుల LISS వరకు 400kV QMDC లైన్ సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పనిచేయించుట. ఆసక్తిగల బిడ్డర్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.eprocurement.telangana.gov.inలో తమకుతాము నమోదు చేసుకోవలెను. టెండరు డాక్యుమెంట్లు వెబ్‌సైట్ www.eprocurement.telangana.gov.inలో లభిస్తాయి. వివరాల కొరకు మా వెబ్‌సైట్: www.tstransco.in దర్శించండి.
సంప్రదించు నెం.లు: 040-23323565, 040-23396000 - Extn : 3500, 3541, 3635, 3687.
R.O.No. 61/19
సం/- చీఫ్ ఇంజినీర్ / 400kV



THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
(A Government Company)
R.O: Kothagudem Collieries - 507101, Telangana.
e-Procurement TENDER NOTICE
Tenders have been published for the following Services / Material Procurement through e-procurement platform. For details, please visit https://tender.telangana.gov.in - or - https://www.sccimines.com

| NIT/Enquiry No. - Description/Subject - Last date and time for Submission of bid(s) |
|---|
| E1519O0454 - Procurement of various sizes of MATO MANUAL LACERS for SCCL - 9/4/2020 - 17:00 hrs. |
| E2119O0492 - Photocopying of documents under Rate contract for a period of Two Years- 15/04/2020 - 17:00 hrs. |
| E0719O0465 - Procurement of VALOR Make Tyre Pressure and temperature Monitoring Device - 23/04/2020 - 17-00 hrs. |
| NIT No., Date – Name of the work – ECV- Last date & time for Submission of bids |
| BHP/CVL/ET-58/2019-20 Dt. 19-03-2020 – Construction of retaining wall for providing feeder breakers at KTK OC-III, Bhupalpalli - Rs. 49,89,231/- up to 04:00 PM on 07.04.2020. |
| MNG/CVL/TN-70/2019-20 - Construction of 2 vents 9.00 M span single Lane Bridge (SLR) on approach road to Bugga Village on Diversion of Gorrepeta Vagu (Phase-I) at Manuguru area, Bhadradri Kothagudem (DT), TS - Rs. 43,63,578/- up to 04:30 PM on 06.04.2020. |

PR/2019-20/MP/CVL/SLK/128 GM (MP) – GM, BHPL - GM, MNG



సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు రూ.1.5 కోట్ల విరాళానికి సంబంధించిన లెటర్‌ను అందజేస్తున్న తెలంగాణ మోటర్ వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు కే పాపారావు, ఎల్ రాంచందర్, సురేశ్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ కూడా ఉన్నారు.



ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు కోటి రూపాయల విరాళానికి సంబంధించిన చెక్కును అందజేస్తున్న సువెన్ ఫార్మా చైర్మన్ వెంకట్ జాస్తి



సీఎం కేసీఆర్‌కు ఎన్సీసీ లిమిటెడ్ తరఫున కోటి రూపాయల విరాళం చెక్కును అందజేస్తున్న ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఏ రంగరాజు




శ్రీ చైతన్య విద్యాసంస్థలు కోటి రూపాయల విరాళం అందించాయి. దీనికి సంబంధించిన చెక్కును ఆ సంస్థ డైరెక్టర్ వై శ్రీధర్ ముఖ్యమంత్రికి అందించారు.



సీఎం కేసీఆర్‌కు రూ.50 లక్షల విరాళం చెక్కును అందజేస్తున్న తెలంగాణ రైస్ మిల్స్ అసోసియేషన్ నాగేందర్, మోహన్‌రెడ్డి. చిత్రంలో మంత్రి గంగుల, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి




సోమవారం మంత్రి కే తారకరామారావుకు రూ. 5.25 కోట్ల చెక్కును అందజేస్తున్న వాల్యూ లాబ్స్ ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధులు



మంత్రి కేటీఆర్‌కు కోటి రూపాయల చెక్కును అందజేస్తున్న అమర్‌రాజా బ్యాటరీస్ లిమిటెడ్ యాజమాన్యం



మంత్రి కేటీఆర్‌కు కోటి రూపాయల చెక్కు అందజేస్తున్న జీవీపీఆర్ ఇంజినీర్స్ సంస్థ ప్రతినిధులు




మంత్రి కేటీఆర్‌కు కోటి రూపాయలు చెక్కు అందజేస్తున్న వంశీ రామ్ బిల్డర్స్ ప్రతినిధులు



మంత్రి కేటీఆర్‌కు కోటి విరాళానికి సంబంధించిన లేఖను అందజేస్తున్న ఐసీఎఫ్ఏఐ సొసైటీ ప్రతినిధులు



మంత్రి కేటీఆర్‌కు 50 లక్షల చెక్కును అందజేస్తున్న యునైటెడ్ స్టేట్స్ ఫార్మా కోఫియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు



మంత్రి కేటీఆర్‌కు 50 లక్షల చెక్కును అందజేస్తున్న సిగ్నిటి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి



విమల ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున 25 లక్షల చెక్కును మంత్రి కేటీఆర్‌కు అందజేస్తున్న చల్మెడ మధుసూదన్‌రావు



మంత్రి కేటీఆర్‌కు 25 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్



మంత్రి కేటీఆర్‌కు రూ.25 లక్షల చెక్కు అందజేస్తున్న భాష్యం ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు



మంత్రి కేటీఆర్‌కు 11 లక్షల చెక్కును అందజేస్తున్న గురునానక్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధి



మంత్రి కేటీఆర్‌కు చల్ల ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ తరఫున రూ.10 లక్షలు అందించిన ఎస్ రాకేశ్‌రెడ్డి



మంత్రి కేటీఆర్‌కు 10 లక్షల చెక్కు అందజేస్తున్న హైదరాబాద్ బోట్స్ క్లబ్ ప్రెసిడెంట్ చెన్నాడి సుధాకర్‌రావు



బీహెచ్‌ఆర్ డెవలపర్స్ తరఫున రూ.10 లక్షల చెక్కును మంత్రి కేటీఆర్‌కు అందజేస్తున్న జే హనుమంతరావు



మంత్రి కేటీఆర్‌కు రూ.10 లక్ష చెక్కు అందజేస్తున్న టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి



కేటీఆర్‌కు రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం తదితరులు



కేటీఆర్‌కు రూ.10 లక్షల విరాళం అందజేస్తున్న ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్ (నాటా) అధ్యక్షుడు రాఘవరెడ్డి తదితరులు



మంత్రి కేటీఆర్‌కు రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న జాన్సన్ గ్రామర్ స్కూల్ యాజమాన్యం



మంత్రి కేటీఆర్‌కు రూ.5 లక్షల చెక్కును అందజేస్తున్న జే శారదా మెటల్ ఇండస్ట్రీ ప్రతినిధులు


# సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళాలు

కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు, రాష్ట్రంలో లాక్‌డౌన్ నేపథ్యంలో సహాయ, పునరావాస కార్యక్రమాల్లో ప్రభుత్వానికి చేయూతనిచ్చేందుకు మేముసైతం అంటూ పలువురు ముందుకొస్తున్నారు. సంస్థలు, వ్యక్తులు పెద్దఎత్తున విరాళాలు అందజేస్తుండగా.. వివిధ శాఖల ఉద్యోగులు తమనెల జీతంలో కొంతమొత్తాన్ని ఇస్తున్నట్టు ప్రకటిస్తున్నారు. సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళాలు ప్రకటించిన వివిధ సంస్థల వివరాలు..



సోమవారం మంత్రి హరీశ్‌రావుకు రూ.61 లక్షల విరాళానికి సంబంధించిన లేఖను అందజేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం

- తెలంగాణ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో 1,950 మంది ఉపాధ్యాయులు రూ.50 లక్షలకు ఆమోదపత్రాన్ని మంత్రి సత్యవతి రాథోడ్‌కు అందించారు.
- స్వస్తిక్ మిర్చి స్టోర్ రూ.21లక్షలు
- రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లి గ్రామానికి చెందిన జాకంటి హన్మంతరావు రూ.10 లక్షలు, ఆయన వ్యాపార భాగస్వామి సురేష్ అగర్వాల్ రూ.15 లక్షల విరాళమిచ్చారు.
- సాయిసూర్య డెవలపర్స్, జగత్‌స్వప్న రియల్టర్స్, సీ 5 ఇన్‌ఫ్రా లిమిటెడ్, బీహెచ్‌ఆర్ డెవలపర్స్, సీఎస్‌కే రియల్టర్స్ లిమిటెడ్, శ్రీసాయి రూలర్ ఫ్లోర్ మిల్, చల్మెడ ఫీడ్స్ రూ.10 లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. జీఆర్డీ ఫౌండేషన్ తరఫున తేజ గొల్లపూడి 5 లక్షల విరాళం అందజేశారు.
- నారాయణపేట జిల్లాలోని మరికల్, కృష్ణ, మాగనూర్, మక్తల్ మండలాలకు చెందిన ఇటుక బట్టీల యజమానులు కలెక్టర్ హరిచందనకు రూ.5,81,116 చెక్కును అందజేశారు
- జేఎన్టీయూహెచ్ ఉద్యోగులు ఒకరోజు వేతనం దాదాపు రూ.12లక్షలు ప్రకటించారు.
- బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ భారతికి విప్ బాల్క సుమన్ 5 లక్షల చెక్ అందించారు.
- దుండిగల బాల్‌రాజేశం రూ.5 లక్షల చెక్కును మంత్రి హరీశ్‌రావు అందజేశారు.
- నిజామాబాద్ డీసీసీబీ అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి తననెల జీతం అలవెన్సుతో కలిపి రూ.లక్ష ఇవ్వనున్నట్టు ప్రకటించారు
- సిద్దిపేట మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్, అంధ ఉద్యోగిని డీ భాగ్య నెల జీతం రూ.25 వేల చెక్కును మంత్రి హరీశ్‌రావుకు అందజేశారు.
- పీవీ నరసింహారావు వెటర్నరీ వర్సిటీ ఉద్యోగులు ఒకరోజు వేతనాన్నివిరాళంగా ప్రకటించారు.



విద్యుత్ ఉద్యోగులు తమ ఒకరోజు వేతనం సుమారు రూ.12 కోట్లు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. సోమవారం 21 సంఘాలతో కూడిన తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ పీ రత్నాకర్‌రావు నేతృత్వంలోని బృందం.. టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావుకు సమ్మతి లేఖను అందజేసింది.

# క్వారంటైన్లుగా టీఎన్జీవో భవనాలు

- కరోనా అంతానికి ఉద్యోగవర్గాల సహకారం
- టీఎన్జీవో, టీజీవో ప్రకటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోగల టీఎన్జీవో భవనాలను క్వారంటైన్ కేంద్రాలుగా వాడుకోవాలని టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) అధ్యక్షురాలు వీ మమత, ప్రధాన కార్యదర్శి ఏనుగుల సత్యనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. కరోనా కట్టడి, సహాయ చర్యల్లో రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు ప్రభుత్వానికి అండగా ఉంటారని తెలిపారు. ఇప్పటికే తాము ఒకరోజు మూలవేతనాన్ని సీఎం సహాయనిధిని అందించామని గుర్తుచేశారు. ఈ నిర్ణయం ద్వారా తాము జీతం కోసం కాదు, జీవితాల కోసం నిలబడుతారని రుజువు చేశారని తెలిపారు. కరోనా వైరస్ నియంత్రణలో విశిష్ఠ సేవలందిస్తున్న వైద్యారోగ్య, పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ, మార్కెటింగ్, సివిల్ సప్లై, రవాణా, మున్సిపల్, పంచాయతీరాజ్, ఉపాధి హామీ ఉద్యోగులతోపాటు జర్నలిస్టులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



సోమవారం గాంధీ దవాఖాన సూపరింటెండెంట్‌కు మాస్కులు, శానిటైజర్లు, గ్లౌజ్‌లు అందజేస్తున్న టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం ముజీబ్ హుస్సేని తదితరులు

**టీఎన్జీవో ఆధ్వర్యంలో శానిటైజర్లు, మాస్కుల పంపిణీ**

టీఎన్జీవో హైదరాబాద్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ దవాఖానల్లో ఉన్న సిబ్బందికి, రోగులకు మాస్కులు, శానిటైజర్లు, గ్లౌజ్‌లను పంపిణీ చేశారు. అదేవిధంగా క్యాన్సర్ దవాఖానలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం ముజీబ్ హుస్సేని నాయకత్వం వహించారు.

## శ్రీవారి దర్శనం 14 వరకు బంద్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులను వచ్చే నెల 14 వరకు అనుమతించకూడదని టీటీడీ నిర్ణయించింది. ఏప్రిల్ 2న శ్రీరామనవమి ఆస్థానాన్ని, 3న శ్రీరామపట్టాభిషేకాన్ని ఏకాంతంగా నిర్వహించనున్నట్టు తెలిపింది.

**నిరాడంబరంగా శ్రీరామనవమి**

భద్రాద్రిలో శ్రీరామనవమి వేడుకలను నిరాడంబరంగా నిర్వహించాలని దేవాదాయశాఖ నిర్ణయించింది. ఈ మేరకు దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

## సరుకుల రవాణాకు పార్సిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిత్యావసర సరుకుల రవాణాకు సికింద్రాబాద్- హౌరా మధ్య ప్రత్యేక పార్సిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ రైళ్లు ఏప్రిల్ 2, 9 తేదీల్లో బయలుదేరి- 4, 11 తేదీల్లో సికింద్రాబాద్ చేరుతాయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

# ఆరుగురి బలి

మొదటిపేజీ తరువాయి...

అయింది. మిగిలిన అయిదుగురు కూడా కరోనాతోనే మరణించి ఉంటారని ప్రభుత్వం భావిస్తున్నది. వీరిద్వారా వైరస్ సోకే అవకాశం ఉన్నదని భావిస్తున్న అనుమానితులను ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందాలు గుర్తించి, దవాఖానలకు తరలిస్తున్నాయి. వారందరికీ పరీక్షలు నిర్వహించి, వైద్యం అందిస్తున్నారు. మర్కజ్ ప్రార్థనల్లో పాల్గొన్నవారికి కరోనా వైరస్‌సోకినట్లు తెలుస్తున్నది. ఈ ప్రార్థనల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరు విధిగా తమ సమాచారాన్ని అధికారులకు అందించాలని వైద్యఆరోగ్యశాఖ కోరింది. వారికి ప్రభుత్వమే పరీక్షలు నిర్వహించి, ఉచితంగా చికిత్స కూడా అందిస్తుంది. కాబట్టి మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వారంతా తప్పక అధికారులకు సమాచారం అందించాలని, వారి గురించి ఎవరికి సమాచారం తెలిసినా వెంటనే ప్రభుత్వానికి తెలియజేయాలని వైద్యారోగ్యశాఖ విజ్ఞప్తిచేసింది. ఏపీ నుంచి హాజరైన వారి ద్వారా ఆ రాష్ట్రంలో కూడా కరోనా వ్యాప్తి చెందినట్లు అనుమానిస్తున్నారు. ఇటీవల కరీంనగర్‌లో పాజిటివ్‌గా తేలిన ఇండోనేషియా వాసులు కూడా ఈ కార్యక్రమానికి హాజరై వచ్చినట్టు అనుమానిస్తున్నారు. మర్కజ్ ప్రార్థనల్లో దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాల నుంచి ముస్లింలు, మత బోధకులు పాల్గొనడంతో కరోనా వ్యాప్తి పై దేశ వ్యాప్తంగా ఆందోళన పెరిగింది. ఇప్పటికే ఈ ప్రార్థనల్లో పాల్గొన్నవారిలో రెండువేల మందిని క్వారంటైన్‌కు తరలించారు. నిజాముద్దీన్ ప్రాంతానికి చెందిన ఓ బృందంలోని 175 మందికి పలు దవాఖానల్లో సోమవారం కరోనా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఢిల్లీకి చెందిన 300 మందిని వివిధ దవాఖానలకు తరలించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మరోవైపు మార్చి 15న ప్రార్థనలు పూర్తయినప్పటికీ.. 1400 మంది ఇంకా మసీదులోనే ఉండిపోయారు. వీరందరికీ కరోనా పరీక్షలు జరుపుతున్నారు. మర్కజ్ భవనంతోసహా నిజాముద్దీన్ ప్రాంతాన్ని ఢిల్లీ పోలీసులు, పారామిలటరీ బలగాలు తమ స్వాధీనంలోకి తీసుకొన్నాయి. స్థానికుల కదలికలపై డ్రోన్ల ద్వారా నిఘా పెట్టారు. చుట్టుపక్కల కాలనీల్లో ప్రతి ఇంటికీ వెళ్లి.. ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. క్వారంటైన్‌లకు తరలిస్తున్నారు.

**పలు రాష్ట్రాలకు విస్తరణ**

శ్రీనగర్‌కు చెందిన మతబోధకుడు గతవారం కరోనా వైరస్ వల్ల మరణించాడు. ఢిల్లీలో ప్రార్థనలకు హాజరైన తర్వాత అతడు ఉత్తరప్రదేశ్‌లోని దేవ్‌బంద్‌లో జరిగిన మత కార్యక్రమంలో కూడా పాల్గొన్నట్లు తెలిసింది. మర్కజ్ ప్రార్థనల్లో పాల్గొని తమిళనాడుకు చెందిన ఒక వృద్ధుడు కూడా చనిపోయాడు. అతనికి కరోనా ఉన్నదీ లేనిదీ నిర్ధారణ కాలేదు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే షేక్ మహ్మద్ ముస్తఫాతోపాటు పదిమంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ముస్తఫా బంధువుకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. మరికొందరు దేశంలోని పలు ప్రాంతాలకు తిరిగి వెళ్లడంతో వారి వల్ల ఇతరులకు వైరస్ వ్యాపించే అవకాశమున్నదన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. యూపీ, ఈశాన్య రాష్ట్రాల వారికీ సోకినట్లు అనుమానిస్తున్నారు.

**మర్కజ్ మౌలానాపై ఎఫ్ఐఆర్**

దక్షిణ ఢిల్లీలోని పశ్చిమ నిజాముద్దీన్‌లో మతపరమైన కార్యక్రమాన్ని నిర్వహించిన మౌలానాపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అధికారులను ఆదేశించారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న పలువురిలో కరోనా లక్షణాలు కనిపించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

## మహీంద్రా మాస్కులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా కరోనాకట్టడిలో తనవంతు సాయం చేసేందుకు ముందుకు వచ్చింది. తమ భాగస్వామ్య సంస్థ ఫోర్డ్ మోటార్స్ రూపొందించిన సరికొత్త ఫేస్ షీల్డ్‌మాస్కులను ఉత్పత్తి చేయనున్నామని మహీంద్రా సంస్థ చైర్మన్ ఆనంద్ మహీంద్రా ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. ప్రతిరోజు 500 మాస్కులను ఉత్పత్తి చేస్తామని తెలిపారు. ఫోర్డ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జిమ్ ఫేర్లీ రూపొందించిన ఈ మాస్కులు కరోనా రోగులకు చికిత్స చేసే వైద్య సిబ్బందికి ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. పోలీసులకు, మున్సిపల్ సిబ్బందికి, జర్నలిస్టులకు కూడా ఉపయోగపడే మూడు పొరల మాస్కులను కూడా ఉత్పత్తి చేయనున్నామని తెలిపారు.

## వేతనాలకు కరోనా కాటు

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు మొదలు నాలుగో తరగతి ఉద్యోగి వరకు.. అందరి జీతాల్లో వివిధ దామాషాల ప్రకారం ఈ నెల చెల్లించే వేతనంలో కోత పడుతుంది. కరోనా కట్టడికి తీసుకుంటున్న చర్యలపై ఆదివారం మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ఖజానా కష్టాల్లో ఉన్నట్టు ముందే చెప్పారు. 'రూ.12 వేల కోట్లు తెలంగాణకు రావాలి. మార్చి 15నుంచి హళ్లికి హళ్లి.. సున్నకు సున్నా ఉన్నది. ఎక్సైజ్, పెట్రోల్, జీఎస్టీ బంద్ కదా. అందుకే ఎమ్మెల్యే జీతాలు కూడా బంద్ పెట్టాల్సి వస్తుందో తెల్వదు. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా కోత విధించాల్సి వస్తే విధించాలి కదా' అని ఆయన పేర్కొన్న సంగతి తెలిసిందే. కరోనా వ్యాధి ప్రభావం, లాక్‌డౌన్ ఎన్ని నెలలు కొనసాగుతుందో తెలియని పరిస్థితిలో ప్రభుత్వం ముందుచూపుతో, అత్యంత జాగరూకతతో వ్యవహరించాల్సి ఉందనీ, అందుకే ఈ నిర్ణయం తీసుకోకతప్పలేదని అధికారవర్గాలు తెలియజేశాయి. ఉద్యోగులకు ప్రస్తుతానికి కొంత ఇబ్బంది కలిగినా ఆర్థికంగా ఎలాంటి నష్టం ఉండదని, వారి బకాయిలను తర్వాత చెల్లిస్తారని అవి వివరించాయి.

దేశంలో కరోనా కేసులు 100 నుంచి 1000కి చేరడానికి 12 రోజులు పట్టింది. అభివృద్ధి చెందిన దేశాల్లో కంటే భారత్‌లో కరోనా వృద్ధి రేటు తక్కువగా ఉన్నది.

కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్

# 'వలస' దారులు

- రోడ్లపైకి పేదలు, వలసకార్మికులు
- నగరాలు వదిలి సొంతూళ్లకు ప్రయాణం
- దేశవ్యాప్తంగా హైవేలపై ఇదే పరిస్థితి



మహారాష్ట్రలోని దహను పట్టణం నుంచి పెట్టేబేడ సర్దుకొని కుటుంబంతోసహా సొంతూళ్లకు తరలివెళ్తున్న వలస కార్మికులు

**న్యూఢిల్లీ:** పేదలు, వలస కార్మికులకు లాక్‌డౌన్ జీవన్మరణ సమస్యగా మారింది. నగరాల్లో ఉండి ఆకలితో చావడం కన్నా.. సొంతూరుకు వెళ్లి కలోగంజో తాగి బతుకుదామని వారంతా నిర్ణయించుకున్నారు. రవాణా నిలిచిపోవడంతో కుటుంబం మొత్తం కలిసి నడకమొదలుపెట్టారు. ఇలా దేశవ్యాప్తంగా లక్షల మంది వలసజీవులు రోడ్లపై కాలినడకన సొంతూళ్లకు బయలుదేరారు. ఈ దృశ్యం 1947లో దేశ విభజన సమయంలో జరిగిన వలసలను గుర్తుచేస్తున్నదని పలువురు చెప్తున్నారు. చాలా మంది ఆహారం దొరుకక, నడువలేక అనారోగ్యంబారిన పడుతున్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం ఇప్పటివరకు దేశవ్యాప్తంగా దాదాపు 22 మంది వలసకూలీలు మరణించారు. 'కరోనా కన్నా ముందే ఆకలితో చనిపోయేలా ఉన్నాం. రెండు రోజులుగా తిండిలేదు. అందుకే సొంతూరుకు బయల్దేరాం' అని ఢిల్లీ నుంచి వలసవెళ్తున్న రేణుకాదేవి చెప్పారు. భర్త, ఇద్దరు పిల్లలు కలిసి 370 కి.మీ దూరంలోని సొంతూరుకు ఆదివారం బయల్దేరారు. 'ఎక్కడివాళ్లు అక్కడే ఉండాలని ప్రభుత్వం చెప్తున్నది. కానీ.. తినడానికి తిండి కూడా లేనప్పుడు ఇక్కడుండి ఏం చేయాలి? మా పిల్లల్ని ఎలా బతికించుకోవాలి' అని యూపీకి చెందిన నేహా కశ్యప్ అనే గృహిణి నిలదీస్తున్నారు. 'ఒక్కటి మాత్రం కచ్చితంగా చెప్పగలను. కరోనా వైరస్ కన్నా ఎక్కువమంది ఆకలితోనే చనిపోయేలా ఉన్నారు' అంటూ కన్నీరుమున్నీరయ్యారు. ముంబై నుంచి వందల మంది కార్మికులు 600 కి.మీ దూరంలోని కర్ణాటకకు ప్రయాణమయ్యారు. కాగా, ఈ వలసలు ప్రమాదకరమని వైద్యనిపుణులు గంగదీప్ కాంగ్ హెచ్చరిస్తున్నారు. దేశంలో తగినన్ని కరోనా పరీక్షలు చేయడం లేదని, ఎంతమందికి వ్యాధి ఉన్నదో నిర్ధారించడం కష్టమన్నారు. వలస వెళ్తున్నవారిలో వైరస్ ఉంటే వారి సొంతూర్లలో వ్యాప్తి చెందే అవకాశం ఉన్నదని హెచ్చరించారు.



న్యూయార్క్‌లోని దవాఖానలు కరోనా రోగులతో నిండిపోవడంతో ఇతర రోగులకు చికిత్స అందించేందుకు తీరానికి వస్తున్న అమెరికా నేవీ హాస్పిటల్ నౌక

## ఒక్కరోజే 237 మంది బలి

- న్యూయార్క్‌లో మరణ మృదంగం.. వెయ్యిదాటిన మృతులు
- అమెరికాలో లక్ష మంది మరణించే ప్రమాదం: డోనాల్డ్ ట్రంప్

**న్యూయార్క్/వాషింగ్టన్, మార్చి 30:** అమెరికా ఆర్థిక రాజధాని న్యూయార్క్‌ను కరోనా మహమ్మారి అతలాకుతలం చేస్తున్నది. ఆ రాష్ట్రంలో చనిపోయిన వారి సంఖ్య ఆదివారం నాటికి వెయ్యి దాటింది. కరోనా ప్రభావం పూర్తిగా తగ్గేలోపు రాష్ట్రంలో వేలాది మంది ప్రజలు మృత్యువాత పడుతారని ఆ రాష్ట్ర గవర్నర్ ఆండ్ర్యూ క్యూమో హెచ్చరించారు. ఆదివారం ఏర్పాటు చేసిన ఓ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు రాష్ట్రంలో మృతుల సంఖ్య 728 నుంచి 965 మంది(237 మంది)కి పెరిగిందని, ఆదివారం సాయంత్రానికి ఈ సంఖ్య 1000 దాటిందని వెల్లడించారు. మరోవైపు, కరోనాతో దాదాపు లక్షమంది వరకు మృత్యువాతపడొచ్చని, రాబోయే రెండు వారాల్లో మరణాల రేటు భారీగా పెరుగనుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. వైరస్‌ను కట్టడి చేసేందుకు నిర్ణీత దూరం పాటించేలా ఏప్రిల్ 30 వరకు ఆంక్షలను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ప్రజారోగ్య సలహాదారులు, వైట్ హౌస్ టాస్క్‌ఫోర్స్ సభ్యుల సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ చర్యలు చేపట్టకపోతే భారీ సంఖ్యలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదమున్నదని వ్యాఖ్యానించారు. సోమవారం శ్వేతసౌధంలో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ఈస్టర్ పర్వదినానికల్లా అంతా సర్దుకుంటుందని అంతకుముందు పేర్కొన్న ఆయన.. తాజాగా మాటమార్చారు. జూన్ 1వ తేదీనాటికి పరిస్థితులు చక్కబడుతాయని పేర్కొన్నారు. అమెరికాలో ఇప్పటివరకు 1,43,000 మందికిపైగా వైరస్ బారినపడ్డారు. 2,500 మందికిపైగా మృత్యువాతపడ్డారు. న్యూజెర్సీలో 13,000 కరోనా కేసులు నమోదు కాగా, 160 మంది మరణించారు.



### ప్రముఖ గాయకుడు మృతి

**వాషింగ్టన్:** అమెరికాకు చెందిన ప్రముఖ జానపద గాయకుడు, గ్రామీ అవార్డు విజేత జోయ్‌డిఫ్పీ (61) కరోనా వల్ల ఆదివారం కన్నుమూశారు. ఓక్లహామాలో జన్మించిన డిఫ్పీ.. 1990లో పికప్‌మ్యాన్, ప్రాప్ మీ బీసైడ్ జ్యూక్‌బాక్స్, జాన్‌డీరి గ్రీన్.. వంటి చాలా హిట్‌సాంగ్స్ స్వరపరిచారు. ఏ థౌసెండ్ వింగ్‌డింగ్ రోడ్స్ ఆయన తొలి ఆల్బం.



ఉత్తరప్రదేశ్‌లోని బరేలి అధికారులు వలస కార్మికుల పట్ల అమానవీయంగా ప్రవర్తించారు. బస్సుల్లో తీసుకొచ్చి, రోడ్డుపై కూర్చోబెట్టి రసాయనాలు పిచికారి చేశారు. స్పందించిన జిల్లా కలెక్టర్ అభిషేక్ బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

### యోగి, కేజ్రీవాల్ వల్లే లాక్‌డౌన్ విఫలం

**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ముఖ్యమంత్రుల కారణంగా లాక్‌డౌన్ విఫలమవుతున్నదని బీహార్ నీటిపారుదలశాఖ మంత్రి సంజయ్‌ఝూ ఆరోపించారు. కూలీలకు భోజనం, వసతి సౌకర్యం కల్పించాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచిస్తున్నప్పటికీ.. ఒకేసారి పెద్ద సంఖ్యలో వారిని బస్సుల్లో తరలిస్తూ యోగి ఆదిత్యనాథ్, అరవింద్ కేజ్రీవాల్ లాక్‌డౌన్‌కు తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. వలస కార్మికులను క్యాంపుల్లో ఉంచాలన్న ప్రణాళిక వారి వల్లే విఫలమైందన్నారు.

### కేంద్రం పరిశీలనలో కార్మికులకు నగదు బదిలీ

**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్ వల్ల ఉపాధి కోల్పోయిన కార్మికులకు నగదు బదిలీ పథకం కింద చేయూతనివ్వాలన్న సూచనలను ప్రభుత్వం పరిశీలించే అవకాశం ఉందని నీతిఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్ సోమవారం తెలిపారు. నీడ లేక, ఉపాధి కోల్పోయిన వలస కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం కొంత మేరకు ప్రయత్నిస్తుందని చెప్పారు. వచ్చే ఆగస్టు వరకు ఆరు నెలల పాటు ప్రైవేట్ రంగ సంస్థలు కార్మికులను తొలిగించకుండా చట్టం తేవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

### కరోనా క్లాక్
30-3-2020

ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు: 7.64 లక్షలు
మరణాలు: 36,865

| దేశం | కేసులు | మరణాలు |
|---|---|---|
| అమెరికా | 1,52,631 | 2,817 |
| ఇటలీ | 1,01,739 | 11,591 |
| స్పెయిన్ | 85,195 | 7,340 |
| చైనా | 81,470 | 3,304 |
| జర్మనీ | 63,929 | 560 |
| ఫ్రాన్స్ | 44,550 | 3,024 |
| ఇరాన్ | 41,495 | 2,757 |
| యూకే | 22,141 | 1,408 |
| స్విట్జర్లాండ్ | 15,760 | 348 |
| బెల్జియం | 11,899 | 513 |
| నెదర్లాండ్స్ | 11,750 | 864 |
| టర్కీ | 10,827 | 168 |

దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు: 1,251
మరణాలు: 32

### దేశంలో కరోనా కేసులు

| | | |
|---|---|---|
| కేరళ 213 | మహారాష్ట్ర 198 | ఢిల్లీ 97 |
| ఉత్తరప్రదేశ్ 96 | కర్ణాటక 83 | గుజరాత్ 69 |
| రాజస్థాన్ 69 | తమిళనాడు 67 | తెలంగాణ 61 |
| కశ్మీర్ 48 | మధ్యప్రదేశ్ 47 | పంజాబ్ 38 |
| ఏపీ 23 | హర్యానా 22 | ప. బెంగాల్ 22 |

# లాక్‌డౌన్‌ను పొడిగించం!

- ప్రస్తుతం ఆ ఆలోచన లేదు
- పొడిగిస్తామన్నవి వదంతులే
- దేశంలో కరోనా వైరస్ ఇంకా స్థానిక వ్యాప్తి దశలోనే..
- స్పష్టంచేసిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారిని అడ్డుకునేందుకు దేశవ్యాప్తంగా విధించిన 21 రోజుల లాక్‌డౌన్‌ను పొడిగించే ఆలోచనేమీ ప్రస్తుతానికి లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. లాక్‌డౌన్‌ను పొడిగించనున్నట్లు పలు మీడియా సంస్థలు, సామాజిక మాధ్యమాల్లో వెలువడిన వార్తలు అవాస్తవమని కొట్టివేసింది. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్‌గౌబా ఈ మేరకు సోమవారం స్పష్టంచేశారు. మరోవైపు, లాక్‌డౌన్ తర్వాత దేశంలో నెలకొన్న పరిస్థితులు, వలస కార్మికుల సంచారంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలోని మంత్రుల కమిటీ సమీక్ష నిర్వహించింది.



**100 నుంచి 1000 కేసులకు చేరడానికి 12 రోజులు..**

దేశంలో కరోనా వైరస్ ప్రభావం ఇంకా 'స్థానిక వ్యాప్తి' దశలోనే ఉన్నదని, 'సమూహ వ్యాప్తి' దశకు చేరుకోలేదని కేంద్రం స్పష్టంచేసింది. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ సోమవారం మీడియాతో మాట్లాడారు. దేశంలో కరోనా కేసులు 100 నుంచి 1000కి చేరడానికి 12 రోజులు పట్టిందని, అభివృద్ధి చెందిన దేశాల్లో కంటే భారత్‌లో కరోనా వృద్ధి రేటు తక్కువగా ఉన్నదని చెప్పారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)కు చెందిన అధికారి గంగా ఖేడ్కర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 38,442 కరోనా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. గత మూడు రోజుల్లో ప్రైవేట్ ల్యాబొరేటరీల్లో 1,331 పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఐసీఎంఆర్ సిఫార్సు చేసిన 'హైడ్రాక్సీ క్లోరోక్విన్' తీసుకున్న అనంతరం డాక్టర్లు గుండెపోటుతో మృత్యువాతపడినట్లు వస్తున్న వార్తలపై ఆయన స్పందిస్తూ.. ఇందుకు సంబంధించి తమ వద్ద పూర్తి వివరాలు లేవన్నారు. అయితే వారికి ముందే గుండె సంబంధిత సమస్యలు ఉంటే తప్ప ఇలా జరుగదని అభిప్రాయపడ్డారు. బరేలీలో వలస కార్మికులపై స్ప్రే చేసిన ఘటనపై మాట్లాడుతూ.. అది కొందరు సిబ్బంది అత్యుత్సాహంతో చేసిన చర్య అని, వారిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు బదులిచ్చారు. కాగా, ఆటోమొబైల్ సంస్థలు వెంటిలెటర్లను తయారుచేయాల్సిందిగా కేంద్రం విజ్ఞప్తిచేసింది. కరోనా సన్నద్ధతపై స్పందన తెలియజేయాలని ఐఏఎస్ అధికారులను కోరింది.

## కరోనా కన్నా.. భయమే పెద్ద సమస్య

**వలస కార్మికుల అంశంపై సుప్రీంకోర్టు వ్యాఖ్య**



**న్యూఢిల్లీ:** కరోనా కన్నా దీనిపై నెలకొన్న భయాందోళనే పెద్ద సమస్యగా మారిందని సుప్రీంకోర్టు పేర్కొంది. వైరస్ నియంత్రణ చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడంతో ఢిల్లీ, ముంబై వంటి ప్రధాన నగరాల్లో లక్షలాది వలస కార్మికులు కాలినడకన వందలాది కిలోమీటర్లు ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆహారం, తాగునీరు లేక వారు అష్టకష్టాలు పడుతున్నారని, వీరి వల్ల వైరస్ మరింతగా వ్యాపించే ప్రమాదం ఉన్నదని, తగిన చర్యలకు కేంద్రాన్ని ఆదేశించాలంటూ సుప్రీంకోర్టులో రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. న్యాయవాదులు అలోక్ శ్రీవాస్తవ, రష్మి బన్సాల్ వేర్వేరుగా దాఖలు చేసిన ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్‌ఏ బోబ్డే, జస్టిస్ ఎల్ నాగేశ్వరరావుతో కూడిన ధర్మాసనం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరిపింది.

### మీడియాకు ఫేస్‌బుక్ 'రూ. 753 కోట్ల' సాయం

**వాషింగ్టన్:** కరోనా ప్రభావం మీడియా రంగంపై కూడా పడింది. ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలడంతో ప్రకటనల నుంచి ఆదాయం తగ్గిపోయింది. దీంతో గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న ప్రపంచ మీడియా రంగానికి తన వంతు సాయంగా 10 కోట్ల డాలర్లు (రూ.753 కోట్లు) విరాళంగా అందిస్తున్నట్టు ఫేస్‌బుక్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇలాంటి సంక్షోభ సమయంలో విశ్వసనీయ వార్తలను ప్రజలకు అందించే మీడియా సేవలు అవసరమని పేర్కొంది.



"ఒకే వెంటిలేటర్‌ను ఎక్కువ మంది రోగులకు వినియోగించే విధానాన్ని మేం అభివృద్ధి చేశాం. దేశంలో రోగులు పెరిగి, వెంటిలెటర్లకు కొరత ఏర్పడితే మనం ఈ విధానాన్ని అవలంబించవచ్చు. ఈ తరహా వెంటిలేటర్‌ను పలు దవాఖానల్లో పరీక్షించాం. ఇది పనిచేస్తున్నది. వైద్య నిపుణులు కొన్ని సలహాలు అందించారు. కొత్త ఫీచర్లను జోడించి త్వరలోనే తుదిరూపు తీసుకొస్తాం.

–డాక్టర్ సతీశ్‌రెడ్డి, డీఆర్డీవో చైర్మన్



### క్వారెంటైన్‌లో ఇజ్రాయెల్ ప్రధాని

**జెరూసలెం:** ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయంలో పనిచేస్తున్న ఒక వ్యక్తికి కరోనా పాజిటివ్ అని తేలింది. దీంతో ఆ దేశ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు, ఆయన సన్నిహిత సలహాదారులు, సిబ్బంది సోమవారం స్వీయ నిర్బంధంలోకి వెళ్లారు. కరోనా సోకిన వ్యక్తి గత రెండువారాల్లో ప్రధానిని కలువలేదని, అయినా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నెతన్యాహు క్వారంటైన్‌కు వెళ్లారని పీఎంవో తెలిపింది

### బ్రిటన్‌లో 6 నెలలపాటు లాక్‌డౌన్!

**లండన్:** కరోనా వ్యాప్తిని అడ్డుకోవడానికి దేశంలో ఆరు నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం లాక్‌డౌన్‌ను కొనసాగించే అవకాశం ఉన్నదని ఇంగ్లాండ్ డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ జెన్నీ హ్యారిస్ అంచనా వేశారు. లాక్‌డౌన్ వంటి ఆంక్షల్ని త్వరగా ఎత్తివేస్తే దేశంలో కరోనా విపరీతంగా ప్రబలే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రజలు నిర్ణీత దూరాన్ని పాటిస్తూ జాగ్రత్తలు తీసుకుంటే త్వరలోనే సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందన్నారు.


### కరోనాపై పోరులో పాక్‌కు చైనా స్నేహ హస్తం

**బీజింగ్:** పాకిస్థాన్‌లో కరోనాను నియంత్రించేందుకు దాని మిత్ర దేశం చైనా అండగా నిలుస్తున్నది. పాక్‌లోని ఓ భవనాన్ని తాత్కాలిక దవాఖానగా మారుస్తున్నట్లు చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి హువా చున్‌యింగ్ చెప్పారు. ఇప్పటికే పాక్‌కు టెస్టింగ్ కిట్లు, మాస్కులు, వెంటిలేటర్లు, స్వీయ రక్షణ పరికరాలను విరాళంగా అందజేశామని తెలిపారు. శనివారం వైద్య బృందంతోపాటు సహాయసామగ్రిని ప్రత్యేక విమానంలో చైనా పంపించింది.

### పేరు తెచ్చిన తంటా!

**సీతాపూర్, మార్చి 30:** ప్రపంచ దేశాలను వణికిస్తున్న కరోనా వైరస్.. ఉత్తరప్రదేశ్‌లోని ఓ గ్రామాన్ని మాత్రం మరో రకంగా ఇబ్బందిపెడుతున్నది. ఆ ఊరి పేరు కరోనాకు దగ్గరగా ఉండడమే ఇందుకు కారణం. దీని వల్ల ఆ ఊరిపై జోకులు పేలుతున్నాయి. సీతాపూర్ జిల్లా కేంద్రానికి 20 కి.మీ. దూరంలో ఉన్న ఆ గ్రామం పేరు కౌరానా. కరోనాకు ఇది కాస్త దగ్గరగా ఉండడంతో అందరూ వెటకారం చేస్తున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు. పర్యాటక క్షేత్రం 'నైమిశరణ్య'కు అతి దగ్గర్లో ఉన్న తమ గ్రామానికి వందల ఏండ్ల చరిత్ర ఉన్నదని, స్కంధ పురాణంలోనూ తమ ఊరి ప్రస్తావన ఉన్నదని గ్రామ పెద్ద మంజుశ్రీ త్రివేది తెలిపారు.

## వృద్ధుల ఆరోగ్యం జాగ్రత్త



**న్యూఢిల్లీ:** కరోనా వ్యాప్తి నేపథ్యంలో వృద్ధులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని కేంద్ర ఆరోగ్యశాఖ సోమవారం ప్రత్యేకంగా సూచనలు జారీచేసింది. అవేమంటే..

- బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండాలి.
- వీలైనన్ని ఎక్కువసార్లు చేతులను శుభ్రం చేసుకోవాలి.
- ఇంటికి వచ్చేవారితో సమావేశం కాకుండా చూసుకోవాలి.
- కుటుంబసభ్యులతో కూడా నిర్ణీత దూరం పాటించాలి.
- ఇంట్లో వండిన వేడి ఆహారాన్ని మాత్రమే తినాలి.
- శరీరం డీహైడ్రేట్ కాకుండా మంచి నీరు, పండ్లరసాలు తరుచూ తాగుతుండాలి.
- వాడుతున్న మందులను కొనసాగిస్తూ చిన్నచిన్న వ్యాయామాలు చేయాలి.
- జ్వరం, దగ్గు, జలుబు వస్తే, శ్వాసతీసుకోవడంలో ఇబ్బందిగా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- జలుబు, దగ్గు, జ్వరంకు సొంతవైద్యం తీసుకోవద్దు.
- వట్టి చేతులతో ముక్కు చీదకూడకుండా కర్చీఫ్ వాడాలి. ముక్కు చీదిన తర్వాత అవే చేతులతో కళ్లు, నోరును తగలకూడదు.

### 227 కొత్త కేసులు.. 5 మరణాలు

**వైరస్ సోకిన వారి సంఖ్య 1251, మృతులు 32**

**న్యూఢిల్లీ:** దేశంలో సోమవారం వందకుపైగా కొత్త కరోనా కేసులు నమోదుకాగా వైరస్ వల్ల ఏడుగురు మరణించారు. దీంతో వైరస్ కేసుల సంఖ్య 1251కి, మృతుల సంఖ్య 32కి చేరినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ పేర్కొంది. మహారాష్ట్రలో కొత్తగా రెండు మరణాలు నమోదుకావడంతో ఆ రాష్ట్రంలో అత్యధికంగా 8 మరణాలు నమోదైనట్లు తెలిపింది. గుజరాత్ (5), కర్ణాటక (3), మధ్యప్రదేశ్, ఢిల్లీ, జమ్ముకశ్మీర్‌లో రెండు చొప్పున, కేరళ, తెలంగాణ, తమిళనాడు, బీహార్, పశ్చిమ బెంగాల్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌లో ఒక్కో మరణం ఇప్పటివరకు సంభవించినట్లు పేర్కొంది.

## చికిత్సలో ముందడుగు

- హెచ్‌సీ–అజిత్రోమైసిన్ సమ్మిళిత ఔషధంతో మెరుగైన ఫలితాలు



**వాషింగ్టన్:** కరోనాను ఎదుర్కొనే చికిత్సలో కీలక ముందడుగు పడింది. అమెరికాలోని కాన్సస్ నగరానికి చెందిన వైద్యులు వైరస్ తీవ్రతను తగ్గించే ఔషధ సమ్మేళనాన్ని అభివృద్ధి చేశారు. హైడ్రాక్సీక్లోరోక్విన్(హెచ్‌సీ), అజిత్రోమైసిన్(ఏ జడ్) రసాయన మూలకాలతో ఏర్పడిన సమ్మేళనం.. కరోనాను నియంత్రించే చికిత్సలో తోడ్పడుతుందని వారు తెలిపారు. విట్రో అధ్యయనం (టెస్ట్ ట్యూబ్ పరీక్ష), ఔషధ పరీక్షల అధ్యయనాల ద్వారా ఈ పరీక్షలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ వివరాల్ని డాక్టర్ జెఫ్ కోల్యర్ అనే వైద్యుడు పేర్కొన్నారు. అధ్యయన ఫలితాలను చూస్తే, కరోనాను అడ్డుకోవడానికి హెచ్‌సీ సమర్థంగా పని చేస్తున్నట్టు తెలుస్తున్నదని తెలిపారు. రెండో ఔషదం ఏజడ్ యాంటీ బయోటిక్ (రోగకారక జీవుల నాశని)గా పని చేస్తుందన్నారు. ఫ్రాన్స్‌లో 14 మంది రోగులకు హెచ్‌సీ మాత్రమే ఇచ్చామని.. ఆరో రోజు నాటికి 57 శాతం మందికి కరోనా నెగెటివ్ వచ్చిందన్నారు. హెచ్‌సీ, ఏజడ్ కలిసిన సమ్మేళనాన్ని ఇచ్చిన ఆరుగురిలో 100 శాతం మందికి నెగెటివ్ వచ్చిందని పేర్కొన్నారు. ఈ సమ్మేళనం ఇంత సమర్థంగా ఎలా పని చేస్తున్నదో ప్రస్తుతానికైతే అర్థం కావట్లేదన్నారు.అయితే హెచ్‌సీని ఎక్కువ కాలంపాటు వాడితే గుండె, కంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నదని కోల్యర్ హెచ్చరించారు.

### వైద్యసిబ్బంది కోసం ఫైవ్‌స్టార్ హోటళ్లు

**లక్నో/న్యూఢిల్లీ:** కరోనా బాధితులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది కోసం ఉత్తరప్రదేశ్ సర్కార్ నాలుగు ఫైవ్‌స్టార్ హోటళ్లను అద్దెకు తీసుకున్నది. వీటిని క్వారంటైన్ కేంద్రాలుగా మార్చనున్నది. ఢిల్లీ ప్రభుత్వం కూడా లోక్‌నాయక్, జీబీ పంత్ దవాఖానల్లోని కరోనా వార్డుల్లో పనిచేస్తున్న వైద్యసిబ్బంది కోసం హోటల్ లలిత్‌ను అద్దెకు తీసుకున్నది.

### మే వరకు సబ్సిడీ పంట రుణాలు

**న్యూఢిల్లీ:** రైతులు సబ్సిడీ వడ్డీపై రూ.3 లక్షల వరకు స్వల్పకాలిక పంట రుణాలు పొందేందుకు ఉన్న గడువును మార్చి 31 నుంచి మే 31 వరకు కేంద్రం పొడిగించింది. లాక్‌డౌన్ వల్ల రైతులు బ్యాంకులకు వెళ్లి రుణాలను చెల్లించలేకపోయారన్న వార్తల నేపథ్యంలో కేంద్ర వ్యవసాయ శాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది.

## ఖైదీల విడుదల



ఉత్తరప్రదేశ్‌లోని లక్ష్మీపూర్ ఖేరీ జిల్లా కేంద్ర కారాగారం నుంచి విడుదలవుతున్న ఖైదీలు

**న్యూఢిల్లీ:** జైళ్లలో కరోనా వ్యాప్తి చెందకుండా ఆయా రాష్ట్రాలు వందల మంది ఖైదీలను తాత్కాలికంగా విడుదల చేస్తున్నాయి. తీహార్ జైలు నుంచి ఇప్పటికే 400 మందిని విడుదల చేయగా, రెండో విడుతలో మరో 1,500 మందిని త్వరలోనే రిలీజ్ చేయనున్నారు. మొత్తం 3,000 మందిని విడుదల చేస్తామన్నారు. మధ్యప్రదేశ్‌లో 8,000, ఉత్తరప్రదేశ్‌లో 11,000, పశ్చిమ బెంగాల్‌లో 3000, గుజరాత్‌లో 1200 మంది ఖైదీలను విడుదల చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మహారాష్ట్రలో 600 మందిని, అసోంలో45 మందిని ఇప్పటికే రిలీజ్ చేశారు. 1,200 మందిని విడుదల చేసేందుకు తమిళనాడు యోచిస్తున్నది. మరోవైపు 50 ఏండ్లు పైబడిన వారిని, మధుమేహం, హృద్రోగ సమస్యలతో బాధపడుతున్న ఖైదీలను విడుదల చేయాలని కోరుతూ సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.

### కరోనాకు.. మలేరియా మందు..
## అసోంలో వైద్యుడి మృతిపై అనుమానాలు



**గౌహతి:** కరోనా సోకకుండా యాంటీ మలేరియా మందు తీసుకున్న అసోంకు చెందిన ఓ వైద్యుడు గుండెపోటుతో మరణించారు. గౌహతిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు చెందిన డాక్టర్ ఉత్పల్జిత్ బర్మన్ (44)కు ఆదివారం గుండె సంబంధ సమస్య వచ్చింది. దీంతో మరో ప్రైవేట్ దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గుండెపోటుతో చనిపోయారు. బర్మన్‌కు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని తోటి వైద్యులు తెలిపారు. కరోనా వైరస్ సోకకుండా ఉండేందుకు హైడ్రాక్సీక్లోరోక్వైన్ తీసుకోవడం ఆయన మరణానికి కారణం కావచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు. అయితే అది ఎంత వరకు నిజమన్నది చెప్పలేమన్నారు. కాగా, గుండె, కిడ్నీ సమస్యలున్నవారిపై ఇది దుష్ప్రభావం చూపే అవకాశమున్నదని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ మందును షెడ్యూల్ జాబితాలో చేర్చడంతోపాటు ఎగుమతిపైనా నిషేధం విధించింది.



### చండీగఢ్‌లో జనావాసాల్లోకి చిరుత

**చండీగఢ్:** చండీగఢ్‌లోని సెక్టార్–5 జనావాసాల్లోకి సోమవారం ఉదయం చిరుతపులి రావడంతో జనం బెంబేలెత్తారు. జనావాసాల్లో చిరుత సంచరించడాన్ని గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో మత్తుమందు ద్వారా దానిని బంధించి పంజాబ్‌లోని జూకు తరలించారు.


మన యాది - 1928

ప్రముఖ కవి, రచయిత డాక్టర్ కపిలవాయి లింగమూర్తి జయంతి. నాగర్‌కర్నూల్ జిల్లా జీనుకుంట గ్రామంలో జన్మించారు. ఈయన డెబ్బైకిపైగా రచనలు ప్రచురించారు.

# వేదిక

నేడు కరోనా మహమ్మారితో కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నాం. వాతావరణ మార్పులతో భవిష్యత్తులో మరిన్ని విపత్తులు ఎదురుకావచ్చు. భయం వద్దు. శాస్త్ర విజ్ఞానం, ఐకమత్యంతో విపత్తులను ఎదుర్కొందాం. కరోనా కట్టడికి భారత్ చేస్తున్న కృషి అభినందనీయం.

– దలైలామా



నమస్తే తెలంగాణ

## ఇదీ తెలంగాణ సంస్కృతి

**కరోనా** మహమ్మారి మన దేశంలో విస్తరించకుండా కట్టడి చేస్తున్న క్రమంలో, వలస కార్మికుల పరిస్థితి ప్రధాన సమస్యగా తలెత్తడం విచారకరం. నగరాల నుంచి పల్లెలకు భారీ ఎత్తున వలస సాగుతున్నందున, ఏయే చర్యలు తీసుకుంటున్నారో మంగళవారం నాడు వెల్లడించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించవలసి వచ్చింది. కార్మికుల వలస కరోనా కన్నా పెద్దదిగా మారిందని న్యాయస్థానం వ్యాఖ్యానించడం గమనార్హం. అయితే కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ సమస్యను పట్టించుకుంటున్నందున, తాము ఆదేశాలిచ్చి మరింత అయోమయం సృష్టించదలుకోలేదని కూడా న్యాయస్థానం స్పష్టం చేసింది. దేశ విభజన కాలం నాడు సరిహద్దుకు ఇరువైపులా సాగిన వలసలు ఇప్పటి తరానికి తెలువదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత పెద్ద ఎత్తున వలసలు సాగడం ఇదే తొలిసారి. ఈ వలసల సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. అందువల్ల ఇది మన దేశ ప్రతిష్ఠకు చెందిన అంశంగా కూడా మారింది.

దేశంలోని ప్రధాన నగరాలన్నిటి నుంచి పల్లెలకు వలసలు సాగుతున్నాయి. రాజధాని ఢిల్లీ నుంచి లక్షలాది మంది సొంత గ్రామాలకు ప్రయాణం కావడంతో జన సమ్మర్దం ఆందోళనకర స్థాయికి చేరుకున్నది. ఢిల్లీలో రైళ్ళ కోసం ఎదురుచూస్తున్న వారు మైళ్ళ పొడుగునా బారులు తీరారు. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ర్టాలు తమ కార్మికుల కోసం వందలాది బస్సులు ఏర్పాటుచేశారు. మార్గమధ్యలో చిక్కుకుపోయిన వారిని గమ్యస్థానాలకు చేర్చడానికి ప్రయత్నిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించిన తీరు మంచిదే అయినా ఈ సందర్భంగా మరో సమస్య తలెత్తుతున్నది. కరోనా వ్యాపించకుండా కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది. కానీ కార్మికుల వలస వల్ల అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. అందుకే అంతర్రాష్ట్ర సరిహద్దులు మూసివేయాలని, ఎక్కడున్న వారు అక్కడే ఉండేవిధంగా కట్టడి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయవలసివచ్చింది. దీంతో వలస కార్మికుల కోసం ఢిల్లీతోపాటు ఆయా రాష్ర్టాలు పెద్ద ఎత్తున సహాయ శిబిరాలను ఏర్పాటుచేస్తున్నాయి. కరోనా విపత్తు తీవ్రతను గుర్తించి అన్ని రాష్ర్టాలు అప్రమత్తంగా ఉండటం అవసరం.

ఇతర రాష్ర్టాల సంగతి ఎట్లా ఉన్నా, తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న ముందు జాగ్రత్త చర్యల వల్ల ప్రజలకు, వలస కార్మికులకు ఏ ఇబ్బందులు కలుగడం లేదు. హైదరాబాద్ నగరంలోని వలస కార్మికులకు పని కల్పించకున్నా కూలీ చెల్లించడం ఆపవద్దని యజమానులకు ముందే ఆదేశాలు జారీ చేశారు. హాస్టళ్ళలో ఉంటున్న ఏపీకి చెందిన విద్యార్థులు ఇతరవర్గాల వారికి భోజన సదుపాయాలు ఏర్పాటుచేశారు. బీహార్ తదితర ఉత్తరాది రాష్ర్టాల నుంచి వచ్చిన కూలీలు ఏయే జిల్లాలో ఎంతమంది ఉన్నారో కచ్చితమైన లెక్కలు సేకరించడాన్ని బట్టి రాష్ట్ర ప్రభుత్వ సమర్థత వెల్లడవుతున్నది. ఏ రాష్ట్రం వారైనా ఇక్కడ ఉన్నవాళ్ళంతా తమ బిడ్డలేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వలసవచ్చిన కుటుంబంలోని ప్రతి ఒక్కరికి ఐదు వందల రూపాయలు ఇవ్వడంతో పాటు, వారు సొంతంగా వండుకుంటే ఆహార వస్తువులు ఇస్తామని, లేదా వండి పెట్టే ఏర్పాట్లు కూడా చేశామని చెప్పడం ముఖ్యమంత్రి ఔదార్యాన్ని ప్రతిబింబిస్తున్నది. వలస కార్మికుల కోసం తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా మరే రాష్ట్రమూ చర్యలు తీసుకోలేదనేది స్పష్టం. చాలా రాష్ర్టాలలో వలస కార్మికులు అవమానకర, దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కానీ తెలంగాణకు వచ్చిన కార్మికులు మన రాష్ట్ర వికాసం కోసం సాగుతున్న కృషిలో భాగస్వాములని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పడం ఉత్తమ సంస్కారాన్ని వెల్లడిస్తున్నది. కరోనా వంటి విపత్తులు ఎన్ని వచ్చిపోయినా అందరినీ ఆదరించే తెలంగాణ సంస్కృతి మాత్రం నిలిచే ఉంటుంది.

# కేంద్రానికి ముందుచూపు ఏది?

జాతీయం



ఇలపావులూరి మురళీమోహనరావు

రెండో ప్రపంచ యుద్ధసమయంలోనూ, ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదభూతం లక్షలాది మందిని కబళించినప్పుడూ, కొన్ని క్షుద్రదేశాలు వినాశకర ఆయుధాలను తయారుచేశామని ప్రకటించుకున్నప్పుడు కూడా ప్రపంచం ఇంతగా భీతిల్లలేదు. ఇవాళ కరోనా అనే మూడక్షరాల రక్కసి పేరు వింటేనే మానవాళి గజగజా వణికిపోతున్నది. ఎక్కడో విశ్వాంతరాళంలో లక్షల కిలోమీటర్ల దూరంలో గల గ్రహాల్లో ఏమున్నదో కూడా దర్శించగల మానవులు కళ్ళముందే వికటాట్టహాసం చేస్తూ యమపాశం విసురుతున్న కరోనా సమవర్తిని వీక్షించలేకపోతున్నారు. ఈ దేశం ఆ దేశం అనే భేదం ఏ మాత్రం లేకుండా గొంతులకు ఉరితాళ్లు బిగిస్తున్న కరోనా యమధర్మరాజును నిరోధించడం అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపినంత తేలిక కాదని తెలుసుకుంటే, ప్రకృతిప్రకోపం ముందు మానవ ప్రతిభ ఎంత అల్పమైనదో తలచుకుంటే కన్నీళ్లు రాక తప్పుతుందా?

**ప్రకృతి** బీభత్సాలు, ఉత్పాతాలు ఉపద్రవాలు సహజమే. చట్టసభల్లో మెజారిటీ, చేతిలో అధికారాలు ఉన్నంతమాత్రాన ప్రకృతి కన్నా మనం అధికులం కాము. కానీ, ప్రకృతి విసిరే సవాళ్లను ఎదుర్కోవడానికి అప్రమత్తంగా ఉండకపోతే, మన అజాగ్రత్త వల్ల దేశం మొత్తం క్షోభిస్తుంటే, అందుకు బాధ్యత ఎవరిది? నిజానికి కరోనా వైరస్ గురించి గత నవంబర్ రెండో వారంలో తొలిసారిగా వినిపించింది. చైనాలోని వూహాన్ నగరంలో ఈ వైరస్‌ను మొదట గుర్తించారు. ఆ తర్వాత అది ఇటలీ, స్పెయిన్, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, మొదలైన దేశాలన్నింటినీ చుట్టి మూడు నెలల తర్వాత చివరి మజిలీ అన్నట్లు మన దేశంలో ప్రవేశించింది. మరి మూడునెలల పాటు మన కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? కరోనా విపత్తును ఎందుకు అంచనా వేయలేకపోయింది? ఫిబ్రవరి రెండోవారంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ ఒక ట్వీట్ ద్వారా కేంద్రాన్ని కరోనా విషయమై హెచ్చరించారు. ఆయన్ను పప్పు అంటూ కేంద్రం పరిహసించి నిర్లక్ష్యం చేసింది. అప్పటికీ ఇప్పుడున్నంత ఉధృతి లేదు. మన శాస్త్రజ్ఞులు, వైద్యులు, అధికారులు ఏం చేస్తున్నారు? ఆరోగ్యమంత్రి ఏం చేస్తున్నారు? ప్రపంచదేశాల్లో ఈ కరోనా వ్యాపించి వేలాదిమంది బలైపోతున్నప్పుడు, ఆయా దేశాలు ఆంక్షలు విధిస్తున్నపుడు మన కేంద్ర పెద్దలు ఎందుకు మేలుకోలేకపోయారు? కనీ సం జనవరిలోనైనా విదేశాల నుంచి మన దేశానికి రాకపోకలు నిషేధించి, వీసాలు రద్దు చేసి, ఎవరైనా మన దేశానికి రాగానే విమానాశ్రయాల్లోనే వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అటు నుంచి అటే ఐసోలేషన్ సెంటర్స్‌కో, క్వారంటైన్ సెంటర్స్‌కో తరలించి ఉంటే ఈ రోజు పరిస్థితి ఇంత దుర్భరంగా ఉండేదా? ఇది అంటువ్యాధి అని, దీనికి వాక్సిన్ లేదని, చికిత్స లేదని, మూడో స్టేజ్‌కి వచ్చిన తర్వాత ఇక జీవించడం కష్టమని, నాలుగో స్టేజ్‌కు వచ్చాక మిగిలేది శవాలదిబ్బలే అని కేంద్రం గుర్తించలేకపోవడం వారి వైఫల్యం కాదా? చేతులు కాలాక ఇప్పుడు హఠాత్తుగా లాక్‌డౌ న్లు, షట్‌డౌన్లు, జనతా కర్ఫ్యూలు అంటూ హడావుడి చేస్తున్నది. పోనీ, ఇప్పుడు తీసుకుంటున్న చర్యలైనా ప్రణాళిక ప్రకారం ఉన్నా యా? మరి కాసేపట్లో మీదగ్గరున్న పెద్దనోట్లు అన్నీ చిత్తుకాగితాలతో సమానం అని ప్రధాని ప్రకటించిన తీరు జ్ఞాపకం వస్తున్నది.

లక్షలాది మంది పర్యాటకులు, విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికులు, కూలీలు ఇంకా అనేకవర్గాల వారు తమ పనుల నిమిత్తం దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉంటారు. అక్కడినుంచి వారు తమ గృహాలకు చేరుకోవాలంటే కనీసం రెండుమూడు రోజులు పడుతుంది. మరో రెండు గంటల్లో జనతా కర్ఫ్యూ మొదలవుతుందని ప్రకటిస్తే వారంతా ఏమైపోవాలి? ఎక్కడికి పోవాలి? ఈ అర్ధరాత్రి నుంచే రైళ్లు, బస్సులు, లారీలు, ఆటోలు బంద్ అంటే వివిధ రాష్ర్టాల వారు తమ గ్రామాలకు ఎలా చేరుకుంటారు? రాష్ట్రాంతరం వెళ్లిన వేలాదిమంది కూలీనాలీ జనం వివిధ రైల్వేస్టేషన్లలో ఇరుక్కొనిపోయారు. వారి దగ్గర డబ్బులుండవు. నగరాలు, గ్రామాలు, హోటళ్లు, సినిమా హాళ్లు, షాపులు అన్నీ మూసేశారు. తినటానికి తిండి లేక, పడుకోవడానికి బెత్తెడు జాగా లేక, చేతిలో డబ్బులు లేక, గమ్యం వెళ్లడానికి మార్గం కానరాక, లక్షలాదిమంది నరకం చూస్తున్నారు. ఇక వేలాది మంది ఉత్తరదేశ యాత్రలు, దక్షిణదేశ యాత్రలు, అంటూ గ్రూపులుగా బస్సుల్లో, రైళ్లలో తీర్థయాత్రలకు వెళ్లారు. వారిలో తొంభై శాతం మంది పండు వృద్ధులు, రోగులూ ఉంటారు.



చాలామంది మధుమేహం, రక్తపోటు, కాళ్లనొప్పులు, లాంటి వ్యాధులతో బాధపడుతుంటారు. పది పదిహేను రోజులకు సరిపడా మందులు, బట్టలు తీసుకెళ్తారు వీరంతా. హఠాత్తుగా వీరంతా వివిధ ప్రాంతాల్లో ఇరుక్కుపోవడంతో, అక్కడి భాష తెలియక, ఎక్కడ నిద్రించాలో తెలియక అల్లాడిపోతున్నారు. హఠాత్తుగా కర్ఫ్యూలు, ఆంక్షలు విధిస్తే వీరంతా ఏమైపోతారన్న కనీస ఆలోచన కేంద్రానికి లేకపోయింది! నాలుగు నెలలు నిర్లక్ష్యంగా వ్యవహరించినవారు మరో నాలుగురోజులు ఆగలేరా? కనీసం రెండు రోజులు గడువిచ్చి వేరే ప్రాంతాల్లో ఉన్నవారు ఏ రైలో ఎక్కి తమ ఇళ్లు చేరుకునే అవకాశం కల్పించకపోవడం ఘోరం కాదా! అవసరమైతే అలాంటి వారి కోసం ప్రత్యేక రైళ్లను, విమానాలను ఏర్పాటు చెయ్యడం కేంద్రానికి ఎంత పని? ఏ విధమైన ముందస్తు జాగ్రత్తలు లేకుండా హడావుడిగా తెలివి నిర్ణయాలు తీసుకోవడం, అందులో కూడా వ్యక్తిగత ఖ్యాతి కోసం పాకులాడటం మన ప్రధానికి ఒక అలవాటుగా మారిపోయింది. మనకు మరణాలు తక్కువే అని చంకలు గుద్దుకోవడం కాదు. ఇతర దేశాల్లో నాలుగు నెలల నుంచి ఉన్న వైరస్ మన దేశంలో తన ఉనికిని చాటడం పది, పదిహేను రోజుల కిందటే మొదలైందని గ్రహించాలి. రెండు మూడు నెలల కిందటే మనం జాగ్రత్తపడినట్లయితే ఇవాళ పరిస్థితి ఇంతగా దిగజారేది కాదు. ఇది ముమ్మాటికీ కేంద్రప్రభుత్వ వైఫల్యమే.

ఈ మహమ్మారిని తరిమికొట్టడానికి కేం ద్రం కేటాయించింది కేవలం పదిహేనువేలకోట్ల రూపాయలు! పటేల్ విగ్రహానికి, శివాజీ విగ్రహానికి కలిపి ఆరు వేల కోట్ల రూపాయల ను ఖర్చుచేసిన కేంద్రం కరోనా భూతాన్ని ఎదుర్కోవడానికి ముష్టి వేసినట్లు విదిల్చడం వారి చిత్తశుద్ధిలోని డొల్లతనాన్ని తెలియజేస్తున్నది.


కరోనా వ్యాప్తిని నిరోధించడానికి అందరికన్నా ముందుగా మేల్కొన్నది తెలంగాణ ప్రభుత్వం. రవాణా సదుపాయాలను కట్టడిచేసి, రాష్ట్రం మొత్తం లాక్‌డౌన్ ప్రకటించి, వైద్య ఆరోగ్యసేవలను విస్తృతపరచి, విదేశాలనుంచి, ఇతర రాష్ర్టాల నుంచి వస్తున్నవారిపై ఇరువై నాలుగు గంటలూ నిఘా వేసి, అవసరమనుకుంటే క్వారంటైన్ కేంద్రాలకు తరలించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తున్నది. అధికారులతో, మంత్రులతో అనేకసార్లు సమీక్షలు నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు వారికి మార్గదర్శనం చేస్తూ, నిధులు సమకూర్చుతూ కేసీఆర్ కరోనా మీద చేస్తున్న సమరాన్ని యావత్ దేశం ముక్తకంఠంతో ప్రశంసిస్తున్నది. 'చేతులెత్తి దండం పెట్టి చెబుతున్నా.. వినకపోతే దండాలు (లాఠీలు) తీస్తం. ఇరువై నాలుగు గంటలు కర్ఫ్యూ పెడుతం.. పోలీసుల వల్ల కాకపోతే ఆర్మీకి అప్ప చెప్తం.. షూట్ అట్ సైట్ ఆర్డర్స్ ఇవ్వా ల్సి వస్తది. అంతవరకు తెచ్చుకొందమా?' అని కేసీఆర్ హెచ్చరించి తనలోని నిజమైన రాజధర్మం తెలిసిన పాలకుడిని బయటపెట్టడం ఆయన సమర్థతకు మచ్చుతునక. ఇరుగు పొరుగు రాష్ర్టాల ప్రజలు కూడా కేసీఆర్ పని తీరును మెచ్చుకుంటున్నారంటే అతిశయోక్తి కాదు. ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో తెలిసిన నాయకుడు కేసీఆర్ అని చెప్పుకుంటున్నారు ప్రజలు.

ఇక చివరిగా మనం తప్పకుండా ప్రస్తావించుకోవలసింది మన పోలీసులను, మన వైద్య సిబ్బందిని, అధికార యంత్రాంగాన్ని, పారిశుధ్య కార్మికులను. దేశమంతా భయపడి ఇళ్లలో దాక్కుంటే, వీరు మాత్రం ఇళ్ళు, కుటుంబాలను వదిలేసి ఇరువై నాలుగు గంటలూ రోగులకు సేవలు చేస్తూ, రోడ్ల మీద కాపలా కాస్తూ, తిండీతిప్పలు కూడా సరిగా లేకుండా తమ విధులను నిర్వహిస్తున్నారు. వీరికి ఏమిచ్చినా రుణం తీర్చుకోలేం.

**(వ్యాసకర్త: సీనియర్ రాజకీయ విశ్లేషకులు)**

> కరోనా వ్యాప్తిని నిరోధించడానికి అందరికన్నా ముందుగా మేల్కొన్నది తెలంగాణ ప్రభుత్వం. రవాణా సదుపాయాలను కట్టడిచేసి, రాష్ట్రం మొత్తం లాక్‌డౌన్ ప్రకటించి, వైద్య ఆరోగ్యసేవలను విస్తృతపరచి, విదేశాలనుంచి, ఇతర రాష్ర్టాల నుంచి వస్తున్నవారిపై ఇరువై నాలుగు గంటలూ నిఘా వేసి, అవస రమనుకుంటే క్వారంటైన్ కేంద్రాలకు తరలించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తున్నది.

# వికేంద్రీకరణే మంత్రం



> కరోనా మహమ్మారిని నిర్మూలించడానికి ఏప్రిల్ 14 వరకు గీసుకున్న లక్ష్మణరేఖను ప్రజలు దాటుతారా లేక కరోనానే దాటుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతర పర్యవేక్షణతో కరోనాను అంతమొందించడానికి సత్వర చర్యలు తీసుకుంటున్నాయి. మోదీ నేతృత్వంలో వివిధ ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా ఉండి అమూల్యమైన జాగ్రత్తలు-చర్యలు తీసుకుంటున్నాయి. మోదీ 'మన్ కీ బాత్' ద్వారా ప్రజలకు చేరువై ధైర్యాన్ని నింపుతున్నారు.

విశ్లేషణ



సీహెచ్ విద్యాసాగర్‌రావు

**హైదరాబాద్‌లోని** గాంధీ దవాఖానాలో ఉన్న కరోనా బాధితునితో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. దాంతో కరోనా సోకినా భయకంపితులు కావాలిసిన అవసరం లేదనే సంకేతాన్ని దేశ ప్రజలకు ఇచ్చారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం వివిధ శాఖల పనితీరును విశ్లేషించి, కరోనా గణాంకాలను పరిశీలించి తెలంగాణ ప్రజలకు మేమున్నామనే భరోసా ఇచ్చారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఏప్రిల్ 7 వరకు తగ్గుముఖం పడుతుందని, అయినా జాగ్రత్త పడటం మంచిదని, అజాగ్రత్తగా ఉండటానికి వీల్లేదని ప్రకటించటం వల్ల ప్రజలకు, బాధితులకు ధైర్యాన్ని కలిగించడం హర్షించదగినది. కరోనా తప్పకుండా నిర్మూలించబడుతుందని ఆశిద్దాం. ఏదేమైనా ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న వైరస్‌ను తక్కువ అంచనా వేయకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 'ప్లాన్-బీ'ని కూడా ఏర్పాటు చేసుకొని అట్టడుగుస్థాయి వరకు సేవా కార్యక్రమాలను నిరంతరంగా అందించే వ్యవస్థను రూపొందించుకోవాలి. స్వచ్ఛందంగా ముందుకొచ్చే ఎన్జీవోలను, లయన్, రోటరీలను ఇతర కార్యకర్తలను భాగస్వాములను చేసి జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో ముందుకు నడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ సృష్టిస్తున్న భయానక పరిస్థితి కళ్ళకు కట్టినట్లుగా ప్రచార, ప్రసార సాధనాల ద్వారా ప్రతి ఇంటికి చేరింది. ముందు జాగ్రత్త చర్యల గురించి కూడా ఈ సాధనాలు ప్రజలకు అవగాహన కలిగించడంలో సఫలీకృతమయ్యాయి. ఇతర వ్యవస్థలతో ఇంత త్వరగా ప్రజలను అప్రమత్తం చేయడం అసంభవం. వీరికి సమాజం ఎంతో రుణపడి ఉన్నది. అయితే వివిధ దేశాల్లో కరోనా వల్ల జరుగుతున్న హృదయవిదారక సంఘటనలను పరిగణనలోకి తీసుకొని, ప్రజలందరూ రాజకీయాలను, కులాలను, వర్గ వైషమ్యాలను పక్కనబెట్టి, ఒక వినూత్నమైన ఆమోదయోగ్యమైన, ఆచరణయోగ్యమైన, సమగ్రమైన కార్యాచరణతో ముందుకుపోవాలి. ప్రజలకు ధైర్యాన్ని కలిగించడంతో పాటు వారిని భాగస్వాములను చేసి మనల్ని మనం రక్షించుకునే పరిస్థితి వచ్చిందని ప్రభుత్వాలు తెలియజేయాలి. ముందు జాగ్రత్తల గురించి ప్రచార, ప్రసార సాధనాలు ఉపయోగపడినా, ఈ వ్యాధి బారిన పడినవారికి ప్రత్యక్ష సేవలు అందించడానికి స్వచ్ఛంద సంస్థలు, సాంకేతిక సిబ్బంది, వైద్య అనుబంధ విధులు నిర్వహిస్తున్నవారు అవసరం. కేవలం ప్రభుత్వమే అన్నీ చేస్తుందనుకోవడం సరికాదు. కొన్ని పొరపాట్లు జరిగినా మన సమాజం మంచి కోసం కలిసికట్టుగా నిలబడుతుందని ఎన్నో సందర్భాల్లో రుజువు చేసుకున్నది.

ప్రభుత్వాలు ప్రత్యేకంగా ఆదేశించకపోయినా అనూహ్యమైన స్వీయ నియంత్రణను వేలాది గ్రామ పంచాయతీలు స్వచ్ఛందంగా పాటిస్తున్నాయి. ఏండ్ల తరబడి పంచాయతీ వ్యవస్థల్లో ఉన్న స్వావలంబన, స్వపరిపాలన స్ఫూర్తి గ్రామగ్రామాన పెల్లుబుకింది. ప్రభుత్వ యంత్రాంగం, పోలీసు వ్యవస్థ ప్రమేయం లేకుండా స్వీయ నియంత్రణను పాటించి, ప్రపంచానికి చాటిచెబుతున్న విధానం, అనన్య సామాన్యం అనితర సాధ్యం. అరువై శాతానికిపైగా 'స్వపరిపాలన' ఈ దేశంలో కొన్ని గంటల్లో రూపుదిద్దుకొని కొనసాగుతు న్న సందర్భాన్ని, సమయం వచ్చినప్పుడు ఈ వ్యవస్థను కూడా చప్పట్లతో గౌరవించడం మన ధర్మం.

ఏప్రిల్ 14 తర్వాత అమలుచేయాల్సిన కార్యాచరణను ప్రభుత్వం ఈ లోపే రూపొందించుకోవాల్సిన అవసరం ఉన్నది. స్వీయ నియంత్రణలోనే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మండలస్థాయి వరకు బాధితుల చికిత్స కోసం వ్యవస్థను రూపొందించడం అత్యవసరం. నేడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పెద్ద పెద్ద దవాఖానాలు, చిన్న నర్సింగ్‌హోంలు దాదాపు మూతపడ్డాయి. వీటికి అనుబంధంగా ఉన్న డాక్టర్లు, నర్సులు అనుబంధ సాంకేతిక సిబ్బంది, ఆర్‌ఎంపీలు వేల సంఖ్యలో ఉన్నారు. వీరందరినీ సంప్రదించాలి. మూసివేయబడిన విద్యా సంస్థలు, ఇతర భవనాలను, సిబ్బందిని జాగ్రత్తగా ఉపయోగించి ఈ కార్యాచరణను వికేంద్రీకరిస్తే ప్రజలకు నమ్మకం కలుగుతుంది. దీంతో ప్రజలు కూడా భాగస్వాములవుతారు. సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేయడం, పర్యవేక్షించడం అధికారులకు సులభమవుతుంది. వికేంద్రీకరణ మంత్రమే ఈ కల్లోల పరిస్థితికి సమాధానం.

ఈ కరోనా వైరస్ ఏప్రిల్ 14 తర్వాత బలహీన పడుతుందని భావిస్తున్నాం. ఒకవేళ కరోనా సోకినా మనకు రోగ నిరోధకశక్తి, స్వీయ నియంత్రణ ప్రభుత్వాల సత్వర చర్యల వల్ల త్వరలోనే కోలుకుంటారని, మృత్యుంజయులవుతారని నమ్మకం ఉన్నది. అయినా ముందస్తు జాగ్రత్తలు అనివార్యం.

**(వ్యాసకర్త: మహారాష్ట్ర మాజీ గవర్నర్)**

## ఖబడ్దార్!!

నా దేశ మహావృక్షానికి
వేళ్ళు మన పల్లెటూళ్ళు..
వూళ్ళకు వూళ్ళు కత్తులు దూసి...
కరోనాకు కంచెలు పాతి
వీర సైనికుల్లా తొడగొడుతుంటే..
ఊరి బయటా, లోపలా
కాపలా కాస్తుంటే.. ఏమి దృశ్యం...!
ఇదే కదా పోరాట స్ఫూర్తంటే!

ఓ పట్నం వాసీ..
కాలు నిలకడలేని
తిరుగుబోతు పిపాసీ
'కరోనా'ను నగరమంతా
వెదజల్లే 'హక్కు' ఎవడిచ్చాడురా
నీకు?
కుదించుకుపోయిందా నీ
అక్షర జ్ఞానం?!

గది గోడలే ఇంటి
'కోట గడి'లుగా
వ్యూహమే బలమైన
ఆయుధంగా
నీ గుమ్మం చూస్తేనే
'కరోనా' గడగడలాడేలా
నిలువరించలేవా!?
ఈ నిశ్శబ్దం ఓ 'యుద్ధం'
ఉబుసుపోక మాటలుండవే..
యుద్ధనీతి తప్ప!



రోడ్లు కూడా ఉగ్రంగా
మండుతున్నయ్!

రయ్యిరయ్యిన వస్తే.. మంటల్లో
తగలడిపోతావ్..!

సైనికుడిలా సమరం
సాగిస్తావో...

వినాశకుడిలా దొంగదెబ్బ తీస్తావో
తేల్చుకో..!!

అంతా నీ 'ఇష్టం' కాదు
కాలం కాపాలా కాసి..
నిన్నేరి పారేస్తుంది..
ఖబడ్దార్!!



రావులపల్లి సునీత
99857 99966

## మీ మంచికేనోయ్!

అంతా మీ మంచికేనోయ్!
కావాలంటే నా చుట్టూ అల్లుకున్న
ప్రోటీన్ రింగ్ మీదొట్టు
నేనేం చేశానని? నన్నాడిపోసుకుంటున్నారు!
ఏమి కోల్పోయారో మీకే తెలియకుండా!
ఆధునిక టెక్నాలజీ మాయలో పడి
అనుబంధాలను వీడి,
పాత రోతను అసహ్యించుకొని
కొత్త వింతను, చెత్త పుంతలు తొక్కుతూ..
పల్లెలను మరచి, పట్టణాలను వలచి
ప్రేమానుబంధాలను తుడిచి
పాశ్చాత్య నాగరికతల వెంట నడచి
నమస్కారాలను నాశనం చేసి,
శుచి శుభ్రత మరిచి, మీరంతా చిందేస్తుంటే?
దేవుడు పంపిన కాలున్ని
క్రమశిక్షణలో పెట్టడానికి వచ్చిన శని దేవున్ని
మీరంతా భ..భయంగా పిలుచుకునే కరోనాని.
చెడు ఉంటేనే కదా మంచికి విలువ!
ఇకనైనా మారండిరా మానవాధముల్లారా!
శుభ్రత పాటిస్తే? పతా లేకుండా పరారవుతా.
మందు కనిపెడితే? తోక ముడుచుకుంటా?
తస్మాత్ జాగ్రత్త,
ఇట్లు.. మీ ప్రియమైన శత్రువు కరోనా!




ఇందిరా వెల్ది
92474 78080

# ప్రణతోస్మి దివాకరమ్



వరిగొండ కాంతారావు

నమస్తే.. నమస్తే.. నమః



**సూర్యుడు** లేకుంటే ఈ జగత్తు లేదు. ఈ జగత్తును దర్శిస్తూ అందులో జీవిస్తున్న మనమూ ఉండము. సూర్యకిరణాలు వేడిని కలిగి ఉంటవి. తాపాన్ని కలిగిస్తవి. కనుక, సూర్యునికి 'తపనుడు' అని పేరు. చంద్రకిరణాలు చల్లగా వుంటవి. ఆహ్లాదకరాలుగా ఉంటవి. కానీ, ప్రాణశక్తి మాత్రం సూర్యరశ్మిలోనే ఉంటుంది. అందువల్లనే సూర్యుడు ప్రజాపతిగా కీర్తనలు పొందుతున్నాడు.


ఆదిత్యునికి సూర (శూర), సూర్య అని రెండు పేర్లున్నాయి. 'సంతి చంతీతి సూర: సృగతౌ'. సంచరించువాడు. గగనతలంలో నిలకడగా వుండక సంచరిస్తాడు. కనుక, అతడు సూర్యుడు. 'సువతి ప్రేరయతి వ్యాపే రిష్వితి సూర్య:' వ్యాపారాలలో ప్రేరేపించే వాడు సూర్యుడు. వ్యాపారమంటే వస్తు వినిమయ లావాదేవీలు మాత్రమే కాదు. ఒక ప్రాణి జీవించడానికి, తన ప్రాణాన్ని నిలుపుకోవడానికి నిర్వర్తించే క్రియలన్నింటినీ కలిపి జీవన వ్యాపారమంటాం. చరాచర సృష్టిలోని జీవకోటి సమస్తమూ తన మనుగడను సాగించేందుకు తోడ్పడే వాడు సూర్యుడన్నమాట.

సూర్యునికి 'మిహిరుడు' అని మరొక పేరుంది. 'మేహతి మేఘరూపీ విశ్వం సించతీతి మిహిర:, మిహసేచనే'. తాను మేఘరూపియై ప్రపంచాన్ని తడిపెడు వాడు. సూర్యుని కారణంగా మేఘాలు ఏర్పడుతున్నాయి. మేఘాలు వర్ష కారకాలు. వర్షాల వల్ల వృక్ష సంతతి. వృక్ష సంతతి మళ్లీ రెండు రకాలు. ఒకటి వనస్పతులు, రెండు ఓషధులు. వనస్పతులు జంతుజాలం ఆకలిని తీరుస్తే, ఓషధులు ఆరోగ్యాన్ని కాపాడుతవి. ప్రకృతి పోషిస్తున్న కారణంగా జంతుజాలం పుష్టిగా ఉన్నది. ఈ పుష్టికి మూల కారణం సూర్యరశ్మి. అందువల్ల సూర్యునికి 'పూషుడ'ని పేరు. 'పుష్ణాతీతి పూషా. పుష పుష్టౌ'. పోషించే వాడు.

'భాసం కరోతీతి భాస్కర:' కాంతిని కలిగించే వాని పేరు భాస్కరుడు. చీకట్లు తొలిగిపోతే వెలుగు వస్తుంది. వెలుగు తొలిగిపోతే చీకటి వస్తుంది. చీకటిని వెలుగు తొలిగిస్తున్నదా, వెలుగును చీకటి తొలిగిస్తున్నదా అని ఆలోచించినప్పుడు వెలుగే చీకట్లను తొలిగిస్తున్నదని సమాధానం వస్తుంది. కశ్యప ప్రజాపతి సంబంధీకుడు (కుమారుడు) కనుక సూర్యుడు కాశ్యపేయుడు. 'జపాకుసుమం' అంటే ఎర్ర మందారం. జపాకుసుమాలు ఇప్పుడు అనేక వర్ణాలలో వస్తున్నవి. కానీ, తొలి దాసాని పువ్వు రంగు ఎరుపు మాత్రమే.

జపాకుసుమ వర్ణంతో సమానమైన, అద్భుతమైన వెలుగులను విరజిమ్మే సూర్యుడు చీకట్లకు శత్రువు. సర్వ పాపాలను నశింపజేయగల శక్తి గలిగివున్నవాడు. జీవకోటి పగ టి వ్యాపార నిర్వహణకు తోడ్పడేవాడు కనుక, అత డు దివాకరుడు. 'దివా అహని ప్రాణినశ్చేష్టా వతః కరోతీతి దివాకర:' అని 'అమరకోశం' చెబుతున్నది. అటువంటి దివాకరునికి ప్రణామాలు అర్పిస్తూ ప్రార్థిద్దాం.

'జపాకుసుమం సంకాశం కాశ్యపేయం మహాద్యుతిం
తమోరిం సర్వపాపఘ్నం ప్రణతోస్మి దివాకరం'.



నమస్తే తెలంగాణ
కరీంనగర్
మంగళవారం 31 మార్చి 2020
www.ntnews.com

# జిందగీ

## క్వారంటైన్‌లో...

కరోనా నేపథ్యంలో చాలా దేశాల్లో లాక్ డౌన్ అమలులో ఉన్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నోబెల్ గ్రహీత బహుమతి మలాల తాను కూడా సెల్ఫ్ క్వారెంటైన్‌ను పాటిస్తున్నట్టు తెలిపింది. ఈ ఖాళీ సమయంలో కేశాలంకరణపై ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్టు ట్విట్టర్‌లో రాసింది. మొదటి ప్రయత్నంగా రూపొందించుకున్న హెయిర్‌స్టయిల్ ఫొటోను పోస్ట్ చేసింది. తనలానే ఈ గృహనిర్బంధ సమయాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలనీ కోరింది.



## కరోనా మీద ఆన...

# మద్యానికి గుడ్‌బై!



**కరోనా లాక్‌డౌన్.. మన స్వేచ్ఛను హరించిందని గగ్గోలు పెడుతున్నాం. కానీ అదే లాక్‌డౌన్ మనం ఆరోగ్యంగా ఎలా ఉండాలో నేర్పుతున్నది. మన దురలవాట్లను ఎలా వదిలించుకోవాలో మార్గం చూపిస్తున్నది. మద్యం లాంటి వ్యసనాలకు బానిసలైన మనసులను కట్టడి చేస్తున్నది. ఆరోగ్యాన్ని హరించే మద్యంలో కాదు.. ఆత్మీయులతో గడపటంలోనే అసలైన ఆనందం ఉందని సూచిస్తున్నది. మరి మనసుకు కళ్లెం వేసి, మద్యాన్ని శాశ్వతంగా వదిలించుకుంటారా? లేక కుటుంబానికి దూరమవుతారా? మనసు ఎవరినో ఒకరినే ప్రేమిస్తుంది. మీరు ప్రేమించేది కుటుంబాన్నా..? మద్యాన్నా...? తేల్చుకోవాల్సిన తరుణమిది.**

... రచన ముడుంబై

ఏదైనా మన మంచికే..! మనల్ని సానుకూల ఆలోచనల వైపు నడిపించడానికి మన పెద్దవాళ్ల నోటి నుంచి వచ్చే బీజాక్షరాలు. ఇప్పుడు వచ్చిన కరోనా కూడా మన మంచికే అనుకుంటే, బోలెడన్ని పాజిటివ్ అంశాలు దొరుకుతాయి. లాక్‌డౌన్ పుణ్యమా అని అన్ని దుకాణాలతో పాటుగా మద్యం షాపులకు కూడా తాళాలు పడ్డాయ్. మద్యానికి అలవాటు పడుతున్నవాళ్లు ఇదే అదనుగా తమను తాము మార్చుకోవచ్చు. ఇక లాక్‌డౌన్ పూర్తయిన తరువాత కూడా మద్యం జోలికి వెళ్లకుండా మనసును కట్టడి చేసుకోవచ్చు. లాక్‌డౌన్‌ను మీ నుంచి ఆల్కహాల్ రక్కసిని తరిమికొట్టే ఆయుధంగా మలచుకోవడం మీ చేతుల్లోనే ఉందంటున్నారు నిపుణులు. సాధారణంగా ఆల్కహాల్‌కు అలవాటు పడ్డవాళ్లలో తమకు తాముగా మానేయాలని గట్టిగా అనుకునేవాళ్లు 10 శాతమే. 90 శాతం మంది ప్రయత్నిస్తూ ఉంటారు కానీ, అంతలోనే దానికి కట్టు బానిసలైపోతారు. దాంతో మెదడు వారి మాట వినదు. ఇలాంటివాళ్లకు ప్రతి 8 గంటలకోసారి ఆల్కహాల్ డోసు పడాల్సిందే. లేకుంటే విత్‌డ్రావల్ లక్షణాల్లో భాగంగా పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుంటారు. లాక్‌డౌన్ సమయంలో ఇలాంటివాళ్ల సంఖ్య ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో పెరుగుతున్నది. ఇతర ప్రైవేటు సైకియాట్రిస్టులు కూడా మందుబాబులతోనే బిజీగా ఉంటున్నారు.

### మెదడుపై దెబ్బ

మన మెదడు పరిణామక్రమంలో ముందుంటుంది. పనితీరు పరిణతి చెంది ఉంటుంది. మెమొరీ, ఇంటిలిజెన్సీ, జడ్జ్‌మెంట్, నిర్ణయాత్మక శక్తి, మంచీ చెడుల విచక్షణ, భావోద్వేగాల వంటివి జంతువుల కన్నా మనలో మెరుగ్గా ఉంటాయి. ఆల్కహాల్ రసాయనం వల్ల ఈ కేంద్రాలన్నింటి పైనా ప్రభావం పడుతుంది. అంతేగాక మన ఆలోచనలోని తప్పొప్పులను విశ్లేషించే ఇన్‌హిబిటరీ సెంటర్ సరైన ఆలోచన వైపు మనల్ని నడిపిస్తుంది. కానీ మద్యం తాగినవాళ్లలో ఈ సెంటర్ పనిచేయదు. అందుకే వీళ్ల ప్రవర్తనలో, ఆలోచనా తీరులో, భావోద్వేగాల్లో పాజిటివ్ అంశాలేవీ ఉండవు. సహజంగానే ఆల్కహాలిక్స్ బుర్రనిండా అనుమానాన్ని కలిగివుంటారు. జీవితభాగస్వామిపై అనుమానం, స్నేహితులపై అనుమానం, పిల్లలపైనా అనుమానమే.

### అకస్మాత్తుగా మానేస్తే..

ప్రస్తుత పరిస్థితుల్లో మద్యం దొరికే అవకాశం లేదు కాబట్టి మానేయక తప్పదు. అయితే మద్యానికి బానిసలైనవాళ్లు ఒక్కసారిగా మానేస్తే మానేసిన మొదటి 6 నుంచి 8 గంటల్లో చేతులు వణకడం మొదలవుతాయి. 12 నుంచి 16 గంటలు దాటేసరికల్లా పిచ్చి ప్రవర్తన వస్తుంది. హల్యూసినేషన్స్, డెల్యూషన్స్‌లోకి వెళ్లిపోతారు. ఎవరో తమను చంపడానికి వస్తున్నట్టు, లేనిది ఉన్నట్టు ఊహించుకుంటుంటారు. దీనివల్ల తమకుతామే కానీ, ఇతరులకు కానీ హాని కలిగించే అవకాశం ఉంటుంది. ఈ డెల్యూషన్స్ వల్ల తాము అనుకున్నదే కరెక్ట్ అని ఫీలవుతారు. అది తప్పు అని మనం రుజువు చేసినా నమ్మరు. ఎవరో చంపుతున్నారంటారు. అక్కడ ఎవరూ లేరని నిరూపించినా నమ్మరు. జడ్జ్‌మెంట్ కోల్పోతారు. విత్‌డ్రావల్ తీవ్రతను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకునేవాళ్లు కూడా ఉంటారు.

### సమస్యలెందుకు?

మద్యం తీసుకున్నప్పుడు మెదడులో గాబా అనే రసాయనం నార్మల్ కన్నా 20 నుంచి 50 రెట్లు అధికమవుతుంది. మద్యం తీసుకోవడం మానేయగానే ఒక్కసారిగా ఈ రసాయనం మోతాదు పడిపోతుంది. మద్యం తీసుకుంటున్న కొద్దీ ఒక్కొక్క మెట్టూ ఎక్కుతున్నట్టుగా గాబా మోతాదు పెరుగుతుంటుంది. గాబా కూడా ఒక్కసారిగా కిందకు పడిపోగానే మానసిక పరిస్థితి అస్తవ్యస్తం అవుతుంది. విత్‌డ్రావల్ లక్షణాలు కనిపిస్తాయి. గాబా మెదడులోని ఎన్నో ఇతర రసాయనాలను కంట్రోల్ చేస్తుంది. దీని మోతాదే పడిపోయేసరికి మిగిలిన రసాయనాల్లో అసమతుల్యం ఏర్పడుతుంది. మెదడులోని విద్యుత్ రసాయన చర్యలు కూడా నార్మల్ కన్నా వేగవంతమై... ఫిట్స్ వస్తాయి. అందుకే ప్రవర్తనలో, ఆలోచనా తీరులో వ్యతిరేక భావోద్వేగాలు పెరిగిపోతుంటాయి.

### చికిత్స ఇది!

మద్యం అలవాటు తీవ్రతను బట్టి చికిత్స ఉంటుంది. రోజూ తాగేవాళ్లకు మందులు అవసరం. సోషల్ డ్రింకింగ్ చేసేవాళ్లు ఈ లాక్‌డౌన్‌ను మద్యం మానేయడానికి ఉపయోగించుకోవచ్చు. విత్‌డ్రావల్ లక్షణాల తీవ్రత ఎంతుందనేది ఇంటర్వ్యూ టెస్టు ద్వారా తెలుసుకుంటారు. చేతుల్లో వణుకు, వాంతులు, ఛాతీ పట్టేసినట్టుండటం, గుండె వేగం హెచ్చడం, నిద్ర పట్టకపోవడం లాంటి అంశాల స్కోరును బట్టి తీవ్రతను గుర్తిస్తారు. చికిత్సలో భాగంగా ముందు డీటాక్సిఫికేషన్ కొరకు గాబా టాబ్లెట్లు ఇస్తారు. ఈ టాబ్లెట్‌ను వారం పదిరోజుల వరకు వాడాల్సి ఉంటుంది. తరువాత డీఅడిక్షన్ కోసం యాంటి క్రేవింగ్ మెడిసిన్స్ ఇస్తారు. అంటే డోపమైన్ నే టాబ్లెట్ రూపంలో ఇచ్చి, కొన్నాళ్ల తరువాత సహజంగానే డోపమైన్ విడుదల పెరిగే యాక్టివిటీస్ చేయిస్తారు.



### ఇలా మానండి

సాధారణంగా పని ఒత్తిడి వల్లనో, నిద్ర పట్టకపోవడం వల్లనో మద్యం తీసుకుంటాం అని చెప్తుంటారు. ఇప్పుడు ఆ పనిఒత్తిడి లేదు. రోజంతా ఇంట్లోనే. కావాల్సినంత విశ్రాంతి. నిద్ర సరిపోదన్న బాధా లేదు. మద్యం మానడానికి ఇంత కన్నా మంచి సమయం దొరకదు. ఒక మూడు నాలుగు వారాల పాటు మద్యాన్ని ముట్టకుండా ఉంటే, మన మెదడు ఆ వ్యసనాన్ని ఎదుర్కొనే శక్తిని పెంచుకుంటుంది.

- ఇష్టమైన ఆహారాన్ని చక్కగా తినడం కూడా మద్యాన్ని మాన్పించే ఔషధమే. తాగాలనిపించినప్పుడల్లా ఏదో ఒకటి తినాలి. కడుపు నిండా ఉంటే డ్రింక్ మీదకి మనసు వెళ్లదు.
- మద్యం అలవాటున్నవాళ్లు ఏ అయ్యప్ప మాలో వేసినప్పుడు మద్యం మానినప్పటికీ వారిలో విత్‌డ్రావల్ లక్షణాలు కనిపించవు. దైవదీక్షలో ఉన్నప్పుడు దాని జోలికి పోవద్దన్న సంకల్పమే ఇక్కడ వారికా సామర్థ్యాన్ని ఇస్తుంది. కాబట్టి ఇష్టమైన వాళ్లమీద ప్రమాణం చేయడమో, దైవ కార్యాల్లో పాల్గొనడమో చేయండి.
- మద్యం తీసుకున్నప్పుడు మనసుకు ప్రశాంతతనిచ్చే రసాయనాలైన డోపమైన్స్ విడుదలవుతాయి. మద్యం కాకుండా ఇతరత్రా కొన్ని పనులలో కూడా ఇవి విడుదలవుతాయని రుజువైంది. వ్యాయామం చేసినప్పుడు, క్రీడలు, యోగా, ధ్యానం, నచ్చిన మనుషుల్ని కలవడం, వాళ్లతో సమయం గడపడం వల్ల కూడా సహజంగా డోపమైన్స్ విడుదలవుతాయి. కాబట్టి మనసుకు ఒకలాంటి శాంతి లభిస్తుంది. కాబట్టి మీ ఆత్మీయులు, కుటుంబ సభ్యులతో గడుపుతూ ప్రశాంతంగా ఉంటారా.. ఆల్కహాల్ మీద ఆధారపడుతారా..అన్నది మీరే నిర్ణయించుకోండి.
- మద్యం తీసుకునేవాళ్లు సాధారణంగా దానివల్ల కలిగే అనర్థాల గురించి తెలుసుకునే ప్రయత్నం చేయరు. అలా కాకుండా ఈ సెలవు కాలంలో వాస్తవాలను తెలుసుకోవడానికి సాహసించరు. అవగాహన పెంచుకోవడం వల్ల మద్యానికి దూరంగా ఉండగలిగే సామర్థ్యాన్ని మెదడు పెంచుకుంటుంది. .
- ఒకసారి విత్‌డ్రావల్ లక్షణాలు మొదలైతే మాత్రం వెంటనే సైకియాట్రిస్టు లేదా డీ అడిక్షన్ సెంటర్‌కి వెళ్లాలి.







**డాక్టర్ విరించి శర్మ**
సైకియాట్రిస్ట్, డైరెక్టర్
మానస హాస్పిటల్
సికింద్రాబాద్
9700001311

## మీరేం చేస్తున్నారు?

లాక్‌డౌన్ అమలులో ఉంది. ఇంటి నుంచి బయటకు వస్తే ప్రాణాలకే ముప్పు. మరి ఇంట్లో ఉండి ఏం చేస్తున్నారు?. 'ఖాళీ దొరికింది కదా! సద్వినియోగం చేసుకుంటున్నాం' అంటున్నారు ఈ హైదరాబాద్ మహిళలు. క్రాఫ్ట్ డిజైనింగ్స్, హోమ్ డెకరేషన్స్, సృజనాత్మక వస్తువుల తయారీలో ఆసక్తి చూపుతున్నారు వీరు. మణికొండకు చెందిన హోమ్ బేకర్ సింధూ కిలారీ తనలాంటి మహిళల కోసం బేకింగ్ టిప్స్‌ను సోషల్ మీడియా ద్వారా తెలియజేస్తున్నది. రోజూ ఒక రెసిపీ పోస్టు చేస్తున్నట్టు ఆమె తెలిపింది. ఎప్పుడూ ఆటల్లో బిజీగా ఉండే జిమ్నాస్ట్ అలికా జో యాంటిక్స్ డిజైన్లను రూపొందిస్తూ హోమ్ క్వారంటైన్‌లో గడుపుతున్నది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ప్రియాంక లక్ష్మి హోం డెకొరేషన్స్ చేస్తూ వీడియోలను పోస్టు చేస్తున్నది. ఇలా ఎంతోమంది మహిళలు నచ్చిన పనులు చేస్తూ ఇంట్లో కాలం గడుపుతున్నారు. మరి మీరేం చేస్తున్నారు?






## అత్యవసర సిబ్బందికి...అన్నం ఉచితం!

**ఆయనో భోజనశాల యజమాని. క్యాటరింగ్ కూడా నిర్వహిస్తుంటాడు. కరోనా నేపథ్యంలో దేశవ్యాప్తంగా విధించిన లాక్‌డౌన్ మూలంగా అన్ని రకాల వ్యాపారాలూ... ముఖ్యంగా హోటల్స్ మూతపడ్డాయి. వాటితో పాటే ఆయన భోజనశాల కూడా. అలాగని ఆయన ఇంట్లో విశ్రాంతి తీసుకోవడం లేదు. తన హోటల్‌నే సేవాకేంద్రంగా మలిచాడు. కరోనా నివారణకు శ్రమిస్తున్న పోలీసు, వైద్య, నగర పాలక సిబ్బందికి రోజూ ఉచితంగా భోజనాలు అందిస్తున్నాడు.**



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని చైతన్యపురికాలనీకి చెందిన నగునూరి రాజేందర్ చైతన్యపురిలోనే వినాయక భోజనాలయం పేరుతో హోటల్ నడుపుతున్నాడు. క్యాటరింగ్ పనులూ నిర్వహిస్తుంటాడు. కరోనా లాక్‌డౌన్ దెబ్బకి తన హోటల్‌ని తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చింది. ఆ సమయంలోనే కుటుంబాలకు దూరంగా ఉంటూ కరోనా నిర్మూలన కోసం రాత్రనక, పగలనక సేవలందిస్తున్న అత్యవసర సిబ్బంది ఇబ్బందులను కళ్లారా చూశాడు. వారి ఆకలి తీర్చాలన్న సంకల్పంతో ఉన్నతాధికారులను సంప్రదించాడు. వెంటనే అనుమతి లభించింది. మార్చి 23న ఈ విషయమై వాట్సాప్‌లోనూ ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం అందించాడు. 24వ తేదీన తొలిసారిగా సుమారు 200 మందికి సరిపోయేలా భోజనాలు తయారు చేసి ఉచితంగా వడ్డించాడు. తొలిరోజు కేవలం వందమంది మాత్రమే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. మరునాడు వచ్చేవారి సంఖ్య పెరిగింది. 25న ఉగాది సందర్భంగా అందరికీ ఉగాది పచ్చడి కూడా అందించి, విధి నిర్వహణ కారణంగా ఇంటికి వెళ్లలేకపోయిన వారికి ఇంట్లోనే ఉన్న అనుభూతిని ప్రసాదించారు. పోలీసులు, వైద్య సిబ్బంది, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో పాటు అత్యవసర విభాగాల్లో పనిచేస్తున్న చాలామందికి ఇప్పుడు ఆకలి వేయగానే గుర్తొచ్చేది.. రాజేందరే!

... మధుకర్ వైద్యుల

### మరికొన్ని రోజులు...



పరిస్థితులను బట్టి మరికొన్ని రోజులు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తాను. లాక్‌డౌన్ మూలంగా కూరగాయల ధరలు గతంలో కంటే పెరిగినా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాను. ఎవరూ ఆకలితో ఉండకూడదన్న కేసీఆర్‌గారి ఆలోచనకు అనుగుణంగానే అత్యవసర విభాగాల్లో పనిచేస్తున్నవారికి ఉచితంగా భోజనం అందిస్తున్నాను. ఇది సేవ కాదు,నా బాధ్యత.

-నగునూరి రాజేందర్

## కూరగాయలతో కరోనా వస్తుందా?


**పండ్లు, కూరగాయల ద్వారా కొవిడ్-19 ఇన్‌ఫెక్షన్ వస్తుందా? బయటి నుంచి కొనుక్కొచ్చిన వీటిని ఎలా శుభ్రం చేయాలి? పాల ప్యాకెట్లు, క్యారీ బ్యాగులను తెచ్చినప్పుడు ఏం చేయాలి?**

**- వనిత, హైదరాబాద్**

సందేహం సమాధానం


పండ్లు, కూరగాయలను అమ్మేవాళ్లు ఎవరైనా చేతులు శుభ్రంగా కడుక్కున్న తరువాతే వాటిని ముట్టుకోవాలనీ, ఇంకా వీలైతే డిస్పోజబుల్ గ్లౌవ్స్ వేసుకుని అమ్మాలని ప్రభుత్వాలు సూచిస్తున్నాయి. అయినా సరే మనం ఇంటికి తెచ్చుకున్న తరువాత కూడా జాగ్రత్తపడటం మంచిది. నిజానికి మనం కూరలు ఉడికించినప్పుడు ఆ ఉష్ణోగ్రతకి వైరస్ చనిపోతుంది. కాని ఉప్పునీటిలో వేసి కడుక్కోవడం గానీ, పొటాషియం అయోడైడ్ ద్రావణంతో శుభ్రం చేయడం గానీ మంచిది. దీనికన్నా కూడా వేడినీళ్లలో కడగడం మేలు. అయితే కూరగాయలను ముక్కలుగా కోయకముందే శుభ్రంగా కడగాలి. ముక్కలు కోసి కడగొద్దు. పైగా పండ్లను అలాగే తింటాం కాబట్టి వీటిని ఇలా శుభ్రం చేయడం అవసరం. అయితే అరటి, సంత్రా, దానిమ్మ లాంటి పండ్లను పైన తొక్క తీసి లోపలున్నది తింటాం కాబట్టి వైరస్ అంటుకునే ప్రమాదం ఉండదు. ద్రాక్ష లాంటి వాటిని మాత్రం ఉప్పునీటిలో వేసి శుభ్రపరచడం ద్వారా ఒక కరోనా నివారణకే కాదు, ఇతర సూక్ష్మజీవుల ఇన్‌ఫెక్షన్‌ను కూడా దూరం చేయగలం. పాలప్యాకెట్ ప్లాస్టిక్ కాబట్టి వీటిని సబ్బు నీటితో కడిగితే మంచిదే. ఇకపోతే బయట కూరగాయల్లాంటివి కొనడానికి తీసుకెళ్లే సంచి జనపనార (జూట్)తో చేసిందైతే మేలు. దీన్ని ఇంటి లోపలికి తీసుకురాకుండా బయట ఎండలో రోజంతా ఆరేయాలి. ప్లాస్టిక్ బ్యాగులు తీసుకెళ్లకపోవడమే మంచిది. ఒకవేళ తీసుకెళ్లాల్సి వస్తే మళ్లీ మళ్లీ వాడకపోతే బెటర్. లేకపోతే సోడియం హైపోక్లోరైడ్ (30గ్రా. బ్లీచింగ్ పౌడర్, 10 లీ. నీరు) ద్రావణంతో శుభ్రంచేయాలి. పేపర్ కవర్లయితే కాల్చేయాలి. లోపలికి రాగానే ముందు చేతులు కడుక్కునేవరకు ఏదీ ముట్టుకోకూడదు. ఏ వస్తువును ముట్టుకున్నా చేతులు శుభ్రం చేసుకోకుండా తినొద్దు, తాగొద్దు, ముఖంపై చేతులు పెట్టొద్దు.





**డాక్టర్ ఎం.వి. రావు**
సీనియర్ జనరల్ ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

భారతీయం



## భుజంగాసనం

బోర్లా పడుకొని, రెండు పాదాలను కలిపి ఉంచి కాళ్లను బాగా చాచి ఉంచాలి. కాలి మడమ పైకి ఉండేటట్లు కాలి వేళ్లను నేలకు ఆనించి ఉంచాలి. రెండు చేతులను భుజాల పక్కన నేలకు ఆనించి ఉంచి శ్వాస లోపలికి తీసుకుంటూ తలను సాధ్యమైనంత వరకూ పైకి ఎత్తాలి. అలా పైకి లేచేటప్పుడు నాభి కింద భాగం పైకి లేవకుండా ఉండేటట్లు చూసుకోవాలి. శరీరం బరువంతా కాళ్లు, అరచేతులపై ఉంచుతూ మలద్వారాన్ని, పిరుదులను లోపలికి బిగించాలి. శ్వాస వదులుతూ మళ్లీ యథాస్థితికి రావాలి.

### ప్రయోజనాలు

ఛాతీ భాగంలో రక్త ప్రసరణ బాగా జరిగి ఆరోగ్యంగా ఉంటారు. మలబద్ధకం తొలగుతుంది. కాలేయానికి, మూత్రపిండాలకు, అడ్రినల్ గ్రంథులకు ప్రయోజనకరం. పాంక్రియాస్‌లోని బీటాసెల్ చైతన్యవంతమై రక్తంలో గ్లూకోజ్ అధిక మొత్తంలో చేరడాన్ని నియంత్రిస్తుంది.



ఆక్సిజన్ అందించడం దగ్గరి నుంచి వ్యాధినిరోధక శక్తినివ్వడం దాకా.. రక్తం చేయని పని లేదు. అలాంటి రక్తం సమస్యల్లో పడితే దాని ప్రభావం శరీరంపై అనేక రకాలుగా ఉంటుంది. కొత్తగా రక్తం ఎక్కిస్తే తప్ప బతకలేని పరిస్థితి ఏర్పడుతుంది. అయితే రక్తకణాల వ్యాధుల నుంచి క్యాన్సర్ల దాకా రక్తకణ సంబంధ సమస్యలకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ మంచి పరిష్కారం చూపిస్తోంది. ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్టు రక్తాన్ని పుట్టించే బోన్‌మ్యారో ద్వారానే ఆయా రక్త సంబంధ వ్యాధులకు చికిత్స అందించొచ్చంటున్నారు వైద్యులు.

# మూల కణాలతో రక్తం సేఫ్!

## బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్


**రక్తానికి** సంబంధించిన సమస్యలు రెండు రకాలు. రక్తంలో వచ్చే క్యాన్సర్లు, క్యాన్సర్ కాని వ్యాధులు. ఇవి పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తాయి. రక్తంలోని ఎర్ర రక్తకణాలు హిమోగ్లోబిన్‌ను కలిగివుండి ఆక్సిజన్ సరఫరాలో కీలకమైనవి. తెల్లరక్తకణాలు ఇన్‌ఫెక్షన్లతో పోరాడడానికి, ప్లేట్‌లెట్ కణాలు రక్తం గడ్డ కట్టడానికి ఉపయోగపడుతాయి. ఈ కణాలన్నీ బోన్ మ్యారో లేదా ఎముక మజ్జలో ఉత్పత్తి అవుతాయి. బోన్‌మ్యారోలోని మూల కణాల నుంచి ఇవి ఆయా రకాల కణాలుగా పరిణతి చెందుతాయి. ఏ కణాలకు సంబంధించిన సమస్య ఉంటే ఆ లక్షణాలు కనిపిస్తాయి.

క్యాన్సర్ కాని బ్లడ్ డిజార్డర్లు పుట్టుకతో రావొచ్చు. పుట్టిన తరువాత కొన్నేళ్లకు కూడా రావొచ్చు. పుట్టుకతో వచ్చే వ్యాధులు వంశపారంపర్య కారణాల వల్ల వస్తాయి. థాలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా, హిమోఫిలియా, ఇమ్యునో డెఫీషియన్సీ వ్యాధులు పుట్టుకతో వచ్చేవే.

### ఎర్ర రక్తకణ వ్యాధులు

**థాలసీమియా**

గ్లోబ్యులిన్ జన్యువుల లోపం వల్ల ఎర్ర రక్తకణాల జీవిత కాలం తగ్గిపోయి, 3 నుంచి 5 రోజుల్లోనే అవి చనిపోవచ్చు. అందువల్ల వాళ్లకు జీవితాంతం రక్తం ఎక్కించాల్సి వస్తుంది. హిమోగ్లోబిన్‌ను ఉత్పత్తి చేసే జన్యువులు ఆల్ఫా, బీటా గ్లోబ్యులిన్ జన్యువులని రెండు రకాలుంటాయి. థాలసీమియా మేజర్ (బీటా)లో రెండు జన్యువులూ లోపిస్తాయి. ఏదో ఒక జన్యువు లోపం ఉంటే థాలసీమియా మైనర్ అంటారు. వీళ్లు క్యారియర్లుగా ఉంటారు. మైనర్ ఉన్నవాళ్లలో ఏ సమస్యలు ఉండవు. కాని వాళ్లు క్యారియర్లుగా తరువాతి తరానికి లోపభూయిష్టమైన జన్యువును బదిలీ చేస్తారు. థాలసీమియా మేజర్ ఉన్న వాళ్లకు హిమోగ్లోబిన్ తక్కువగా ఉంటుంది. ఇది 4, 5 కన్నా ఎక్కువ ఉండదు. దాంతో పిల్లల్లో పెరుగుదల కుంటుపడుతుంది. ముఖాకృతిలో తేడా ఉంటుంది. ఎత్తు తక్కువగా ఉంటుంది. లైంగిక లక్షణాలు రావు. ఈ విషయం 6 నెలల నుంచి ఏడాది వయసులోనే తెలిసిపోతుంది. వీళ్లకు రక్తాన్ని నిరంతరం ఎక్కించకపోతే కొన్నేళ్లలోనే చనిపోతారు. అందుకే ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు 6నుంచి 10 వారాల గర్భంతో ఉన్నప్పుడు యాంటి నేటల్ థాలసీమియా స్క్రీనింగ్ చేయించాలి. థాలసీమియా మేజర్ వచ్చే అవకాశం ఉందనుకుంటే గర్భస్రావం చేయించవచ్చు.




**సికిల్ సెల్ ఎనీమియా**

డంబెల్ ఆకారంలో ఉండాల్సిన ఎర్ర రక్తకణాలు కొడవలి (సికిల్ సెల్)ఆకారంలో ఉంటాయి. అందువల్ల ఈ కణాలు రక్తనాళాల్లో రక్తం సజావుగా ప్రసారం కాకుండా బ్లాక్ చేస్తాయి. దాంతో అవయవాలు డ్యామేజి అవుతాయి. ఎర్ర రక్తకణాలు తగ్గిపోయి జాండిస్ వస్తుంది. బీటా గ్లోబ్యులిన్ 6వ జన్యువులో లోపం వల్ల ఇలా జరుగుతుంది.

### తెల్ల రక్తకణాల వ్యాధులు

తెల్ల రక్తకణాలు ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడుతాయి. కాబట్టి వీటిలో తేడా ఉంటే ఇమ్యునిటీ తగ్గిపోతుంది. క్రానిక్ గ్రాన్యులోమేటస్ డిసీజ్, ల్యూకోసైట్ అడినోసిన్ డీఅమైలేజ్ (ఎల్ఎడి) డెఫీషియన్సీ, సివియర్ కంబైన్డ్ ఇమ్యునోడెఫీషియన్సీ డిసీజ్ (ఎస్‌సిఐడి) లాంటి ఇమ్యమునో డెఫీషియన్సీ డిజార్డర్లు తెల్ల రక్తకణ వ్యాధుల కోవలోకి వస్తాయి. వీటికి కారణం జన్యుపరమైనది. కణాల సంఖ్య తగ్గితే ల్యూకోపీనియా అంటారు. ఇన్‌ఫెక్షన్లు, కొన్ని రకాల మందులు, బోన్‌మ్యారో సమస్యలుంటే తెల్ల రక్తకణాల సంఖ్య తగ్గుతుంది. తెల్ల రక్తకణాల సంఖ్య పెరగడం కూడా సమస్యే. క్యాన్సర్లు, ఇన్‌ఫెక్షన్ల వల్ల వీటి సంఖ్య పెరుగుతుంది.


### ప్లేట్‌లెట్ వ్యాధులు

ప్లేట్‌లెట్ కణాలు రక్తస్రావం కాకుండా ఆపుతాయి. ప్లేట్‌లెట్ల సంఖ్య పెరిగినా, తగ్గినా సమస్యే. వంశపారంపర్య కారణాల వల్ల ప్లేట్‌లెట్లు తగ్గిపోతాయి. పుట్టుకతో జన్యుకారణాల వల్ల వీటి సంఖ్య తగ్గితే కంజెనిటల్ థ్రాంబో సైటోపీనియా అంటారు. ఆటోఇమ్యూన్ కారణం వల్ల ఆ తరువాత సమస్య వస్తే ఇమ్యునో థ్రాంబోసైటోపీనియా పర్ప్యురా (ఐటిపి) అంటారు. దీనిలో యాంటీబాడీలు సొంత ప్లేట్‌లెట్ కణాలపై దాడి చేస్తాయి. ఇన్‌ఫెక్షన్లు, కొన్ని మందుల వల్ల కూడా ప్లేట్‌లెట్‌ల సంఖ్య తగ్గుతుంది.

**అన్ని కణాల్లోనూ సమస్య ఉంటే**

బోన్ మ్యారో ఫెయిల్యూర్ అయినప్పుడు అన్ని రక్తకణాలూ ప్రభావితమవుతాయి. దీనివల్ల అప్లాస్టిక్ అనీమియా వస్తుంది. రక్తకణాల ఉత్పత్తి తగ్గిపోతుంది. పిల్లల్లో, పెద్దల్లో కూడా రావొచ్చు. పిల్లల్లో అయితే జన్యుపరమైన కారణం ఉంటుంది. ఫాంకోనిస్ అనీమియా కంజెనిటల్. మేనరికపు పెళ్లిళ్ల వల్ల వస్తుంది. జన్యువుల్లో తేడా వల్ల బోన్‌మ్యారో ఫెయిల్ అవుతుంది. 10 ఏళ్ల లోపు వయసులో కనిపిస్తుంది. కొందరికి 30 ఏళ్లలోకూడా కనిపించొచ్చు. 90 శాతం పిల్లల్లోనే వస్తుంది. అప్లాస్టిక్ అనీమియా ఒక మెడికల్ ఎమర్జెన్సీ. తెల్ల రక్తకణాలు తగ్గడం వల్ల ఇన్‌ఫెక్షన్లు పెరిగి ప్రాణాపాయం సంభవిస్తుంది. ఇమ్యునిటీ లేకపోవడం వల్ల చిన్న సమస్యే పెద్దదవుతుంది. దీనివల్ల శరీరం తెల్లగా పాలిపోతుంది. ఆయాసం, తీవ్రమైన అలసట ఉంటాయి. ప్లేట్‌లెట్‌లు తగ్గడం వల్ల రక్తస్రావం అవుతుంది.

**బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ తరువాత మూల కణాల నుంచి రక్తకణాల తయారీ**




**బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ (బిఎంటి)**

లోపం ఉన్న బోన్ మ్యారో నుంచి కణాల ఉత్పత్తిలో తేడాలు వస్తాయి. బిఎంటి చేసేటప్పుడు ముందు హై డోస్ కీమోథెరపీ ద్వారా బోన్‌మ్యారోని డ్యామేజి చేస్తారు. తరువాత స్టెమ్ సెల్స్ ఎక్కిస్తారు. ఇవి ఆరోగ్యకరమైన రక్తాన్ని తయారుచేస్తాయి. ఈ రక్తం రెండు మూడు వారాల్లో తయారవుతుంది. ఈ ప్రక్రియ కోసం ఐసియులో పెట్టి, మానిటర్ చేయాల్సి ఉంటుంది. రక్తం ఎక్కించినట్టుగానే మూలకణాలను ఇస్తారు.

ఆటోలోగస్ బిఎంటి – పేషెంట్ బోన్ మ్యారోనే వాడుతారు. ఇది మైలోమా, లింఫోమాలకు ఉపయోగకరం. మూలకణాలను సేకరించి వాటిని ఫ్రీజ్ చేస్తారు. తరువాత హై డోస్ కీమోథెరపి ఇచ్చి, అప్పటివరకు ఫ్రీజ్ చేసి వుంచిన మూలకణాలను ఎక్కిస్తారు.

అలోలోగస్ బిఎంటి – డోనర్ నుంచి మూలకణాలను తీసుకుంటారు. ఫుల్ మ్యాచ్ లేదా హాఫ్ మ్యాచ్ లేదా ఇంటర్నేషనల్ డోనర్ నుంచి తీసుకుని ఎక్కిస్తారు. దీని వల్ల సమస్య మళ్లీ రాకుండా ఉంటుంది. అయితే గ్రాఫ్ట్ వర్సెస్ హోస్ట్ డిసీజ్ వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ఇమ్యునో సప్రెసెంట్స్ ఇస్తారు.


**బిఎంటి తరువాత..**

- ఇన్‌ఫెక్షన్లు రాకుండా జాగ్రత్తపడాలి. ఇమ్యునిటీ నార్మల్‌కి రావడానికి ఒకట్రెండు సంవత్సరాలు పడుతుంది.
- వేడి వేడి ఆహారం తీసుకోవాలి.
- బాయిల్ చేసిన నీళ్లే తాగాలి.
- లైంగిక కలయిక వద్దు
- డాక్టర్ ఫాలోఅప్‌కి వెళ్లాలి.
- గ్రాఫ్ట్ వర్సెస్ హోస్ట్ లక్షణాలు చూసుకోవాలి.
- సైడ్ ఎఫెక్టులను మానిటర్ చేసుకోవాలి.
- మొదట వారానికి ఒకసారి 3 నెలల పాటు, తర్వాత నెలకోసారి మూడు నెలల పాటు, ఆ తరువాత మూడేళ్లకోసారి ఫాలోఅప్‌కి వెళ్లాలి.

### రక్తంలో క్యాన్సర్

బ్లడ్ క్యాన్సర్లు మూడు రకాలు. ల్యుకేమియా, లింఫోమా, మైలోమా. మొదటి రెండు పిల్లలు, పెద్దలకు వస్తే, మైలోమా పెద్దవాళ్లలోనే ఎక్కువగా కనిపిస్తుంది.

ల్యుకేమియా రెండు రకాలు. అక్యూట్ లింఫోబ్లాస్టిక్ ల్యుకేమియా (ఎఎల్ఎల్) 10 ఏళ్లలోపు వాళ్లకు కామన్. కీమో వల్ల 90 శాతం , ఆ తరువాత 10 శాతం బిఎంటి వల్ల తగ్గుతుంది. ఎఎల్ఎల్ ఉన్నప్పుడు లింఫ్ గ్రంథులన్నీ వాచిపోతాయి. ఎముకల నొప్పులు, అలసట, హిమోగ్లోబిన్ తగ్గడం, బరువు తగ్గడం, చెమట, జ్వరం ఉంటాయి. అక్యూట్ మైలాయిడ్ ల్యుకేమియా (ఎఎంఎల్) ఉన్నవాళ్లలో 70 శాతం పిల్లలకు బిఎంటి అవసరం. కీమో వల్ల 30 శాతం తగ్గితే, 70 శాతం బిఎంటి వల్ల తగ్గుతుంది. ఎఎంఎల్ ఉన్నప్పుడు బోన్‌మ్యారో ఫెయిల్ అవుతుంది. దీనివల్ల ఇన్‌ఫెక్షన్లు, రక్తస్రావం, రక్తహీనత ఉంటాయి. హిమోగ్లోబిన్‌తో పాటు, తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్లు తగ్గుతాయి. అసాధారణ ల్యూకోసైట్లు పెరుగుతాయి.



మైలోమా పెద్ద వయసువాళ్లలో ఎక్కువ. ప్లాస్మా కణాల్లో వచ్చే వ్యాధి. దీనివల్ల ఎముకలు డ్యామేజీ అవుతాయి. బోన్‌మ్యారోలో రక్తం తగ్గుతుంది. ప్లాస్మా కణాలు కిడ్నీలో ఉండే ప్రొటీన్‌ను పెంచుతాయి. అందువల్ల కిడ్నీ ఫెయిల్యూర్‌కి దారితీస్తుంది. దీనికి ఇంతకుముందు రక్తం ఎక్కించేవాళ్లు. ఇప్పుడు కీమో చేస్తున్నారు.

**ప్లాస్మా సంబంధ సమస్యలు**

ప్లాస్మాలో రక్తస్రావాన్ని తగ్గించే క్లాటింగ్ ఫ్యాక్టర్లు, ఇన్‌ఫెక్షన్లతో పోరాడే ప్రొటీన్లు, ఇమ్యునోగ్లోబ్యులిన్‌లు ఉంటాయి. బి–లింఫోసైట్స్ ఇమ్యునోగ్లోబ్యులిన్లను తయారుచేస్తాయి. సమస్య ఉన్నప్పుడు ఇవి తక్కువగా తయారవుతాయి. రక్తంలో క్లాటింగ్ ఫ్యాక్టర్లు తగ్గడం వల్ల చిన్న డ్యామేజ్ ఉండొచ్చు. కాని ఈ చిన్న చిన్న దెబ్బలే పెద్దవై రక్తస్రావం అవుతుంది. ప్లాస్మా సంబంధ క్లాటింగ్ ఫ్యాక్టర్లు లోపించడం వల్ల వచ్చే వ్యాధి హిమోఫిలియా. దీనికి జన్యుపరమైన కారణాలుంటాయి. సాధారణంగా హిమోఫిలియా ఎక్స్ – లింక్‌డ్ వ్యాధి. అంటే ఎక్స్ క్రోమోజోమ్‌లో లోపభూయిష్ట జన్యువు ఉంటుంది. తల్లి నుంచి కొడుక్కి వస్తుంది. కూతుళ్లు క్యారియర్లుగా ఉంటారు. ఫ్యాక్టర్ 8 లోపం వల్ల హిమోఫిలియా ఎ, ఫ్యాక్టర్ 9 లోపం వల్ల హిమోఫిలియా బి వస్తాయి. 90 శాతం మందిలో ఫ్యాక్టర్ 8 లోపమే ఉంటుంది.

**లక్షణాలు**

జాయింట్లలో, మెదడులో రక్తస్రావం అవుతుంది. ప్లాస్మాలో క్లాటింగ్ ఫ్యాక్టర్లు తగ్గితే కలిగే రక్తస్రావం అంతర్గతంగా ఉంటుంది. ప్లేట్‌లెట్లు తగ్గడం వల్ల రక్తస్రావం అయితే అది చర్మం అంటే ఉపరితల రక్తస్రావం మాత్రమే ఉంటుంది. కండరంలో, కడుపులో, ఛాతిలో, రక్తనాళాల్లో రక్తస్రావం కావొచ్చు. మొదట రక్తస్రావాన్ని ఆపేవి ప్లేట్‌లెట్లు. వీటి ఉపరితలం మీద ఫైబ్రినోజెన్ ఉంటుంది. దీనిమీద కోయాగ్యులెంట్ ఫ్యాక్టర్లు పనిచేస్తాయి. మొదట ప్లేట్‌లెట్ల వల్ల క్లాట్ ఏర్పడి, దాని మీద ఫైబ్రినోజెన్ ఏర్పడుతుంది. కాని ఈ గడ్డ సున్నితంగా ఉంటుంది. దీని మీద క్లాటింగ్ ఫ్యాక్టర్లు సెకండరీ క్లాట్‌ను ఏర్పరుస్తాయి. ఇది గట్టిగా ఉంటుంది.

### బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ కథలు..

- మూడేళ్ల పాపకు సికిల్ సెల్ అనీమియా. తన 8 నెలల చెల్లి నుంచి బోన్ మ్యారో తీసుకుని ట్రాన్స్ ప్లాంట్ చేశారు.
- అప్లాస్టిక్ అనీమియాతో బాధపడుతున్న 2 ఏళ్ల పాపకు 9 నెలల వయసున్న తమ్ముడి దగ్గరి నుంచి బోన్ మ్యారో తీసి ట్రాన్స్ ప్లాంట్ చేశారు.
- 6, 12 ఏళ్ల వయసున్న ఇద్దరు అన్నదమ్ములు. ఇద్దరికీ ఊపిరితిత్తులు, గొంతులో ఇన్‌ఫెక్షన్. పరీక్ష చేస్తే ప్లేట్‌లెట్లు తగ్గాయని తేలింది. ఐటిపి అనే ప్లేట్‌లెట్ వ్యాధి అనుకుని స్టిరాయిడ్, ఇమ్యునోసప్రెసెంట్స్ ఇచ్చారు. దాంతో ఇమ్యూనిటీ తగ్గి సమస్య పెద్దదైంది. చివరికి జన్యుపరీక్షలో ఇమ్యునోడెఫీషియన్సీ వ్యాధి అయిన విస్కాట్ ఆల్‌డ్రిచ్ సిండ్రోమ్ అని తేలింది. దాంతో ఇంటర్నేషనల్ డోనర్ నుంచి బోన్ మ్యారో తీసుకుని ఇద్దరికీ ట్రాన్స్ ప్లాంట్ చేశారు. డోనర్ ఒక్కరే. తీసుకున్న రిసీపియెంట్స్ మాత్రం ఇద్దరు. వీళ్ల చికిత్స కోసం తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహాయం కూడా అందించింది.
- 8 ఏళ్ల పాపకు జ్వరం, దగ్గు ఉండేవి. అప్లాస్టిక్ అనీమియా అని తెలిసి తరచుగా రక్తం ఎక్కించేవాళ్లు. తరచుగా ఇన్‌ఫెక్షన్ రావడం, హిమోగ్లోబిన్ తగ్గడం, రక్తస్రావం కావడం, నీరసం, ఆయాసంతో బాధపడేది. చివరికి మల్టీ డ్రగ్ రెసిస్టెన్స్ వల్ల సెప్సిస్ అయింది. ఏ యాంటి బయాటిక్ కూడా పనిచేయక, అత్యవసర పరిస్థితి ఏర్పడింది. తండ్రి దగ్గరి నుంచి బోన్ మ్యారో తీసుకుని హాఫ్ మ్యాచ్ బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. 11 ఏళ్ల ఆ పాప ఇప్పుడు నార్మల్ గా ఉంది.



### బిఎంటి – అపోహలు

- కిడ్నీ, లివర్ లాగా బోన్ మ్యారో అంటే ఎముక తీసుకుంటారని భయపడుతారు. కాని కేవలం మూలకణాలను రక్తం నుంచి తీసుకుంటారు. మిగిలిన కణాలు తిరిగి డోనర్‌కే వెళ్లిపోతాయి. మెషిన్ కేవలం మూలకణాలను మాత్రమే సేకరిస్తుంది. ఈ మూల కణాలు కూడా కొన్ని రోజుల్లోనే వాళ్లలో మళ్లీ తయారైపోతాయి. ఎటువంటి ఇబ్బందులూ రావు. ఇచ్చిన వాళ్లు నార్మల్‌గానే ఉంటారు.
- బిఎంటికి రక్తం గ్రూప్ మ్యాచ్ కావాలనుకుంటారు. కాని అవసరం లేదు. హెచ్ఎల్ఎ జన్యువు మ్యాచ్ కావాలి. కనీసం హాఫ్ మ్యాచ్ కావాలి. నిజానికి ఫుల్ మ్యాచ్ కన్నా మనవాళ్లకు హాఫ్ మ్యాచ్ బెస్ట్. పైగా హాఫ్ మ్యాచ్ దొరకడం సులువు. రెండింటి ఖర్చు కూడా ఒకటే.
- బిఎంటి సర్జరీ కాదు. మూలకణాలను ఎక్కడి నుంచి ఎక్కించినా బోన్‌మ్యారోకే వెళ్తాయి. ఎముక కోసి, దానిలోపలికి పంపిస్తారని అనుకోవద్దు. రక్తం ఎక్కించినట్టుగా మూలకణాలను కూడా ఎక్కిస్తారు. ట్రాన్స్‌ఫ్యూజ్ చేశాక అవి బోన్‌మ్యారోకు వెళ్తాయి.
- జబ్బుతో ఎలాగూ ఎక్కువ రోజులు బతకరు. అలాంటప్పుడు బిఎంటి లాంటి ఖరీదైన చికిత్సలెందుకు అనుకుంటారు. కానీ బ్లడ్ క్యాన్సర్లు, ఇతర బ్లడ్ వ్యాధులకు ఇది మాత్రమే చికిత్స. దీని సక్సెస్ రేటు 90 నుంచి 95 శాతానికి పైగా ఉంది.

**డాక్టర్ గణేశ్ జైషట్వార్**
సీనియర్ హెమటో ఆంకాలజిస్ట్,
బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ నిపుణులు
యశోద హాస్పిటల్స్, హైదరాబాద్
8121022333







**నేను రేపు విహార యాత్రకు వెళ్తున్నాను**


Tomorrow i'm going to an excursion
టుమారో అయామ్ గోయింగ్ టు ఆన్ ఎక్స్‌కర్షన్

**నేను బాధపడుతున్నాను -**

Iam suffering from fever
అయామ్ సఫరింగ్ ఫ్రమ్ ఫీవర్



### చుక్కలు కలుపండి




### పద్యం

*తన కోపమె తన శత్రువు*
*తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ*
*తన సంతోషమె సర్వము*
*తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!*

**భావం :** తన కోపమే తనకు హాని చేసే శత్రువు. తనలో ఉన్న శాంతగుణమే తనకు రక్షగా ఉంటుంది. ఇతరుల దుఃఖాన్ని పోగొట్టడానికి తాను చేసే పనే తనకు బంధువు, చుట్టం. తన సంతృప్తే స్వర్గం.తనలోని దుఃఖమే నరకం అని విజ్ఞులు చెబుతారు.



### దారి కనుక్కోండి






**టీచర్ :** ఏరా చింటూ.. హిమాలయాలు ఎక్కడున్నాయిరా?
**చింటు :** నాకు తెలియదు సార్!
**టీచర్ :** ఏదీ ఆ బెంచ్ ఎక్కి నిలబడు.
**చింటు :** బెంచ్ ఎక్కి నిలుచొని చూసినా కనిపించడం లేదు సార్!!

* * *

**తల్లి :** ఏంట్రా.. ఈ పూట రెండుసార్లు బ్రష్ చేస్తున్నావు?
**కొడుకు :** ఏం లేదు మమ్మీ.. ఈరోజు ఊరెళ్తున్నాం కదా! 'నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందని' మా టీచర్ చెప్పింది. అందుకనే!!

నమస్తే తెలంగాణ
కరీంనగర్, మంగళవారం 31 మార్చి 2020
www.ntnews.com





## విరాళాల వెల్లువ..

కరోనాపై యుద్ధం చేస్తున్న రాష్ట్ర సర్కారుకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు దాతలు ముందుకొస్తున్నారు. సీఎం సహాయ నిధికి విరాళాలు అందిస్తూ చేయూతనిస్తున్నారు.



కలెక్టర్‌కు రూ. లక్ష చెక్కు అందిస్తున్న డాక్టర్ నరేశ్, డాక్టర్ శ్రీదేవి

### వైద్యులు ఎనమల్ల దంపతులు ₹లక్ష..

**కరీంనగర్ హెల్త్ :** కరీంనగర్‌లోని రోహన్ హాస్పిటల్ అండ్ ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ ఎనమల్ల నరేశ్, డాక్టర్ ఎనమల్ల శ్రీదేవి దంపతులు కలెక్టర్ రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష విరాళంగా అందించారు. పోలీసు వెల్ఫేర్ ఫండ్ కోసం ₹25 వేల చెక్కును కమిషనర్ కమలాసన్ రెడ్డికి అందించారు. కరీంనగర్‌లోని టూర్స్ అండ్ ట్రావెల్స్ గంప రమేశ్ సీఎం సహాయనిధికి ₹లక్ష చెక్కును కలెక్టర్‌కు శశాంకకు అందజేశారు. 'శాన్వి' దవాఖాన వైద్యులు హరిత, రాంప్రసాద్ ₹50 వేల చెక్కును సీపీ కమలాసన్‌రెడ్డికి అందజేశారు.

### కవయిత్రి కందేపి దంపతుల ఔదార్యం



రూ.లక్ష చెక్కును కలెక్టర్‌కు అందిస్తున్న డా.కందేపి దంపతులు

**సిరిసిల్ల కలెక్టరేట్:** సిరిసిల్ల పట్టణానికి చెందిన ప్రముఖ పిల్లల వైద్యుల నిపుణుడు డాక్టర్ కందేపి ప్రసాదరావు, ఆయన సతీమణి, కవయిత్రి రాణిప్రసాద్ తమ ఔదార్యం చాటుకున్నారు. సీఎం సహాయ నిధికి ₹లక్ష విరాళాన్ని ప్రకటించారు. సంబంధిత చెక్కును కలెక్టర్ కృష్ణభాస్కర్‌కు వారు సోమవారం అందజేశారు. అదేవిధంగా సిరిసిల్లకు చెందిన కత్తెర వరుణ్‌కుమార్ ₹10 వేల చెక్కును స్నేహితుడు మహ్మద్‌మునీర్‌తో కలిసి కలెక్టర్‌కు అందజేశారు.

### చిన్నారుల ఆర్థిక సాయం



పెగడపల్లి : మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు నగదు అందిస్తున్న చిన్నారులు

**పెగడపల్లి/గొల్లపల్లి :** పెగడపల్లి మండలం ఎల్లాపూర్‌కు చెందిన అన్నదమ్ములు మోదుంపల్లి గౌతమ్, సిద్ధార్థ తమవంతుగా ఆర్థిక సాయం అందించారు. సైకిల్ కొనుక్కునేందుకు ఏడాదినుంచి తాము కిడ్డీ బ్యాంకులో దాచుకున్న ₹2500 సోమవారం పెగడపల్లికి వచ్చిన మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు అందించారు. పెగడపల్లి జడ్పీటీసీ రాజేందర్‌రావు ₹16 వేల చెక్కును మంత్రికి అందజేశారు. నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ కోసం గొల్లపల్లి వైస్ ఎంపీపీ ఆవుల సత్తయ్య ₹5వేలు తాసిల్దార్ నవీన్ కుమార్‌కు అందజేశారు.

# వలస కూలీలకు బాసట

- ప్రభుత్వం తరపున నిత్యావసర సరుకులు, నగదు
- ఒక్కొక్కరికి 12కిలోల చొప్పన బియ్యం, ₹500 మొత్తం
- అందజేసిన ఉమ్మడి జిల్లాల అధికారులు, ఎమ్మెల్యేలు



రామడుగు : వెలిచాలలో వలస కార్మికులకు నగదు, బియ్యం అందిస్తున్న ఎమ్మెల్యే సుంకె



జగిత్యాల : కూలీలకు బియ్యం, డబ్బులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రవి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

**తిమ్మాపూర్/కార్పొరేషన్ నమస్తే తెలంగాణ/ రామడుగు/ గంగాధర/ కరీంనగర్‌రూరల్/ మానకొండూర్‌రూరల్ :** లాక్‌డౌన్‌తో దిక్కుతోచని స్థితిలో పడిపోయిన వలసకూలీలకు ప్రభుత్వం అండగా ఉంటున్నది. సర్కారు తరపున వారికి నిత్యావసర సరుకులను అందిస్తూ బాసటగా నిలుస్తున్నది. ఒక్కొక్కరికి 12 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయడంతోపాటు ₹500ల నగదును అందజేసి చేయూతనిస్తున్నది. ఈ మేరకు అందిన ఆదేశాలతో సోమవారం సాయంత్రం తర్వాత ఉమ్మడి జిల్లా పరిధిలోని అధికారులు, ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. కరీంనగరంలోని కోతిరాంపూర్‌లో కార్మికులకు మేయర్ సునీల్‌రావు, కమిషనర్ క్రాంతితో కలిసి కలెక్టర్ శశాంక బియ్యం, నగదు అందించారు. రామడుగు మండలం వెలిచాలలో 48 మంది వలస కార్మికులకు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎంపీపీ కలిగేటి కవిత, విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. గంగాధర మండలం కురిక్యాలలో ఐదుగురు, కరీంనగర్ శివారులోని సదాశివపల్లిలోని 14 మంది ఒడిశా కూలీలకు అందజేశారు. తిమ్మాపూర్ మండలం ఇందిరానగర్ కాలనీలో 15 మందికి కరీంనగర్ ఆర్డీవో ఆనంద్‌కుమార్, తాసిల్దార్ రాజేశ్వరి, మానకొండూర్ మండలం సదాశివపల్లిలో 14 మంది ఒడిశా వలస కూలీలకు సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, కరీంనగర్ మండలం మొగ్దుంపూర్, బొమ్మకల్‌లోని 'టీవీ' ఫంక్షన్ హాల్‌లో 9 మందికి తాసిల్దార్ గడ్డం సుధాకర్, కొత్తపల్లి పట్టణంలో 28 మందికి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, తాసిల్దార్ సురేశ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు బండ రాధ అందజేశారు.

### వసతి సౌకర్యం..

కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో గత కొంతకాలంగా బొమ్మలు చేసుకుని జీవిస్తున్న 24 మంది వలస కార్మికులకు తిమ్మాపూర్ తాసిల్దార్ బండి రాజేశ్వరి అల్గునూర్ శివారులోని 'స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'లో వసతి ఏర్పాట్లు చేశారు. స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో 14 రోజుల పాటు వీరికి వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నారు. హైదరాబాద్ నుంచి కాలినడకన వివిధ రాష్ట్రాలకు వెళ్తున్న 32 మంది వలస కార్మికులను కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, ట్రైనీ ఐపీఎస్ నితికా పంత్ అల్గునూర్ శివారులోని లక్ష్మీనర్సింహ గార్డెన్‌కు తరలించారు. అనంతరం వీరికి టిఫిన్, భోజన వసతి కల్పించారు. మహారాష్ట్రకు పరిశోధన కోసం వెళ్లిన హైదరాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన అగ్రికల్చర్ విద్యార్థులు తిరుగు ప్రయాణంలో కరీంనగర్ జిల్లాలోనే ఆగిపోయారు. వీరందరికీ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కొండ సత్యలక్ష్మి గార్డెన్‌లో ఏర్పాట్లు చేశారు.



వేములవాడ : వలస కార్మికులకు సరుకులను అందజేస్తున్న రాజన్న సిరిసిల్ల ఎస్పీ రాహుల్ హెగ్డే




వేములవాడ రూరల్: చెక్కపల్లిలో వలసకూలీలకు బియ్యం, డబ్బులను అందజేస్తున్న తాసీల్దార్ మునీందర్

**జగిత్యాల, నమస్తే తెలంగాణ / కోరుట్లటౌన్/మల్యాల/కొడిమ్యాల/మల్లాపూర్ /సారంగాపూర్ :** జిల్లాలో 9200 మంది వలస కార్మికులు ఉన్నారు. జగిత్యాల రూరల్ మండల పరిధిలోని చల్‌గల్ సమీపంలో 93 మంది, అర్బన్ మండలంలో 40 మంది వలస కార్మికులకు బియ్యం, నగదును కలెక్టర్ జీ రవి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సోమవారం అందజేశారు. వారి వెంట జడ్పీ అధ్యక్షురాలు వసంత, మున్సిపల్ అధ్యక్షురాలు శ్రావణి, అదనపు కలెక్టర్ రాజేశం, మున్సిపల్ కమిషనర్ జయంత్‌కుమార్, టౌన్ సీఐ జయేశ్‌రెడ్డి, ఎంపీపీ గంగారాం ఉన్నారు. కోరుట్ల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బీహార్‌కు చెందిన కూలీలకు ₹5వేలు, 50కిలోల బియ్యాన్ని కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అందజేశారు. శివరామకృష్ణ, శ్రీసాయి రైస్ మిల్ నిర్వాహకులు రాందాస్, పడిగెల శ్రీనివాస్ సైతం ₹10 వేలను ఎమ్మెల్యేకు అందజేశారు. జగిత్యాల మండలం చల్‌గల్ వ్యవసాయ మార్కెట్‌లో షెడ్ల కింద నివాసముంటూ జిల్లా కేంద్రంలో కూలి పనులు చేసుకుంటున్న 25 మంది అమరావతి, మహారాష్ట్రవాసులు కలెక్టరేట్‌కు రాగా, ఏవో వెంకటేశ్ టౌన్‌హాల్‌లో భోజనం పెట్టించి నిత్యావసరాలు అందించి పంపించారు. కొడిమ్యాలలో రాజస్థాన్ కూలీలకు ఎంపీటీసీ సభ్యులు సామల్ల లక్ష్మణ్, చెన్న దేవేందర్ నిత్యావసర సరుకులు, నగదు అందించారు. మల్యాల మండలం కొండగట్టులో యాచకులకు ఒక్కొక్కరికి 12కిలోల బియ్యం, ₹500 చొప్పున తాసిల్దార్ లక్ష్మారెడ్డి, సర్పంచ్ బద్దం తిరుపతి రెడ్డి పంపిణీ చేశారు. గ్రానైట్ క్వారీలు, పంప్‌హౌస్‌లు, క్రషర్లలో పనిచేసే కూలీలకు మంగళవారం అందిస్తామన్నారు. మల్లాపూర్‌లో 50మంది వలస కూలీలకు డీపీవో శేఖర్ బియ్యం, నగదును పంపిణీ చేశారు. బీర్‌పూర్‌లో ఏడుగురు ఆంధ్రా వలస కూలీలకు తాసిల్దార్ నాగార్జున, సారంగాపూర్ మండలంలో 95 మందికి బియ్యం, నగదు తాసిల్దార్ శ్రీనివాస్ అందజేశారు.

**వేములవాడ, నమస్తే తెలంగాణ/వేములవాడ రూరల్ / వీర్నపల్లి/ ముస్తాబాద్/ కలెక్టరేట్/ రుద్రంగి / చందుర్తి:** వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర కార్మికులకు పట్టణ సీఐ శ్రీధర్‌తో కలిసి ఎస్పీ రాహుల్ హెగ్డే ఆహార వస్తువులను అందజేశారు. వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి, నూకలమర్రి, వీర్నపల్లి మండలంలోని మూడు వలస కార్మిక కుటుంబాలకు, సిరిసిల్ల పట్టణ పరిధిలోని బీవైనగర్‌లోని వలస కుటుంబాలకు మున్సిపల్ అధ్యక్షురాలు జిందం కళ, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రుద్రంగి మండలంలోని మొత్తం 318 మంది వలస కార్మికులకు నగదును, నిత్యాసరుకులను జడ్పీటీసీ గట్ల మీనయ్య ఆధ్వర్యంలో అధికారులు అందజేశారు. చందుర్తి మండలం మూడపల్లిలోని తమిళనాడు కూలీలకు తాసిల్దార్ నరేశ్, ఎస్ఐ సునీల్ రేషన్ సరుకులు, నగదును అందజేశారు.

**పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** పెద్దపల్లి జిల్లాలో వివిధ రకాల పనులు చేస్తున్న 21,047 మంది వలస కార్మికులకు ప్రజా ప్రతినిధులు అండగా నిలుస్తున్నారు. మంథని, పెద్దపల్లి మున్సిపాల్టీల పరిధిలోని ఇటుక బట్టీలలో పనిచేస్తున్న కార్మికులకు జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మంథని, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్లు పుట్ట శైలజ, మమతారెడ్డి ఆధ్వర్యంలో సాయం అందించారు.

# వెల్లివిరిసిన సేవాభావం



కరీంనగర్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న రోటరీ క్లబ్ బాధ్యులు



మేడిపల్లి : దమ్మన్నపేటలో నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

**కార్పొరేషన్/ చొప్పదండి/ తిమ్మాపూర్ నమస్తేతెలంగాణ/ కరీంనగర్‌హెల్త్/ గంగాధర/ హుజూరాబాద్ రూరల్ / టౌన్/ వీణవంక/ శంకరపట్నం :** సేవాభావం వెల్లివిరుస్తున్నది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అనాథలు, నిరాశ్రయులకు సన్నత్ సోషల్ సర్వీస్, ఎస్ఆర్ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు భోజనం, మజ్జిగ, మాస్కులు పంపిణీ చేశారు. విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది, పోలీసులకు మజ్జిగ, మాస్కులు అందజేశారు. కరీంనగర్ రోటరీ క్లబ్ బాధ్యులు ఎర్రం రాజారెడ్డి, వేణుగోపా ల్, తదితరులు పోలీసులు, నిర్మాణ కూలీలకు ఓఆర్ఎస్, చల్ల ప్యాకెట్లు పంపిణీ చేశారు. అల్గునూరుకు చెందిన శ్రీ ఈవెంట్ ఆర్గనైజర్ డీ అజయ్‌కుమార్ నిరుపేదలకు ఆహార ప్యాకెట్లను అందజేశారు. కరీంనగర్‌లోని హీరా ఫౌండేషన్ కరీంనగర్ మేనేజింగ్ ట్రస్టీ ముఫ్తి మహ్మద్ ఘియాస్ మొహినొద్దీన్ ఆధ్వర్యంలో 300 నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి విలువ చేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సహాయం అవసరమైన వారు 9346355306 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. నగరంలోని 13వ డివిజన్‌లో పారిశుధ్య కార్మికులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ పంపిణీ చేశారు. చొప్పదండి పట్టణంలోని 10 నిరుపేద కుటుంబాలకు బీజేపీ మండలాధ్యక్షుడు చేపూరి సత్యనారాయణగౌడ్ సరుకులు పంపిణీ చేశారు. 6వ వార్డు కౌన్సిలర్ వడ్లూరి గంగరాజు బీహార్ కూలీలకు 15 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గంగాధర మండలంలోని కురిక్యాలలో కొత్త జయపాల్‌రెడ్డి మిత్రమండలి సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఇంటింటికీ వెళ్లి కూరగాయలు పంపిణీ చేశారు. గర్శకుర్తికి చెందిన కముటం తిరుపతి 500, చెర్లపల్లి(ఆర్) గ్రామానికి చెందిన పుల్కం కిరణ్ 250 మాస్కులను పంపిణీ చేశారు. గర్శకుర్తికి చెందిన అలువాల అన్నపూర్ణ భీమేశ్వర్ రూ.5 వేల సాయం చేశారు. హుజూరాబాద్ మండలం చెల్పూర్‌లో సర్పంచ్ నేరెళ్ల మహేందర్ ఆధ్వర్యంలో ఏసీపీ శ్రీనివాస్‌రావు, టౌన్ సీఐ మాధవి ఇంటికి రెండు చొప్పున 2,500 మాస్కులను పంపిణీ చేశారు. కందుగులలో పలు నిరుపేదల కుటుంబాలకు బీజేపీ సీనియర్ నాయకుడు కేసిరెడ్డి విజేందర్‌రెడ్డి 15 రోజులకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వీణవంక మండలం వల్భాపూర్‌లో ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 200 మందికి మాస్కులు అందజేశారు. శంకరపట్నంలో ఓ బీహార్ కార్మిక కుటుంబానికి బీజేపీ మండల అధ్యక్షుడు చల్ల ఐలయ్య, నాయకులు 15 రోజులకు సరిపడా సరుకులు సమకూర్చారు.

**జగిత్యాల/ధర్మపురి, నమస్తే తెలంగాణ/ కోరుట్ల/ కోరుట్లటౌన్/ ఇబ్రహీంపట్నం/ మేడిపల్లి/ కొడిమ్యాల/ రాయికల్ రూరల్:** జిల్లా కేంద్రానికి చెందిన తుమ్మనపల్లి రఘు, సంకోజి వెంకటరమణ కలిసి పట్టణంలో సుమారు 50మంది యాచకులకు సోమవారం భోజన ప్యాకెట్లను పంపిణీ చేశాడు. ధర్మపురి పట్టణానికి చెందిన గోలి శ్రీనివాస్ రోజూ 30 నుంచి 40 మాస్కులు కుడుతూ మార్కెట్, తదితర ప్రాంతాల్లో ఉచితంగా అందించాడు. కోరుట్ల మండలం సంగెంకు చెందిన నల్ల రాజు సూరత్‌లో ఉద్యోగం చేస్తుండగా అతడి యజమాని మనీష్ సాయంతో 25 మంది పేదలకు నిత్యావసర వస్తువులను అందజేశాడు. ఇబ్రహీంపట్నం మండలం డబ్బాలో సర్పంచ్ లింగంపల్లి గంగాధర్ ₹10వేలు వెచ్చించి అందరికీ మాస్కులు పంపిణీ చేశాడు. మేడిపల్లి మండలంలోని దమ్మన్నపేటలో రాజస్థాన్ నుంచి వచ్చిన కూలీలకు నిత్యావసరాలను ఎంపీపీ దోనకంటి ఉమాదేవి, సర్పంచ్ కాచర్ల సురేశ్ పంపిణీ చేశారు. మోత్కురావుపేటలో ఇంటింటికి సర్పంచ్ దుంపేట లక్ష్మీ నర్సయ్య, కట్లకుంట 7వ వార్డులో వార్డు సభ్యురాలు మ్యాకల లావణ్య కూరగాయ లు అందించారు. కోరుట్లలోని షిర్డీ సాయిబాబా భక్త సమాజం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 500 మంది నిరుపేదలకు ఉచితంగా అన్నదానం చేస్తున్నారు. రాయికల్ మున్సిపాలిటీలోని 9వ వార్డులో కౌన్సిలర్ సువర్ణ సత్యనారాయణ దంపతులు 30 మంది ఒంటరి మహిళలకు సోమవారం 10 కిలోల చొప్పున బియ్యం, ₹500 చొప్పున నగదు అందించారు.



సిరిసిల్ల టౌన్ : నిత్యావసర సరుకులు అందజేస్తున్న మున్సిపల్ అధ్యక్షురాలు జిందం కళ

**వేములవాడ, నమస్తేతెలంగాణ/ సిరిసిల్ల టౌన్/ వేములవాడ రూరల్ /ఎల్లారెడ్డిపేట/ సిరిసిల్ల రూరల్ / బోయినపల్లి/ ముస్తాబాద్:** వేములవాడ మండలం మల్లారంలో వలస కూలీలకు ఎస్ఐ సౌమ్యరెడ్డి, లింగంపల్లిలో సర్పంచ్ సామ కవిత నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఎల్లారెడ్డిపేటలో 40మంది వలస కూలీలు, నిరుపేదలకు రెండుపూటలా భోజనం పెట్టాలని జీపీ నిర్ణయించగా కార్యక్రమాన్ని సర్పంచ్ వెంకట్‌రెడ్డి, టీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి తోట ఆగయ్య ప్రారంభించారు. గొల్లపల్లిలో ఉపసర్పంచ్ దేవయ్య 35 నిరుపేద కుటుంబాలకు, ఎస్ఐ వెంకటకృష్ణ వలసకూలీల కు, దుమాలలో బాల్యమిత్ర ఫౌండేషన్ సభ్యులు మహారాష్ట్ర వలసకూలీలకు నిత్యావసర సరుకులను అందజేశారు. సిరిసిల్లలో మున్సిపల్ కౌన్సిలర్ ఆకునూరి విజయలక్ష్మి, సిరిసిల్ల ప్రోగ్రెసివ్ వెల్ఫేర్ అసోసియేషన్, టీఆర్ఎస్ యూత్ కమిటీ సహకారంతో నిత్యావసరాలను మున్సిపల్ అధ్యక్షురాలు కళ నిరుపేదలకు పంపిణీ చేశారు. సుభాష్‌నగర్‌లో టీఆర్ఎస్ నేత సామల శ్రీనివాస్ సహకారంతో నిత్యావసర సరుకులను డీఎస్పీ చంద్రశేఖర్ స్థానికులకు పంపిణీచేశారు. ఒడిశాకు చెందిన కార్మికులకు పెద్దబజార్‌కు చెందిన పుల్లూరి బ్రదర్స్ నిత్యావసర సరుకులను అందజేశారు. బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లిలోని 12 మందికి డీటీ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిత్యావసరాలను అందజేశారు.

### మంత్రి కొప్పుల ఆర్థిక సాయం

**గొల్లపల్లి :** గొల్లపల్లి పంచాయతీ పారిశుధ్య కార్మికుడు నలువాల లక్ష్మణ్ గుండెపోటుతో చనిపోగా, అతడి కుటుంబానికి రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ అండగా నిలిచారు. ఈ మేరకు ఆయన అందించిన ₹20వేల ఆర్థిక సాయాన్ని కుటుంబసభ్యులకు సోమవారం స్థానిక నాయకులు అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి పేర్కొన్నట్లు తెలిపారు. ఎంపీపీ నక్క శంకరయ్య, జడ్పీటీసీ జలందర్, సింగిల్ విండో చైర్మన్ రాజసుమన్ రావు, ముస్కు లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రాణం తీసిన ప్రయోగం

**మల్యాల :** కరెంట్ ఆధారంగా చేపలు పడదామని వెళ్లిన ఓ వ్యక్తి, విద్యుత్‌షాక్‌తో చనిపోయాడు. జగిత్యాల జిల్లా మల్యాల ఎస్ఐ ఉపేంద్రాచారి వివరాల మేరకు.. రాజారాం శివారు ఇటుక బట్టీలో ఒడిశా రాష్ట్రానికి చెందిన సుక్రు కడియాబాగ్ (45) నాలుగు నెలలుగా పనిచేస్తున్నాడు. లాక్‌డౌన్‌తో పనులు బంద్ కావడంతో ఆదివారం ఉదయం చేపలు పట్టేందుకని సమీపంలోని వాగులోకి వెళ్లాడు. అర్ధరాత్రి దాటినా ఇంటికి రాలేదు. దీంతో సోమవారం గాలించగా వాగులో నిర్జీవంగా పడి ఉన్నాడు. చేపలు పట్టేందుకు కర్రకు విద్యుత్ వైర్‌ను అమర్చి నీటిలో వదలగా, ప్రమాదవశాత్తు నీటిలో పడి షాక్‌తో చనిపోయాడు.అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

### మానవత్వం చాటిన పోలీసులు

**రామడుగు:** వెదిరకు చెందిన దివ్య అనే యువతి సోమవారం తీవ్ర కడుపునొప్పితో బాధపడుతుండగా, కుటుంబసభ్యులు దవాఖానకు తీసుకెళ్లేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ఈ క్రమంలో రామడుగు ఎస్ఐ గొల్లపెల్లి అనూషకు సమాచారం ఇచ్చారు. వెంటనే వెదిరకు చేరుకొని దివ్యను పోలీసు పెట్రోకార్ వాహనంలో కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఎస్ఐతోపాటు కానిస్టేబుల్ లింగారెడ్డి, పెట్రోకార్ డ్రైవర్ భగవాన్, హేమంత్‌ను సీపీ అభినందించి, రివార్డులు ప్రకటించారు.

### పరిశుభ్రత పాటించాలి: మేయర్

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ :** కరోనా కట్టడికి ప్రతిఒక్కరూ పరిశుభ్రత, ముందు జాగ్రత్తలు పాటించాలని మేయర్ సునీల్‌రావు కోరారు. నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా సంఘాలు తయారు చేసిన మాస్కుల విక్రయ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ క్రాంతితో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఒక్కో మాస్కు రూ.15కు అమ్ముతున్నామన్నారు.

### 'లాక్‌డౌన్' ఉల్లంఘనపై ఫైన్

**రాయికల్ రూరల్ :** కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణకు చేపట్టిన లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించిన వారికి రాయికల్ మున్సిపల్ కమిషనర్ రమేశ్ సోమవారం జరిమానా విధించారు. పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద 'శ్రీలక్ష్మి ఇంజినీరింగ్ హార్డ్‌వేర్' దుకాణం తెరిచి ఉండగా దాని యజమాని రఘుపతి రెడ్డికి రూ.వెయ్యి జరిమానా వేశారు. రాయికల్ మండలం ఇటిక్యాలలో ద్విచక్ర వాహనాలతో రోడ్లపైకి వచ్చి తిరుగుతున్న యువకులను పట్టుకొని పంచాయతీ అధికారులు రూ. 2వేల జరిమానా విధించారు.

### రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

- కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల కలెక్టర్లు

**కరీంనగర్ ప్రతినిధి/ జగిత్యాల, నమస్తే తెలంగాణ/ సిరిసిల్ల కలెక్టరేట్ :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల కలెక్టర్లు శశాంక, గుగులోత్ రవి, కృష్ణభాస్కర్ ఆదేశించారు. సోమవారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్లలో వీడియో కాన్ఫరెన్స్‌లు, మీడియా సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కరోనా నేపథ్యంలో ఒక్కో గ్రామానికి ఒక్కో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నామనీ, కొన్ని గ్రామాల్లో రెండు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆయాచోట్ల వైరస్ నిరోధానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు కూపన్లు జారీ చేసి, వాటి ద్వారానే కొనుగోళ్లు జరుపుతామని చెప్పారు. వరి కోత యంత్రాలకు స్పేర్ పార్ట్స్ సరఫరా చేసే ఆటో మొబైల్ డీలర్లకు, వాహనాలు, యంత్రాలు మరమ్మతులు చేసే మెకానిక్‌లకు పాసులు ఇవ్వాలని స్టేషన్‌హౌస్ అధికారులను ఆదేశించారు.

### నిత్యావసరాల ధరలు పెంచితే కేసులు

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** కరోనా బూచిని చూపి కొంత మంది వ్యాపారులు నిత్యావసర సరకుల ధరలు పెంచేస్తున్నారు. ఇలాంటి వారికి కళ్లెం వేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మార్కెటింగ్, పశు సంవర్ధక శాఖ అధికారుల ప్రతిపాదన మేరకు కరీంనగర్ కలెక్టర్ శశాంక ధరలను స్థిరీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. టమాట ₹8–12, బెండకాయ ₹32–36, దొండ ₹35–39, బీర్నీస్ ₹28–32, కాకరకాయ ₹23–27, మునగ ₹22–26, ఉల్లి ₹38–42, వంకాయ ₹22–26, పాలకూర ₹23–27, మెంతి ₹13–17, కొత్తిమీర ₹13–17, క్యారెట్ ₹48–52, పచ్చిమిర్చి ₹23–27, నిమ్మకాయలు ₹32–38, దోసకాయ ₹23–27, ఆలుగడ్డ ₹33–37, కాలిఫ్లవర్ ₹23–27, క్యాబేజీ ₹18–22, పొట్లకాయ ₹12–17, కరివేపాకు ₹8–12, గోడిచిక్కుడు ₹25–32, చిక్కుడుకాయ ₹38–42కు కిలో చొప్పున, అలాగే మటన్ కిలో ₹500–600, చికెన్ కిలో ₹160–180 చొప్పున విక్రయించాలని స్పష్టం చేశారు. ఇంతకు మించిన ధరలకు విక్రయాలు జరిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శశాంక హెచ్చరించారు.

### కల్యాణలక్ష్మి చెక్కులు వచ్చినయ్..

**ధర్మపురి, నమస్తే తెలంగాణ :** ధర్మపురి మండలం రాజారం, ఆరెపల్లి, నాగారం, కమలాపూర్, మగ్గిడి ఎడపల్లి గ్రామాలకు చెందిన 28 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరయ్యాయి. వాటిని సోమవారం ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్ కన్వీనర్ సొల్లు భీమయ్య, వైస్ ఎంపీపీ గడ్డం మహిపాల్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

### విదేశాల నుంచి వచ్చిన వారికి జియో ట్యాగింగ్

**సిరిసిల్లక్రైం:** విదేశాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చిన వారికి ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాలతో జిల్లా పోలీస్ అధికారులు జియోట్యాగింగ్ చేస్తున్నారు. సోమవారంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మందికిపైగా జియోట్యాగింగ్ పూర్తి చేశారు. మంగళవారం నాటికి జిల్లా వ్యాప్తంగా జియోట్యాగింగ్ పూర్తి చేస్తామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ తెలిపారు. దీనిద్వారా హౌస్ క్వారంటైన్ పూర్తయ్యే వరకూ వారి కదలికలను నిశితంగా పరిశీలించే వెసులుబాటు కలగనుందని వెల్లడించారు.

సెన్సెక్స్ ▼ 28,440 (1,375) | నిఫ్టీ ▼ 8,281 (379)



వెన్‌కాబ్ చికెన్ ధరలు (రూ.)

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 70.00 | రిటైల్ లైవ్ | 92.00 |
| డ్రెస్డ్ | 133.00 | స్కిన్‌లెస్ | 152.00 |

గుడ్ల ధరలు (వందకు)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 335.00 | వరంగల్ | 338.00 |
| మెదక్ | 335.00 | కరీంనగర్ | 338.00 |
| రంగారెడ్డి | 335.00 | డజన్ ధర | 54.00 |

# రిలయన్స్ 500 కోట్లు

## రూ.150 కోట్లు ప్రకటించిన ఎల్‌అండ్‌టీ.. రూ.100 కోట్లిస్తున్న హీరో గ్రూప్

## పీఎం-కేర్స్ ఫండ్‌కు కార్పొరేట్ల విరాళాలు



**న్యూఢిల్లీ, మార్చి 30:** కరోనా బారినపడ్డ భారతావనిని ఆదుకునేందుకు కార్పొరేట్లు కదిలారు. పీఎం-కేర్స్ ఫండ్‌కు పెద్ద ఎత్తున విరాళాలు వస్తున్నాయి. ముకేశ్ అంబానీ సోమవారం రూ.500 కోట్లు ప్రకటించారు. మహారాష్ట్ర, గుజరాత్ సీఎం రిలీఫ్ ఫండ్స్‌కు కూడా రూ.5 కోట్ల చొప్పున విరాళాలు ఇస్తున్నట్టు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తెలియజేసింది. ఇప్పటికే 100 పడకల కరోనా దవాఖానను ఏర్పాటు చేసిన రిలయన్స్.. హెల్త్ వర్కర్ల కోసం రోజుకు లక్ష మాస్కులను తయారు చేయిస్తున్నది. ఎమర్జెన్సీ సర్వీసులకు ఉచితంగా ఇంధనాన్నీ అందిస్తున్నామని సంస్థ తెలిపింది. లాక్‌డౌన్ నేపథ్యంలో పేదలకు నిత్యావసరాలను సమకూరుస్తున్నట్లు చెప్పింది. మరోవైపు ఎల్‌అండ్‌టీ సోమవారం రూ.150 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. లాక్‌డౌన్ కారణంగా రోడ్డునపడ్డ దాదాపు 1.60 లక్షల కాంట్రాక్టు కార్మికులకు అండగా నిలుస్తున్నామని, నెలకు రూ.500 కోట్లకుపైగా ఖర్చుచేసి ఆహార, ఇతర సదుపాయాల్ని కల్పిస్తున్నామని ఆ సంస్థ తెలిపింది. దేశీయ ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హీరో గ్రూప్ సైతం రూ.100 కోట్ల సాయంతో ముందుకొచ్చింది. పీఎం-కేర్స్ ఫండ్‌కు రూ.50 కోట్లను విరాళంగా ప్రకటించింది. మరో రూ.50 కోట్లతో సహాయక చర్యలు చేపట్టనున్నట్టు తెలిపింది. అలాగే హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) రూ.26.25 కోట్లను, టీవీఎస్ మోటర్, పతంజలి రూ.25 కోట్ల చొప్పున పీఎం-కేర్స్ ఫండ్‌కు ఇస్తున్నట్లు తెలిపాయి. ఐదు రాష్ర్టాల్లో 1,500 పడకలతో 5 క్వారంటైన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు పతంజలి ప్రకటించింది. ఉద్యోగుల వేతనాల ద్వారా రూ.1.50 కోట్లను విరాళంగా ఇస్తున్నామన్నది. ఐఐఎఫ్ఎల్ గ్రూప్ సైతం రూ.5 కోట్ల విరాళాన్ని పీఎం-కేర్స్ ఫండ్‌కు ఇస్తున్నది.



# మటాష్

### నష్టాల్లో స్టాక్ మార్కెట్లు • 1,375 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

### 379 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ • వెంటాడిన కరోనా భయాలు

**న్యూఢిల్లీ, మార్చి 30:** దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాలబాట పట్టాయి. సోమవారం ట్రేడింగ్‌లో మదుపరులను కరోనా వైరస్ భయాలు వెంటాడాయి. ఉదయం ఆరంభం నుంచే నేలచూపులు చూసిన సూచీ లు.. చివరిదాకా అదేతీరును కనబరిచాయి. ఫలితంగా బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ 1,375.27 పాయింట్లు లేదా 4.61 శాతం పతనమై 28,440.32 వద్దకు చేరితే, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 379.15 పాయింట్లు లేదా 4.38 శాతం కోల్పోయి 8,281.10 వద్ద నిలిచింది. కొవిడ్-19 కేసుల సంఖ్య వెయ్యిని దాటడం, ఇప్పటిదాకా 29 మంది చనిపోవడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఈ క్రమంలోనే బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. రియల్టీ, ఆటో, టెలికం షేర్లూ మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి. ఓ దశలో సెన్సెక్స్ 1,500 పాయింట్లకుపైగా నష్టపోయింది. బజాజ్ ఫైనాన్స్ షేర్ విలువ అత్యధికంగా 12 శాతం పడిపోయింది.

**రూ.3.35 లక్షల కోట్లు ఆవిరి**

స్టాక్ మార్కెట్ల నష్టాలతో ఈ ఒక్కరోజే మదుపరుల సంపద రూ.3.35 లక్షల కోట్లు ఆవిరైపోయింది. బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.3,35,192.89 కోట్లు హరించుకుపోయి రూ.1,09,63,832.17 కోట్లకు పరిమితమైంది. మొత్తం 1,392 షేర్లు నష్టపోయాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలూ 2.13 శాతం మేర క్షీణించాయి.

**18 ఏండ్ల కనిష్ఠానికి క్రూడ్ ధర**


గ్లోబల్ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 18 ఏండ్ల కనిష్ఠాన్ని తాకింది. దాదాపు 23 డాలర్లకు క్షీణించింది. 2002 తర్వాత ఈ స్థాయికి రావడం ఇదే తొలిసారి. సౌదీ, రష్యా మధ్య ధరల యుద్ధం మార్కెట్‌ను కుదిపేస్తున్నది. మరోవైపు డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 70 పైసలు దిగజారి 75.59 వద్ద స్థిరపడింది. దేశ ఆర్థిక వ్యవస్థపై కరోనా వైరస్ ప్రభావం మధ్య డాలర్లకు డిమాండ్ ఏర్పడింది.

## బీఓబీ, యూబీఐ వడ్డీరేట్ల తగ్గింపు

**న్యూఢిల్లీ, మార్చి 30:** బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) తమ రిటైల్, వ్యక్తిగత రుణాలతోపాటు ఎంఎస్ఎంఈ రుణాలపై రెపో ఆధారిత వడ్డీరేటును 75 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఇది శనివారం (మార్చి 28) నుంచి అమల్లోకి వచ్చినట్టు ఆ బ్యాంకు ప్రకటించింది. రెపోరేటును 5.15 శాతం నుంచి 4.40 శాతానికి తగ్గిస్తున్నట్టు శుక్రవారం ఆర్బీఐ చేసిన ప్రకటనకు అనుగుణంగా బరోడా రెపో లింక్డ్ లెండింగ్ రేటు (బీఆర్ఎల్ఎల్ఆర్)ను 75 బేసిస్ పాయింట్లు తగ్గించామని, దీంతో ఫ్లోటింగ్ రేటుతో కొత్తగా తీసుకొనే అన్నిరకాల రిటైల్, వ్యక్తిగత, ఎంఎస్ఎంఈ రుణాలకు మార్చి 28 నుంచి 7.25 శాతం బీఆర్ఎల్ఎల్ఆర్ వర్తిస్తుందని బీఓబీ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 'రెపోరేటును తగ్గిస్తున్నట్టు ఆర్బీఐ ప్రకటించిన వెంటనే మేము ఆ ప్రయోజనాన్ని మా ఖాతాదారులకు బదిలీ చేశాం' అని బీఓబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విక్రమాదిత్య తెలిపారు. ఇదేవిధంగా యూబీఐ వడ్డీరేటు 7.2 శాతానికి, ఇండియన్ బ్యాంక్ వడ్డీరేటు 8.10 శాతానికి తగ్గింది.

## మారుతీ వాహనాల వారంటీ పొడిగింపు

**న్యూఢిల్లీ, మార్చి 30:** సంక్షోభం నేపథ్యంలో తమ వినియోగదారుల వాహనాల వారంటీని, సర్వీస్ టైమ్‌లైన్‌ను పొడిగిస్తున్నట్టు మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) ప్రకటించింది. మార్చి 15 నుంచి ఏప్రిల్ 30 మధ్య కాలంలో ఉచిత సర్వీసు, వారంటీ, ఎక్‌టెండెడ్ వారంటీ ముగిసే వాహనాలకు ఆయా సేవలను జూన్ 30 వరకు పొడిగించినట్టు ఎంఎస్ఐ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.



సంతోష్ వయసు 36 ఏండ్లు. ఓ ప్రైవేట్ సంస్థలో సాధారణ ఉద్యోగి. పదేండ్లుగా సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. గతేడాది తన బడ్జెట్‌లో ఓ అపార్టుమెంట్‌లో ఫ్లాట్‌ను కొనుగోలు చేశాడు. ఇందుకోసం ఓ బ్యాంక్‌లో రూ.13 లక్షల గృహ రుణం తీసుకున్నాడు. ఇప్పటికే 10 నెలసరి వాయిదా (ఈఎంఐ)లూ చెల్లించాడు. అయితే కరోనా వైరస్ తీవ్రత దృష్ట్యా ఆర్బీఐ విధించిన మారటోరియంను తీసుకోవాలా?.. వద్దా?.. అన్న డైలమాలో పడిపోయాడు. ఈ పరిస్థితి ఒక్క సంతోష్‌దే కాదు. మనలో చాలామందికి ఇదే సందేహం. అసలు మారటోరియం తీసుకుంటే లాభమా?.. నష్టమా?.. అన్నది తెలియని సంకట స్థితిలో ఉన్నారు. ఒకటో తారీఖు వచ్చేస్తున్నా స్పష్టత లేకపోవడం రుణగ్రహీతలను అయోమయానికి గురిచేస్తున్నది.

# మాయాటోరియం

- ఈఎంఐ వాయిదా లాభమా! నష్టమా?
- రుణగ్రహీతల్లో అయోమయం



**మారటోరియం అంటే?**

మారటోరియం అంటే కేవలం వాయిదానే. రద్దు ఎంతమాత్రం కాదు. అంటే రిజర్వ్ బ్యాంక్ ఇటీవల ఇచ్చిన మూడు నెలల మారటోరియంతో ఈ మూడు నెలల ఈఎంఐలను తర్వాత చెల్లించేందుకు మనకు దక్కిన అవకాశం మాత్రమే. సాధారణంగా రుణం తీసుకున్నవారు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులున్నా నెలసరి ఈఎంఐలను అప్పిచ్చిన సంస్థలకు విధిగా చెల్లించాల్సిందే. అలా జరుగని పక్షంలో డిఫాల్టర్లుగా మారుతారు. కానీ కరోనా మహమ్మారితో దేశంలో నెలకొన్న ఆర్థిక విపత్కర పరిస్థితులు ప్రజలందరినీ ప్రభావితం చేస్తున్నాయి. అందుకే ఆర్బీఐ ఈ మూడు నెలల వెసులుబాటును కల్పించింది. దీంతో ఈఎంఐలు చెల్లించకపోయినా డిఫాల్ట్ కాబోము. మన క్రెడిట్ స్కోర్‌కూ వచ్చిన ఇబ్బందేమీ లేదు.

**ఎవరికి లాభం?**

వేతన జీవుల కంటే వ్యాపారులకు ఈ మారటోరియం ఎక్కువ లాభమని నిపుణులు చెప్తున్నారు. నగదు కొరతలేనివారు ఈఎంఐలను యథాతథంగా చెల్లించుకుంటేనే లాభమని ప్రముఖ ఆర్థిక నిపుణుడు డీ పాపారావు అభిప్రాయపడ్డారు. మారటోరియం అంటే ఈఎంఐల రద్దు కాదని, వాయిదా మాత్రమేనన్న ఆయన.. మారటోరియం తీసుకోవాలనుకున్నవారు ఈ మూడు నెలల మొత్తం ఆపడం వల్ల అంతకంటే ఎక్కువ లాభం ఉంటుందా? అన్న దానిపై ఆలోచించుకోవాలని సూచించారు. అయితే కరోనా ధాటికి ఆదాయం ప్రభావితమైనవారందరికీ ఆర్బీఐ నిర్ణయం మాత్రం గొప్ప ఊరటేనన్న అభిప్రాయాలు కచ్చితంగా వినిపిస్తున్నాయి. మొత్తానికి బ్యాంకుల నుంచి మారటోరియంపై స్పష్టత వస్తేగానీ ఈ అయోమయానికి తెరపడదు.

**మారటోరియం కావాలంటే ఏం చేయాలి?**

మారటోరియం కావాలనుకున్నవారు ముందుగా మీరు రుణాలు తీసుకున్న బ్యాంకులు లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల ప్రతినిధులను కలుసుకోవాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఎప్పట్లాగే మీ ఈఎంఐ మొత్తాన్ని మీ ఖాతాల నుంచి రుణదాతలు తీసుకోవచ్చు. అయితే దీనిపై ఇప్పటివరకు స్పష్టత లేదు. కాగా, మరికొన్ని సంస్థలు ఈ విధానం కోసం ఆన్‌లైన్ అభ్యర్థనల్ని స్వీకరిస్తున్నట్టు తెలుస్తున్నది. కరోనా వైరస్ వల్ల తమ ఆదాయం పడిపోయిందని, ఈఎంఐలను చెల్లించలేని స్థితిలో ఉన్నామని రుణదాతలకు మీరు రుజువు చేసుకోవాల్సి ఉంటుంది. ఇది విశ్వసనీయంగా ఉంటేనే మీకు మారటోరియం అవకాశం లభిస్తుందని కొందరు బ్యాంక్ ఉద్యోగులు చెప్తున్నారు. అయితే ఎస్బీఐ తమ కస్టమర్లందరి టర్మ్ లోన్లు ఆటోమేటిగ్గా మూడు నెలలు వాయిదా పడుతాయని ప్రకటించినట్లు సమాచారం. దీనిపైనా స్పష్టత రావాల్సి ఉన్నది.

**తీసుకుంటే ఏం జరుగుతుంది?**

మారటోరియం తీసుకున్నవారికి మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన కిస్తీ చెల్లింపుల నుంచి తాత్కాలికంగా మినహాయింపు లభిస్తుంది. ఈ మూడు నెలల ఈఎంఐలను బ్యాంకులు తిరిగి ఎలా వసూలు చేసుకుంటాయి? అన్నదానిపై కొన్ని సందేహాలు, మరికొన్ని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మారటోరియం అన్నది బ్యాంక్ బోర్డు నిర్ణయించేదని, ఈ వ్యవస్థీకృత అంశాన్ని లోతుగా చర్చించాల్సి ఉంటుందని ఓ మాజీ సీనియర్ బ్యాంకర్ తెలిపారు. అందుకు కొంత సమయం పడుతుందని అభిప్రాయపడ్డారు. అలాగే మారటోరియంతో ఈఎంఐ మారబోదని, రుణ కాలపరిమితి మాత్రమే కాస్త పెరుగుతుందని చెప్పారు. కాగా, మరికొందరి వాదనల ప్రకారం చూస్తే.. మీరు రూ.25 లక్షల గృహ రుణాన్ని 20 ఏండ్ల కాలపరిమితితో తీసుకున్నారనుకుందాం. దానికి నెలకు రూ.30 వేల ఈఎంఐని చెల్లిస్తున్నారనుకుందాం. ఇందులో రూ.22 వేలు వడ్డీ, రూ.8 వేలు అసలుగా ఉంటే.. మూడు నెలల వడ్డీ రూ.66 వేలు మీరు తీసుకున్న రూ.25 లక్షల గృహ రుణానికి చేరి రూ.25.66 లక్షలుగా మారుతుంది. అంతేగాక అసలు రూ.24 వేల కోసం కాలపరిమితి 3 నెలలు పెరుగుతుంది. ఇక ఈ అదనపు వడ్డీ రూ.66 వేలకు మీరు ఇంకా చెల్లించాల్సిన కాలపరిమితి మొత్తం ఈఎంఐల సంఖ్యతో భాగించి విభజిస్తారు. దీనివల్ల ఈఎంఐ స్వల్పంగా పెరగొచ్చు. వాహన, విద్యా, వ్యక్తిగత రుణాలకూ ఇదే లెక్క ఉంటుందని సమాచారం. దీనిపై బ్యాంకర్లు స్పష్టత ఇవ్వాల్సి ఉన్నది.

## ప్రీపెయిడ్ ప్లాన్ల కాల పరిమితి పొడిగించాలి

**లాక్‌డౌన్ నేపథ్యంలో టెల్కోలకు ట్రాయ్ సూచన**

**న్యూఢిల్లీ, మార్చి 30:** కరోనా వైరస్ కట్టడికి దేశవ్యాప్తంగా 21 రోజులు లాక్‌డౌన్ కొనసాగుతున్న నేపథ్యంలో దేశీయ మొబైల్ ఆపరేటర్లకు మార్కెట్ నియంత్రణా సంస్థ 'ట్రాయ్' కీలక సూచనలు చేసింది. ఈ లాక్‌డౌన్ పీరియడ్‌లో ప్రీపెయిడ్ ఖాతాదారులకు సేవల్లో అంతరాయం కలుగకుండా చూసేందుకు వారి ప్రస్తుత పథకాల (ప్లాన్ల) చెల్లుబాటు గడువును పొడిగించాలని కోరింది. అంతేకాకుండా ప్రాథమ్యాల ఆధారంగా ఇలాంటి ఖాతాదారులకు అంతరాయం లేకుండా సేవలందించేందుకు చేపడుతున్న చర్యలేమిటో వివరించాలని ట్రాయ్ ఆదివారం అన్ని టెల్కోలకు స్పష్టం చేసింది.

**సానుకూల స్పందన**


ట్రాయ్ విజ్ఞప్తికి భారతీ ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ సానుకూలంగా స్పందించాయి. తమ ప్రీపెయిడ్ కనెక్షన్ల వాలిడిటీ గడువును ఏప్రిల్ 17 వరకు పొడిగించడంతోపాటు ఆయా ఖాతాల్లో రూ.10 టాక్‌టైమ్‌ను క్రెడిట్ చేశామని ఎయిర్‌టెల్ ప్రకటించింది. ఇదేవిధంగా బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ తమ ప్రీపెయిడ్ ప్లాన్ల వాలిడిటీ గడువును ఏప్రిల్ 20 వరకు పొడిగించడంతోపాటు జీరో బ్యాలెన్స్ తర్వాత కూడా ప్రతి ఖాతాదారునికి అదనంగా రూ.10 టాక్‌టైమ్‌ను అందించనున్నాయి.

## ఏప్రిల్ 1నుంచే కొత్త ఆర్థిక సంవత్సరం

**న్యూఢిల్లీ, మార్చి 30:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరాన్ని (2019-20) పొడిగించారని వస్తున్న వార్తల్ని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కొట్టిపారేసింది. ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21) మొదలవుతుందని సోమవారం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. కరోనా వైరస్ నేపథ్యంలో నెలకొన్న విపత్కర పరిస్థితుల మధ్య జూన్ 30 వరకు ఈ ఆర్థిక సంవత్సరాన్ని పొడిగించాలన్న అభ్యర్థనలు వ్యాపార, పారిశ్రామిక వర్గాల నుంచి వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ ఆర్థిక సంవత్సరాన్ని మూడు నెలలపాటు పొడిగించారన్న వార్తలు కొన్ని మీడియాల్లో గుప్పుమన్నాయి. దీంతో ఆర్థిక శాఖ పైవిధంగా స్పష్టత ఇచ్చింది.

# ఆట

## కరోనాపై పోరుకు విరుష్క సాయం



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ (కొవిడ్-19) మహమ్మారిపై జరుగుతున్న పోరాటానికి టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ దంపతులు తమ వంతు ఆర్థిక సాయం అందజేశారు. పీఎం కేర్స్ నిధితో పాటు మహారాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాన్ని అందజేసినట్లు కోహ్లీ, అనుష్క శర్మ సోమవారం ప్రకటించారు. అయితే ఎంత మొత్తం అందించారనే విషయాన్ని మాత్రం గోప్యంగా ఉంచారు. 'పీఎం -కేర్స్ నిధి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి నేను, అనుష్క కొంత సాయం చేస్తున్నాం. కరోనా వైరస్ కారణంగా చాలా మంది బాధపడుతుండటం మా హృదయాలను కలచివేస్తున్నది. మేం చేస్తున్న ఈ సాయం బాధల్లో ఉన్నవారికి తోడ్పడుతుందని ఆశిస్తున్నాం' అని కోహ్లీ ట్విట్టర్ వేదికగా పేర్కొనగా.. అనుష్క దీన్నే రీట్వీట్ చేసింది.

## తనువొక చోట.. మనసొక చోట




**ముంబై:** లాక్‌డౌన్ కారణంగా శారీరకంగా ఇంట్లోనే ఉన్నా.. మనసు మాత్రం వాంఖడే స్టేడియంలో చక్కర్లు కొడుతున్నదని ముంబై ఇండియన్స్ ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ అంటున్నాడు. కరోనా వైరస్ కారణంగా ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉన్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 13వ సీజన్ రెండు వారాలు వాయిదా పడ్డ విషయం తెలిసిందే. దేశవాళీల్లో చక్కటి ఫామ్ కనబరుస్తున్న సూర్యకుమార్ స్పందిస్తూ.. 'శారీరకంగా ఇంట్లో ఉన్నా.. మనసంతా వాఖడే స్టేడియంలోనే ఉంది' అని పేర్కొన్నాడు. విపత్కర పరిస్థితుల్లో ఇంటికే పరిమితమవడం మంచిదని అతడు సూచించాడు. వాయిదా పడ్డ షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 15 నుంచి ఐపీఎల్ ప్రారంభం కావాల్సి ఉన్నా.. దేశవ్యాప్త లాక్‌డౌన్ నేపథ్యంలో లీగ్ నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి.

# టోక్యో కొత్త షెడ్యూల్ విడుదల

- 2021 జూలై 23న ప్రారంభం కానున్న ఒలింపిక్స్..
- ఏడాది ఆలస్యమైనా టోక్యో 2020గానే గుర్తింపు




**టోక్యో:** కరోనా వైరస్ కారణంగా ఏడాది వాయిదా పడ్డ ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్ క్రీడల కొత్త షెడ్యూల్ విడుదలైంది. టోక్యో వేదికగా జరుగనున్న ఈ మెగాటోర్నీ 2021 జూలై 23న ప్రారంభమై.. ఆగస్టు 8న ముగియనుంది. ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది జూలై 24 నుంచి ఆగస్టు 9 వరకు జరుగాల్సి ఉన్న విశ్వక్రీడాలను కొవిడ్-19 కారణంగా ఒక ఏడాదికాలం పొడిగించినా.. దాదాపు అదే తేదీల్లో జరుపాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం ఇక్కడ జరిగిన ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశంలో కొత్త షెడ్యూల్‌ను ప్రకటించారు. ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 5 వరకు పారాలింపిక్స్ నిర్వహిస్తామని టోక్యో ఒలింపిక్స్ చీఫ్ యొషిరో మోరీ పేర్కొన్నారు.

**అదే సమయంలో యూరోపియన్ లీగ్**

మెగాటోర్నీ వాయిదా పడటం వల్ల కొన్ని వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లినా.. ప్రజల ఆరోగ్యం కంటే తమకు ఏది ముఖ్యం కాదని ఒలింపిక్ నిర్వాహక కమిటీ సీఈవో తొషిరో మోటో తెలిపారు. అయితే ఎటొచ్చి కొత్త షెడ్యూల్‌కు అనుగుణంగా ఇతర క్రీడల తేదీలను మార్చడం అతిపెద్ద సమస్యగా మారింది. 2021లో ఒలింపిక్స్ జరిగే సమయంలోనే యూరోపియన్ సాకర్ లీగ్, ఉత్తర అమెరికా స్పోర్ట్స్ లీగ్‌లు జరుగనున్నాయి. దీంతో పాటు ఒలింపిక్స్ కోసం సిద్ధం చేసిన స్టేడియంలను ఏడాది పాటు ఖాళీగా ఉంచడం కూడా కష్టమైన పనే అని నిర్వాహకులు అంటున్నారు. 'ఒలింపిక్స్ కోసం స్టేడియంలను సిద్ధం చేశాం. ఇప్పుడు వాటిని వేరే ఈవెంట్‌లకు అద్దెకివ్వడం కూడా కుదరని పని. 2021 కోసం బుక్ చేసుకున్న వారి తేదీలను మార్చడం కూడా పెద్ద తలనొప్పే' అని ఒక అధికారి వాపోయారు.



తొషిరో మోటో

**రెండో ప్రపంచ యుద్ధం తర్వాత..**

కరోనా వైరస్ ప్రబలుతుండటంతో ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మెగాటోర్నీ నిర్వహించడం సరైంది కాదని అథ్లెట్లతో పాటు, జాతీయ క్రీడా సమాఖ్యల నుంచి వచ్చిన విన్నపాలను పరిగణనలోకి తీసుకున్న అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ విశ్వక్రీడలను వాయిదా వేసిన విషయం తెలిసిందే. ప్రపంచ యుద్ధాలు మినహాయించి ఒలింపిక్స్ వాయిదా పడటం ఇదే తొలిసారి.

## సానియా సాయం రూ. 1.25 కోట్లు



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ మహమ్మారి వ్యాప్తిని అరికట్టేందుకు జరుగుతున్న పోరాటంలో భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా భాగం పంచుకుంటున్నది. ఇందుకోసం రూ. 1. 25 కోట్లను వెచ్చిస్తున్నట్లు సానియా సోమవారం ట్విట్టర్ వేదికగా తెలిపింది. 'గత వారం రోజులుగా అవసరమైన వారికి సాయం చేస్తున్నాం. ఇందులో భాగంగా వేల కుటుంబాలకు భోజన సదుపాయాలు అందిచగలిగాం. ఇప్పుడు రూ. 1.25 కోట్లను ఇందుకోసం వెచ్చిస్తున్నాం. దీనివల్ల లక్ష మందికి లబ్ధి చేకూరేలా చేయాలనుకుంటున్నాం' అని ట్వీట్ చేసింది.

## మిథాలీ విరాళం రూ.10 లక్షలు



**న్యూఢిల్లీ:** క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వానికి అండగా ఉండేందుకు క్రీడాలోకం కదులుతున్నది. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు భారత మహిళా వన్డే జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్ రూ. 10 లక్షలు విరాళంగా ఇచ్చింది. ఇందులో ఐదు లక్షలు తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి.. మరో ఐదు లక్షలను ప్రధాని సహాయ నిధికి అందించింది. స్టార్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ రూ. 2 లక్షలు, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ రూ. 1.5 లక్షలు పీఎం కేర్స్‌కు అందజేశారు. ఆరుసార్లు ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ మేరీకోమ్ తన నెల జీతాన్ని ప్రధాని సహాయ నిధికి విరాళంగా అందజేసింది. రాజ్యసభ ఎంపీగా విధులు నిర్వర్తిస్తున్న మేరీ.. నెల జీతం లక్ష రూపాయలను సహాయ నిధికి బదిలీ చేయాల్సిందిగా బ్యాంక్ అధికారులను కోరింది. టీనేజ్ షూటర్ మను భాకర్ హర్యానా ప్రభుత్వానికి లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చింది. టేబుల్ టెన్నిస్ (టీటీ) ఆటగాడు జి.సాతియాన్ రూ. 1.25 లక్షలను విరాళంగా ప్రకటించాడు. అందులో లక్ష రూపాయలను తమిళనాడు ముఖ్యమంత్రి సహాయ నిధికి.. మిగిలిన రూ. 25 వేలను ప్రధాని సహాయ నిధికి బదిలీ చేస్తున్నట్లు తెలిపాడు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ రూ. 11 లక్షల విరాళం ప్రకటించగా.. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఉద్యోగులు మూడు రోజుల వేతనాన్ని (రూ. 76 లక్షలు) ప్రధాని సహాయ నిధికి అందజేయనున్నారు.

## జూన్ 30 వరకు టీటీ టోర్నీలన్నీ రద్దు

**న్యూఢిల్లీ:** కొవిడ్-19 మహమ్మారి కోరలు చాస్తుండటంతో ప్రపంచవ్యాప్తంగా జూన్ 30 వరకు జరగాల్సిన అన్ని టోర్నీలను రద్దు చేస్తున్నట్లు అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) పేర్కొంది. కరోనా వైరస్ విజృంభిస్తున్న తరుణంలో సమావేశమైన ఐటీటీఎఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.


epaper.ntnews.com

నమస్తే తెలంగాణ


13. నిపుణ

[ హైదరాబాద్ ]

మంగళవారం 31 మార్చి 2020



దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాలకు అవసరమైన మానవ వనరులను తీర్చిదిద్దేలా కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిశోధనలు ప్రోత్సహిస్తున్నది. యూనివర్సిటీలు లేదా ఐఐటీలలో, దేశ వ్యాప్తంగా సీఎస్ఐఆర్ పరిధిలో ఉన్న 38 జాతీయ ప్రయోగశాలలు, 80 ఫీల్డ్ స్టేషన్లు, గుర్తింపు పొందిన సంస్థల్లో పరిశోధనలు చేయాలనుకునే వారికి సీఎస్ఐఆర్ నెట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. అదేవిధంగా కాలేజీల్లో లెక్చరర్‌షిప్ చేయడానికి లేదా అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేయాలనుకునే వారు ఈ పరీక్షలో అర్హత సాధించాల్సిందే. జేఆర్ఎఫ్, లెక్చరర్‌షిప్ కోసం ఏటా నిర్వహించే సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌తోపాటు, ఇతర సబ్జెక్టుల కోసం నిర్వహించే యూజీసీ- నెట్ నోటిఫికేషన్లను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసింది. వీటికి సంబంధించిన వివరాలు..



# ఎన్‌టీఏ నెట్-2020

## సీఎస్ఐఆర్-యూజీసీ

### ఎవరు చేయవచ్చు..

- ఎమ్మెస్సీ లేదా ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎమ్మెస్, బీఈ లేదా బీటెక్, నాలుగేండ్ల బీఎస్సీ, బీఫార్మసీ, ఎంబీబీఎస్, బీఎస్సీ (ఆనర్స్) 55 శాతం మార్కులతో ఉత్తర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- జేఆర్ఎఫ్ దరాఖాస్తు చేసుకునేవారికి 2020, జనవరి 1 నాటికి 28 ఏండ్ల లోపువారై ఉండాలి. అసిస్టెంట్ ప్రొఫెసర్ లేదా లెక్చరర్‌షిప్ అభ్యర్థులకు ఎలాంటి వయోపరిమితి లేదు.

### ఏయే సబ్జెక్టులు

- మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమికల్ సైన్సెస్, ఎర్త్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్, ప్లానెటరీ సైన్సెస్. వీటిలో అభ్యర్థి ఏదో ఒక సబ్జెక్టును ఎంపికచేసుకోవాలి.

### ఫెలోషిప్

- జేఆర్ఎఫ్‌కు ఎంపికై పరిశోధన చేసేవారి మొదటి రెండేండ్లు ప్రతినెలా రూ.31వేల చొప్పున అందిస్తారు. అదేవిధంగా పరిశోధన చేసే సంస్థ లేదా యూనివర్సిటీ కంటిన్‌జెంట్ గ్రాంటుగా అభ్యర్థికి ఏటా రూ.20వేల చొప్పున అందిస్తారు. జేఆర్ఎఫ్‌గా రెండేండ్లు పూర్తిచేసి పీహెచ్‌డీకి రిజిస్టర్ చేసుకుని సీనియర్ రిసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్)గా అప్‌గ్రేడ్ పొందితే మూడో ఏడాది నుంచి రూ.35 వేలు స్టయిఫండ్‌గా ప్రతినెలా చెల్లిస్తారు.
- ఇది జూలై నుంచి ప్రారంభమవుతుంది. అప్పటినుంచి రెండేండ్ల వరకు ఇది చెల్లుబాటవుతుంది. ఈ వ్యవధిలోపు ఏదైనా పరిశోధనలో చేరాలి.

### పరీక్ష విధానం

- పరీక్ష మూడు భాగాలుగా ఉంటుంది. ఇందులో ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 200 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి మార్కుల్లో కోత విధిస్తారు.

**పార్ట్-ఎ:** ఇది అందరికి ఒకేలా ఉంటుంది. జనరల్ ఆప్టిట్యూడ్ (లాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ అనాలిసిస్, అనలిటికల్, న్యూమరికల్ ఎబిలిటీ), క్వాంటిటేటివ్ కంపారిజన్, సిరీస్ ఫార్మేషన్, పజిల్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి.

- ఇందులో మొత్తం 20 ప్రశ్నలు ఉంటాయి. 15 ప్రశ్నలకు జవాబులు రాయాలి. ప్రతి ప్రశ్నకు 2 మార్కుల చొప్పున మొత్తం 30 మార్కులు. ప్రతి తప్పు సమాధానానికి 0.5 మార్కులు కోత విధిస్తారు.

**పార్ట్-బి:** అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టును బట్టి మొత్తం 25 నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. 20 నుంచి 35 ప్రశ్నలకు జవాబులు గుర్తించాలి.

**పార్ట్-సి:** అభ్యర్థి ఎంపికచేసుకున్న సబ్జెక్టును బట్టి 30 నుంచి 80 ప్రశ్నలు ఇస్తారు. ఇందులో సైంటిఫిక్ విషయాలపై, సైంటిఫిక్ అప్లికేషన్లపై అభ్యర్థికి ఉన్న జ్ఞానాన్ని పరిశీలిస్తారు.

- ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్, ప్లానెటరీ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులకు సంబంధించి పార్ట్-బి, సిలలో ప్రశ్నల సంఖ్య, మార్కులు, నెగెటివ్ మార్కింగ్‌లో తేడా ఉంటుంది.

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000, ఓబీసీలకు రూ.500, ఎస్సీ, ఎస్టీలకు రూ.250, పీడబ్ల్యూడీలకు ఎలాంటి ఫీజు లేదు.
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఏప్రిల్ 15
- **ఆన్‌లైన్ చెల్లింపులకు చివరితేదీ:** ఏప్రిల్ 16
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడింగ్:** మే 15 నుంచి
- **పరీక్ష తేదీ:** జూన్ 21
- **పరీక్ష ఫలితాలు:** జూలై రెండో వారంలో
- **వెబ్‌సైట్:** www.nta.ac.in, csirnet.nta.nic.in

## యూజీసీ

**దేశంలోని యూనివర్సిటీలు, కాలేజీల్లో అధ్యాపకులుగా, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా చేరేందుకు, పరిశోధనలు చేసేందుకు అర్హత కల్పించడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షను నిర్వహిస్తుంది. దీనిలో అర్హత సాధించి యూనివర్సిటీల్లో పరిశోధనలు చేయడానికి ఆసక్తి చూపేవారికి జూనియర్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్)ను అందిస్తుంది. ఈ ప్రవేశ పరీక్షను ఏటా రెండుసార్లు (జూన్, డిసెంబర్) నిర్వహిస్తారు. ప్రస్తుతం జూన్ సెషన్‌కు సంబంధించిన నోటిఫికేషన్ యూజీసీ నెట్-2020ను విడుదల చేసింది. దీనికి సంబంధించిన వివరాలు..**

- ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. ప్రతి పేపర్లో ఆబ్జెక్టివ్ టైప్ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పరీక్షను మూడు గంటల్లో పూర్తి చేయాలి. నెగెటివ్ మార్కింగ్ లేదు. పేపర్-1కు గంట, పేపర్-2కు రెండు గంటలు. ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ).
- మొదటి పేపర్ 100 మార్కులకు ఉంటుంది. ఇందులో 50 ప్రశ్నలకు జవాబు రాయాలి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. ఇందులో టీచింగ్ ఆప్టిట్యూడ్ లేదా రిసెర్చ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, డైవర్జెంట్ థింకింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ నుంచి ప్రశ్నలు వస్తాయి. ఈ పేపర్ అందరికీ ఒకేలా ఉంటుంది.
- రెండో పేపర్ 200 మార్కులకు ఉంటుంది. 100 ప్రశ్నలకు జవాబు రాయాలి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. ఇందులో అభ్యర్థి ఎంపికచేసుకున్న సబ్జెక్టు నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- జేఆర్ఎఫ్‌కు క్యాలిఫై అయినవారు పీజీలో వారి సబ్జెక్టుపై పరిశోధన చేయాలి.

### అర్హతలు

- హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, లాంగ్వేజెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎలక్ట్రానిక్స్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్‌ను 55 శాతం మార్కులతో పూర్తిచేసినవారు, పీజీ చివరి సెమిస్టర్ చదువుతున్నవారు ఈ పరీక్ష రాయవచ్చు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉన్నా సరిపోతుంది. అదేవిధంగా పీజీ లేదా తత్సమాన కోర్సు చివరి ఏడాది చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఎలాంటి వయోపరిమితి లేదు. అయితే జేఆర్ఎఫ్ అభ్యర్థులు మాత్రం 2020, జూన్ 1 నాటికి 30 ఏండ్ల లోపు ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ట్రాన్స్‌జెండర్స్, మహిళలు, సాయుధ బలగాలకు, ఎల్ఎల్ఎం పూర్చిచేసినవారి వయోపరిమితిలో సడలింపులు ఉంటాయి.

### సబ్జెక్టులు

- అభ్యర్థులు పేపర్-2కి సంబంధించి ఏదైనా సబ్జెక్టును ఎంపికచేసుకోవాలి. నెట్‌లో జాగ్రఫీ, హిస్టరీ, ఎకనామిక్స్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, తెలుగు, ఇంగ్లిష్, ఎడ్యుకేషన్, ఫోరెన్సిక్ సైన్స్, ఎలక్ట్రానిక్ సైన్స్, కంప్యూటర్‌సైన్స్ అండ్ అప్లికేషన్స్, క్రిమినాలజీ, సైకాలజీ, సోషల్ వర్క్, సోషియాలజీ, ఉమెన్ స్టడీస్, యోగా వంటి మొత్తం 81 సబ్జెక్టులు ఉన్నాయి.
- **దరఖాస్తులు:** ఆన్‌లైన్‌లో
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000, ఈడబ్ల్యూఎస్, ఓబీసీలకు రూ.500, ఎస్టీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ట్రాన్స్‌జెండర్లకు రూ.250.
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఏప్రిల్ 16
- **ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** ఏప్రిల్ 17
- **అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్:** మే 15
- **పరీక్ష తేదీ:** జూన్ 15 నుంచి 20 వరకు
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్.
- **పరీక్ష ఫలితాలు:** జూలై 5
- **వెబ్‌సైట్:** www.nta.ac.in, ugcnet.nta.nic.in

... ✍ గణేశ్ సుంకరి

# మెడికల్ ప్రొఫెషనల్ పోస్టులు



రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టులు:** మెడికల్ ప్రొఫెషనల్స్ (డాక్టర్లు, నర్స్‌లు, ల్యాబ్ టెక్నీషియన్స్)
- **జీతం:** కన్సాలిడేటెడ్ పే కింద పేర్కొన్న మొత్తం నెలకు ఇస్తారు.
- మెడికల్ ఆఫీసర్-స్పెషలిస్ట్- రూ.1,00,000
- మెడికల్ ఆఫీసర్-ఎంబీబీఎస్- రూ.40,000
- మెడికల్ ఆఫీసర్-ఆయుష్- రూ.35,000
- స్టాఫ్ నర్స్- రూ.23,000
- ల్యాబ్ టెక్నీషియన్- రూ.17,000

**నోట్:** కొవిడ్-19 ప్రత్యేక అలవెన్స్ ప్రపోజల్ ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరితేదీ:** ఏప్రిల్ 3
- **వెబ్‌సైట్:** http://health.telangana.gov.in

# బీబీనగర్ ఎయిమ్స్‌లో





బీబీనగర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది టీచింగ్ పోస్టుల భర్తీకి పుదుచ్చేరిలోని జిప్‌మర్ ప్రకటన విడుదల చేసింది.

- **పోస్టులు:** ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్.
- **మొత్తం ఖాళీలు:** 53
- **పోస్టులవారీగా ఖాళీలు:** ప్రొఫెసర్-6, అడిషనల్ ప్రొఫెసర్-13, అసోసియేట్ ప్రొఫెసర్-11, అసిస్టెంట్ ప్రొఫెసర్-23.
- **విభాగాలు:** అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ, పాథాలజీ అండ్ ల్యాబ్ మెడిసిన్, ఫార్మకాలజీ, కమ్యూనిటీ అండ్ ఫ్యామిలీ మెడిసిన్, ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ, మైక్రోబయాలజీ, పిడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఒబెస్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, ఈఎన్‌టీ, రేడియోడయాగ్నసిస్.
- **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ ఉత్తీర్ణత, టీచింగ్ అనుభవం ఉండాలి.
- **వయస్సు:** ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్ పోస్టులకు 58 ఏండ్లు మించరాదు. అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 50 ఏండ్లు మించరాదు. ఓబీసీలకు మూడేండ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా చేస్తారు.
- **దరఖాస్తు:** ఈమెయిల్/ ఆఫ్‌లైన్‌లో
- **ఈమెయిల్:** aiimsbbhr@gmail.com
- **చివరితేదీ:** ఏప్రిల్ 27
- **వెబ్‌సైట్:** https://www.jipmer.edu.in


## లాక్‌డౌన్ వేళ..

# సెల్ఫ్ స్టడీ టిప్స్



కరోనా మహ్మారితో దేశమంతా లాక్‌డౌన్‌లో ఉంది. అన్ని విద్యాసంస్థలు మూతపడ్డాయి. అయితే ఈ సమయంలో విద్యార్థులకు నిపుణులు ఇచ్చిన టిప్స్ తెలుసుకుందాం..


- సెల్ఫ్ స్టడీ అనేది ఇప్పుడు కీలకం. నిజానికి సొంతంగా చదువుకోవడం అనేది అనుకున్నంత సులభం కాదు. కానీ ఇది కష్టమైన పని. వాస్తవానికి మనకు తెలియని అంశాలు లేదా కాన్సెప్ట్‌లు చదవాలన్నా, నేర్చుకోవాలన్నా ఇబ్బందులు ఉంటాయి. ఈ సమయంలో ఎవరో ఒకరు, ఏదో ఒక రూపంలో సహాయం చేస్తే సులభమవుతుంది. సొంతంగా చదువుకోవాలంటే తప్పనిసరిగా క్రమశిక్షణ, సంస్థ తప్పనిసరి. ఈ క్రమంలో సొంతంగా ఎలా చదువుకోవాలో తెలుసుకుందాం.




- **స్టడీప్లాన్:** మొదటి అడుగు స్టడీప్లాన్. మీకు మీరుగా ఏం చదవలానుకుంటున్నారో దాన్ని నిర్ణీత గడువుకు అనుగుణంగా ఏయే సమయాల్లో ఎన్నిగంటలు చదవాలనే విషయాలను ప్లానర్‌గా రూపొందించుకోవాలి.



- **సొంతంగా నోట్స్:** చదువుకునేటప్పుడు సొంతంగా నోట్స్ తయారుచేసుకోవడం చాలా కీలకం. అంటే మీరు చదువుతున్న పుస్తకంలో అన్ని అంశాలను ప్రతి లైన్ రాసుకోవడమే కాదు.. నేర్చుకునే పాఠంలోని ముఖ్యాంశాలను సబ్ హెడ్డింగ్స్‌గా, ముఖ్యమైన సంకేతాలు, ఫార్ములాలను ఒక దగ్గర రాసిపెట్టుకోవాలి. ముఖ్యమైన నిర్వచనాలను ఒక దగ్గర పాఠ్యాంశాలవారీగా రాసుకోవాలి.



- **వీడియో లెక్చర్స్:** ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉన్న ఈ కాలంలో ప్రత్యక్షంగా తరగతి గదిలో వినే పాఠంతో సమానంగా కొన్ని సందర్భాల్లో అంత కంటే ఎక్కువగా వీడియో క్లాసెస్ ద్వారా నేర్చుకోవచ్చు. వీటికోసం మీకు అనేక ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా కేంద్ర మానవ వనరుల శాఖ అభివృద్ధి చేసిన స్వయం, మూక్స్ తదితర కోర్సులతో పాటు పలు ప్రైవేట్ సంస్థలు అందించే వీడియోపాఠాలు అభ్యసనకు ఉపయోగపడుతాయి.



- **మాక్‌టెస్ట్/ఆన్‌లైన్ క్విజ్:** చదవడం, నేర్చుకోవడం ఎంత ముఖ్యమో వాటి పురోగతి లేదా మూల్యాంకనం అంతే ముఖ్యం. సొంతంగా ఏదైనా అంశం నేర్చుకున్న తర్వాత ఆ అంశం ఎంతవరకు అర్థమైంది. దానిపై ఎంత పట్టుసాధించారో తెలుసుకోవడానికి మీరు తప్పనిసరిగా మాక్‌టెస్ట్ లేదా ఆన్‌లైన్ క్విజ్‌లను రాస్తే మంచిది. దాని ఆధారంగా మీరు నేర్చుకున్న దాన్ని ఎవాల్యుయేషన్ చేసుకోవచ్చు.



- **విశ్రాంతి:** ఇది చివరిది కానీ అతి ముఖ్యమైనది. సొంతంగా నేర్చుకునే సమయంలో గంటల తరబడి చదవవద్దు. మధ్యమధ్యలో చిన్నచిన్న విరామాలు తీసుకోవాలి. వీటివల్ల మీ శక్తి మరింత పెరుగుతుంది. ఒక అంశం నేర్చుకోవడం పూర్తికాగానే కొంత విశ్రాంతి తీసుకుంటే మీ మనసు, శరీరం మీద ఒత్తిడి పడదు.

... ✍ కేశవపంతుల వేంకటేశ్వరశర్మ

# వశిష్ఠ భార్గవ కమిటీ ఏం చెప్పింది?

## గ్రూప్స్ ప్రత్యేకం

**వశిష్ఠ భార్గవ కమిటీ 1969 ఉద్యమంపై ఎలాంటి అభిప్రాయాన్ని తెలిపింది?**

- కేంద్ర ప్రభుత్వం అష్టసూత్ర పథకంలోని మొదటి అంశమైన మిగులు నిధులు లెక్కకట్టడానికి అప్పటి ప్రధాని వశిష్ఠ భార్గవ కమిటీని నియమించింది. ఈ కమిటీ 1969 ఉద్యమంపై ఎలాంటి అభిప్రాయం చెప్పిందో తెలుసుకుందాం..
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన జస్టిస్ వశిష్ఠ భార్గవ చైర్మన్‌గా ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. ఈ కమిటీ తన నివేదికను 1969లో సమర్పించింది. నివేదిక రూపకల్పనకుగాను ఈ కమిటీ నోట్ ఆన్ సేఫ్‌గార్డ్స్-1959లో నిధుల కేటాయింపుల కోసం రీజినల్ కమిటీతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాన్ని 1969 అఖిలపక్ష సమావేశంలో ప్రాంత ప్రాతిపదికగా తీసుకున్నది. వాటి ఆధారంగా మిగులు నిధులను గుర్తించింది.
- 1956-68 మధ్యకాలంలో రూ.28.34 కోట్ల మిగులు నిధులు తెలంగాణకు చెల్లాంచాల్సి ఉంటుందని భార్గవ కమిటీ లెక్కతేల్చింది. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మిగులు నిధులను తక్కువ చేసి చూపే ప్రయత్నం చేసింది. కానీ భార్గవ కమిటీ నివేదికను ఆమోదించలేదు. ఈ కమిటీ పెట్టుబడి వ్యయంలో తెలంగాణ వాటాను మూడింట ఒక వంతు 1/3గా గుర్తించింది.
- మిగులు నిధుల లక్ష్యం ఏమిటంటే ఆంధ్రప్రాంతం సాధించిన ప్రమాణాలు తెలంగాణ ప్రాంతం సాధించలేదు. కాబట్టి తెలంగాణ అభివృద్ధి చెందేవరకు తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు, విద్యా సౌకర్యాలు పెంచడం లక్ష్యం. అయితే ఈ లక్ష్యాలను సాధించేందుకు ఉద్దేశించిన పెద్దమనుషుల ఒప్పందం కచ్చితంగా పాటించడమే కాక దాని అమలుకు అదనపు చర్యలు తీసుకోవాలని 'జస్టిస్ వశిష్ఠ భార్గవ కమిటీ' సూచించింది. ఒకవేళ పెద్దమనుషుల ఒప్పందంలోని అంశాలను తుంగలో తొక్కి ఆంధ్ర పాలకులు తెలంగాణపై తమ సంకుచిత విధానాలను, వివక్షను విడనాడకపోతే ప్రాంతీయ అసమానతలు తీవ్రంగా పెరిగి, భవిష్యత్తులో ఉధృతంగా 'ప్రాంతీయ ఉద్యమం' రావచ్చని జస్టిస్ వశిష్ఠ భార్గవ కమిటీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

**ముగింపు:** తెలంగాణ రీజినల్ కమిటీ గానీ, మాజీ ప్లానింగ్ కమిషన్ సభ్యులు, ఆర్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ సీహెచ్ హనుమంతరావు జస్టిస్ భార్గవ నివేదికను ఆమోదించలేదు. జనాభా ఆధారంగా వెనుకబాటుతనాన్ని చూస్తే తెలంగాణకు దక్కాల్సినది 37.5 శాతం అవుతుందన్నారు. మిగులు నిధులను 1968 నాటి రూపాయి విలువ ప్రకారం లెక్కకట్టాలి లేదా మిగులు నిధులకు వడ్డీ కలపాలని హనుమంతరావు అన్నారు. ఈ పద్ధతులప్రకారం లెక్క కట్టినట్లయితే తెలంగాణ మిగులు నిధులు 117.45 కోట్లు ఉంటుందని ప్రొఫెసర్ హనుమంతరావు అన్నారు.

**1969 ఉద్యమంలో మర్రి చెన్నారెడ్డి, కొండా లక్ష్మణ్ బాపూజీ ఇతరుల ప్రముఖ పాత్రను వివరించండి?**

- 1969 తెలంగాణ ఉద్యమంలో వివిధ వర్గాలతో పాటు వ్యక్తుల ప్రభావం కూడా చాలా ముఖ్యమైంది. వారిలో మర్రి చెన్నారెడ్డి, కొండా లక్ష్మణ్ బాపూజీ ఇతరుల పాత్రను పరిశీలిద్దాం..
- 1969 ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రముఖ పాత్ర పోషించారు. ఇతను తెలంగాణకు మేఘాలయ లాగా ప్రాంతీయ ప్రతిపత్తిని ఇవ్వాలని కోరారు. దాని ప్రకారం ప్రణాళిక, అభివృద్ధి, బడ్జెట్, ఉద్యోగాలు తెలంగాణనే నిర్వహించుకుంటుంది. ఈ సూచనలు తను కేంద్ర ప్రభుత్వానికి వివరించినా అంగీకరించలేదు. కాబట్టి తన జనసంబంధ మంత్రి పదవికి రాజీనామా చేశారు. తర్వాత వీరు ప్రత్యేక తెలంగాణ కాంగ్రెస్ సమితిని స్థాపించారు. అప్పటి నుంచి మలిదశ ఉద్యమంలో కూడా ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ.
- తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను భరించలేక 1969లో ఉద్యమంలోకి వచ్చారు మర్రి చెన్నారెడ్డి. నాన్ గెజిటెడ్ ఉద్యోగులు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన సభలో మర్రి చెన్నారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడకుండా ప్రజల సమస్యలు పరిష్కారం కావని ప్రకటించారు. 1967లో ఈయనపై వందేమాతరం రామచంద్రారావు కేసు వేయగా ఎన్నికల నుంచి ఆరేండ్ల బహిరించారు. దీంతో తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని తర్వాత 'తెలంగాణ ప్రజా సమితి' అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి దేశ ప్రధానికి దీటుగా రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు.
- 1969 ఉద్యమం పట్ల కాసు బ్రహ్మానంద రెడ్డి ప్రభుత్వం గూండాలను దించి వ్యవహరిస్తున్న తీరు, ఆందోళనకారులను చంపడం, తలలు పగులగొట్టడం వంటి దారుణ హత్యలు చూసి మనసు చలించి అప్పటివరకు బ్రహ్మానందరెడ్డికి అనుకూలంగా ఉన్న వెంకటస్వామి సమైక్య సంఘం అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు.
- పై విధంగా 1969 ఉద్యమంలో వివిధ ప్రముఖుల పాత్ర ఎనలేనిది. తెలంగాణలో జరుగుతున్న అన్యాయాలను భరించలేక ఉద్యమంలో కీలకపాత్ర పోషించి ఉద్యమానికి అండగా నిలిచారు.

**1969 తెలంగాణ ఉద్యమ వైఫల్యానికిగల కారణాలను తెలిపి దాని ఫలితాలను వివరించండి?**

**కారణాలు**

1) విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, రాజకీయ నాయకుల మధ్య ఐక్యత లోపించి ఉద్యమం రెండుగా చీలి ఒకటి రక్షణలు కోరకునే వర్గం, మరొకటి ప్రత్యేక తెలంగాణ కోరుకునేదిగా చీలిపోయింది.
2) 1969 ఉద్యమం ప్రభావం పట్టణాలకే పరిమితమై గ్రామస్థాయిలో భావజాల వ్యాప్తి జరగక రైతులు, స్త్రీలు, వృత్తిపనివారు ఉద్యమంలో తక్కువగా పాల్గొన్నారు. దీంతో గ్రామాల్లో ఉద్యమ తీవ్రత అంతగా వ్యాప్తిచెందలేదు.
3) భావజాల వ్యాప్తికి ప్రధాన ఆకర్షణగా నిలిచే సాహిత్యం, కళాకారుల ఆటపాటలు లోపించడం ద్వారా ఉద్యమంలో మెజారిటీ ప్రజల పాత్ర తగ్గిపోయింది.
4) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందన ఎంతసేపు ఉద్యమాన్ని రక్షణ ఒప్పందంగానే భావించారు. కానీ విభజనకు ఏమాత్రం స్పందించలేకపోయారు.
5) 1971లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 14 స్థానాలకుగాను 10 స్థానాలు 'తెలంగాణ ప్రజాసమితి' దక్కించుకున్నా ఫలితం శూన్యంగా మారిపోయింది. కారణం ఆ నాడు కేంద్రప్రభుత్వానికి లోక్‌సభలో తగినంత మెజారిటీ ఉండటం.

- 1969 తెలంగాణ ఉద్యమ ఫలితం విద్యార్థులను ఆగ్రహానికి గురిచేయడంతో బూటకపు ఎన్నికలు బహిష్కరించాలని ప్రకటించారు. వీటివల్ల లాభం లేదని చెప్పారు. ఇదే సమయంలో యువకులు నక్సలిజంవైపు ఆకర్షితులయ్యారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన బ్యాలెట్ ద్వారా సాధ్యంకాదని బుల్లెట్ మార్గం ఎన్నుకుని దండకారణ్యం బాటపట్టారు.
- ఈవిధంగా పై కారణాలవల్ల 1969 ఉద్యమం విఫలమై ఫలితాలు మాత్రం నక్సల్‌బరి ఉద్యమానికి దారితీశాయి. ఈ ఉద్యమంవల్ల లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉన్నాయి. కానీ మలిదశ ఉద్యమంలో ఈ లోపాన్ని సవరించుకుని విద్యార్థులు, ఉద్యోగ, రాజకీయ నాయకులు, సామాన్య ప్రజలు ఐక్యతతో ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించుకున్నారు.



సాసాల మల్లికార్జున్
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కోరుట్ల
9492 575 006